PRAJASAKTI Regd.No. 15795/68
సిటీ◆
ప్రజాశక్తి
ప్రతి అక్షరం ప్రజల పక్షం
Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu
సంపుటి : 44 సంచిక : 267 | విజయవాడ, బుధవారం 30 ఏప్రిల్ 2025 | 8 + 8 పేజీలు వెల : 5.50
Vol No | Vijayawada, Wednesday 30 April 2025 | Rs



అదానీ లంచం కేసులో భారత్ స్పందించలేదు

- అమెరికా కోర్టుకు ఎస్ఇసి వెల్లడి

7

డిఎస్‌సిలో మార్కుల తగ్గింపు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన డిఎస్‌సి నోటిఫికేషన్‌లో సవరణలు చేసింది. గతంలో స్కూల్ అసిస్టెంట్ విభాగంలో లాంగ్వేజస్, నాన్ లాంగ్వేజస్ సబ్జెక్టుల్లో ఎస్‌సి, ఎస్‌టి, బిసి, వికలాంగ అభ్యర్థులకు 45 శాతంగా విధించిన మార్కుల అర్హతను 40 శాతానికి తగ్గించింది. ఈ ఉత్తర్వులు ట్రైనెడ్ గ్రాడ్యుయేట్ విభాగంలో లాంగ్వేజస్, నాన్‌లాంగ్వేజస్ అభ్యర్థులకూ వర్తిస్తాయని పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ విజయరామరాజు మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పై సవరణలతోపాటు అభ్యర్థులు దరఖాస్తులు చేసుకునే సమయంలో అప్‌లోడ్ చేయాల్సిన సర్టిఫికెట్లను ఐచ్ఛికం చేస్తూ వెసులుబాటు కల్పించారు. అయితే అభ్యర్థులు నిర్ధారిత విద్యార్హతలు తప్పనిసరిగా కలిగి ఉండాలి.

సహకార ఎన్నికలు లేనట్లేనా!

డిసిసిబి, డిసిఎంఎస్ ఛైర్మన్ నియామకాలతో సంకేతం

- పుష్కర కాలంగా కోపరేటివ్స్‌కు ఎలక్షన్లు లేవు
- ఆర్నెల్లలో నిర్వహిస్తామని వెనక్కి
- కేంద్రం నిర్దేశాలే కారణం



ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి- అమరావతి

జిల్లా కేంద్ర సహకార బ్యాంకులు (డిసిసిబి), జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీ (డిసిఎంఎస్)లకు ఛైర్‌పర్సన్లను టిడిపి కూటమి ప్రభుత్వం నియమిస్తున్న నేపథ్యంలో రాష్ట్రంలో పుష్కర కాలంగా వాయిదా పడుతూ వస్తున్న సహకార ఎన్నికలు ఇప్పట్లో లేనట్లేనని తెలుస్తోంది. కూటమిలోని టిడిపి, జనసేన, బిజెపిలు డిసిసిబి, డిసిఎంఎస్ ఛైర్‌పర్సన్ పదవులను పంచుకొని నియామకాలు చేపట్టాయి. ఇప్పటికే పది ఉమ్మడి జిల్లాల డిసిసిబి, డిసిఎంఎస్ అధ్యక్షులను ముఖ్యమంత్రి చంద్రబాబు ఎంపిక చేశారు. త్వరలోనే తతిమ్మా మూడు జిల్లాలకు ఛైర్‌పర్సన్లను వేయబోతున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడానికి కృషి చేసిన, ఎంఎల్ఎ టిక్కెట్లు ఇవ్వలేకపోయిన, పార్టీని అంటిపెట్టుకొని సేవ చేసిన వారిని గుర్తించి 'సహకార' పదవులిస్తున్నామని చంద్రబాబు వెల్లడించారు. చట్ట ప్రకారం ఈ పదవుల కాలపరిమితి ఆరు మాసాలు. ఆ లోపు కోఆపరేటివ్ ఎన్నికలు నిర్వహిస్తే అక్కడితో పదవులు పోతాయి. ఒక వేళ ఎన్నికలు నిర్వహించకుండా ఉంటే ఈ ఆర్నెల్లే కాకుండా మరో ఆరు నెలలు సదరు పదవుల్లో వారినే కొనసాగించొచ్చు. కొత్త వారినీ ఆ స్థానాల్లో నియమించొచ్చు. 'సేవ'ను గుర్తించి పదవులకు ఎంపిక చేశామని సిఎం పేర్కొన్న తరుణంలో ఆర్నెల్ల లోపు ఎన్నికలు నిర్వహించే అవకాశం లేదు. వీరి పదవీ కాలం ముగిసినా సాధారణంగా సహకార ఎన్నికలు జనవరి, ఆ ప్రాంతంలో నిర్వహిస్తారు. అందుకు కారణం వ్యవసాయ పనులు. ఆ రీత్యా చూస్తే వచ్చే ఏడాది జనవరి వరకు ఎన్నికలు లేనట్లే.

కేంద్రం ప్రభావం

సహకార శాఖను కేంద్రంలో సృష్టించిన మోడీ సర్కారు రాష్ట్రాల పరిధిలోని సహకార రంగంపై పట్టు బిగించింది. సహకార సంస్థల్లో కంప్యూటరీకరణ కోసం కేంద్రం అమలు చేస్తున్న పథకానికి 2027 వరకు గడువుంది. సహకార సంస్థలను కమర్షియల్ సంస్థలుగా మార్చడానికి రాష్ట్రాలకు ప్లాన్ ఇచ్చింది. ఆర్థికంగా మనలేని వాటిని మూసేయమంది. ఈ ప్లాన్‌కు కూటమి సర్కారు అంగీకరించింది. ఈ కసరత్తు పూర్తయ్యే వరకు సహకార ఎన్నికలు ఉండవని తెలుస్తోంది.

రాజకీయ పునరావాసం

రాష్ట్రంలో సహకార ఎన్నికలు... ఉమ్మడి రాష్ట్రంలో 2013 జనవరిలో జరిగాయి. 2018 జనవరితో గడువు ముగిసింది. అప్పటి నుంచి టిడిపి సర్కారు ప్రతి ఆర్నెల్లకూ పాలకవర్గాల గడువు పొడిగించింది. తాను దిగిపోయేంత వరకు ఎన్నికలు నిర్వహించలేదు. వైసిపి ప్రభుత్వం ఎన్నికలు నిర్వహించకుండా ఏవో సాకులతో ఐదేళ్లు కాలక్షేపం చేసింది. పర్సన్ ఇన్‌ఛార్జిల (అధికారులు)ను నియమించే ఆనవాయితీకి స్వస్తి పలికి పార్టీ నాయకులు, కార్యకర్తలతో అనధికారిక (నాన్ అఫిషియల్) సభ్యులతో ప్రతి ఆర్నెల్లకో మారు కమిటీలు వేసి కొత్త ధోరణికి తెర తీసింది. వైసిపి వైఖరిని తప్పుబట్టిన టిడిపి ఇప్పుడు వైసిపి దారిలోనే నడుస్తోంది. అధికారంలోకి వచ్చిన తొలి రోజుల్లో ఆర్నెల్లలో సహకార ఎన్నికలు నిర్వహిస్తామని ప్రకటించింది. పాలనలోకొచ్చి పది నెలలు గడిచాక హఠాత్తుగా డిసిసిబి, డిసిఎంఎస్ ఛైర్మన్ పదవుల నియామక ప్రక్రియ ప్రారంభించడంతో ఇప్పట్లో సహకార ఎన్నికలు పెట్టే ఉద్దేశం ప్రభుత్వానికి లేదని అర్థమవుతోంది. క్షేత్ర స్థాయిలోని ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాల (పిఎసిఎస్) ఎన్నికలతో డిసిసిబి, డిసిఎంఎస్‌లకు ఎన్నికలు జరుగుతాయి. జిల్లా స్థాయి కోఆపరేటివ్ సంస్థల పదవులను ప్రభుత్వం నామినేట్ చేస్తున్నందున పిఎసిఎస్‌లకు సైతం నాన్ అఫిషియల్ కమిటీలు వేస్తారని తెలుస్తోంది. సహకార సంస్థలకు క్రమం తప్పకుండా ఎన్నికలు నిర్వహించడం ద్వారా ఆ వ్యవస్థ పరిపుష్టి కావడానికి, పారదర్శకంగా పని చేయడానికి దోహదపడుతుంది. టిడిపి, వైసిపి సహకార సంస్థలను రాజకీయ పునరావాస కేంద్రాలుగా మార్చేశాయి. సహకార సంస్థల్లో షేర్ హోల్డర్లుగా ఉన్న రైతులను, కౌలు రైతులను ఆదుకొనే బాధ్యత నుంచి వైదొలిగాయన్న విమర్శలను మూటగట్టుకుంటున్నాయి.

రూ.6.60 లక్షల కోట్లతో రుణప్రణాళిక

- గతేడాదితో పోలిస్తే 22 శాతం అదనం
- ప్రభుత్వానికి అండగా నిలవాలని బ్యాంకర్లను కోరిన చంద్రబాబు



బ్యాంకర్ల సమావేశంలో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి చంద్రబాబు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్ర ప్రభుత్వం 2025-26 ఆర్థికసంవత్సరానికి రూ.6.60 లక్షల కోట్లతో వార్షిక రుణ ప్రణాళికలను విడుదల చేసింది. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అధ్యక్షతన మంగళవారం 231వ రాష్ట్రస్థాయి బ్యాంకర్ల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో గత ఏడాది (2024-25)తో పోలిస్తే 22శాతం అదనంగా రుణప్రణాళికను విడుదల చేశారు. గత ఏడాది వార్షిక రుణ ప్రణాళిక రూ.5.40 లక్షల కోట్లు ఉండగా ఈ ఏడాది రూ.6.60 లక్షల కోట్లకు లక్ష్యాన్ని పెంచారు. ఇందులో వ్యవసాయానికి రూ.3.06 లక్షల కోట్లు, ఎంఎస్ఎంఇ రంగానికి రూ.1.28 లక్షల కోట్లు మొత్తంగా ప్రాధాన్యతా రంగానికి రూ.4.58 లక్షల కోట్లు కేటాయించారు. ప్రాధాన్యేతర రంగానికి రూ.2.02 లక్షల కోట్లు నిర్దేశించారు. గతేడాది లక్ష్యానికి మించి రూ.6,83,672 కోట్ల రుణాలు మంజూరు చేశారు. లక్ష్యంలో ఇది 127 శాతం వృద్ధి. గత ఆర్థిక సంవత్సరంలో వ్యవసాయ రంగానికి రూ.2.64 లక్షల కోట్లు లక్ష్యంగా పెట్టుకోగా రూ.3.07 లక్షల కోట్లు కేటాయించి 116 శాతం వృద్ధి సాధించారు. ఇందులో ఖరీఫ్‌లో రూ.1,69,797 కోట్లు, రబీలో రూ.1,37,291 కోట్లు రుణాలు ఇచ్చారు. ఎంఎస్ఎంఇ రంగానికి గత సంవత్సరం రూ.85 వేల కోట్లు ఇవ్వాలని నిర్దేశించుకోగా రూ.95,620 కోట్లు ఇచ్చారు. వాటిల్లోనూ మైక్రో ఎంటర్‌ప్రైజెస్‌కు రూ.49,522 కోట్లు, స్మాల్ ఇండస్ట్రీస్‌కు రూ.27,632 కోట్లు, మీడియం ఎంటర్‌ప్రైజెస్‌కు రూ.18,138 కోట్లు ఇచ్చినట్లు బ్యాంకర్లు తెలిపారు. అనంతరం ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్ మాట్లాడుతూ రుణ ప్రణాళిక అమలులో వృద్ధి రేటు పడిపోతోందని అన్నారు. 2023-24లో 138 శాతంగా వృద్ధి ప్రణాళిక ఉంటే 2024-25లో 127 శాతానికి తగ్గిందని చెప్పారు. అనంతరం సిఎం చంద్రబాబునాయుడు మాట్లాడుతూ ఏ రంగం పురోగతి సాధించాలన్నా బ్యాంకుల మద్దతు తప్పనిసరని అన్నారు. వివిధ రంగాల్లో భారీ ప్రాజెక్టులు వస్తున్నాయని, వాటికి అవసరమైన ఆర్థిక మద్దతు ఇవ్వాలని సూచించారు. ఇంటికో ఎంటర్‌ప్రెన్యూర్ లక్ష్యంతో

మిగతా 7లో

కాంట్రాక్టు ఉద్యోగుల పదవీకాలం మరో ఏడాది పొడిగింపు

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

రాష్ట్ర ప్రభుత్వ శాఖల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగుల పదవీ కాలాన్ని మరో ఏడాదికి పొడిగిస్తూ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు ఆర్థికశాఖ మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. వాస్తవానికి గత నెల మార్చి 31తోనే వారి కాంట్రాక్టు కాలం పూర్తికావడం గమనార్హం. రాష్ట్రంలోని వివిధ శాఖల్లో, శాఖాధిపతుల కార్యాలయాల్లో, జిల్లాల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులను వచ్చే ఏడాది మార్చి 31 వరకు కొనసాగించేందుకు నిర్ణయించారు. ఈ మేరకు రాష్ట్ర, జిల్లా స్థాయి అధికారులు అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆర్థికశాఖ స్పష్టం చేసింది.

సైన్యానికి పూర్తి స్వేచ్ఛ

- ఉగ్రవాదాన్ని అణచివేసేందుకు సర్వాధికారాలు
- ప్రకటించిన ప్రధాని మోడీ
- సిడిఎస్, రక్షణమంత్రి, ఎన్ఎస్ఎలతో కీలక భేటీ



న్యూఢిల్లీ : పహల్గాం ఉగ్ర దాడి నేపథ్యంలో భారత్ ఏ విధంగా స్పందించాలనే విషయమై సాయుధ బలగాలకు పూర్తి స్వేచ్ఛను ఇచ్చినట్లు ప్రధాని మోడీ ప్రకటించారు. ఏ సమయంలో ఎలా స్పందించాలి, లక్ష్యాలేమిటి అనే విషయమై నిర్ణయం తీసుకునేందుకు సైన్యానికి పూర్తి నిర్వహణాపరమైన స్వేచ్ఛ వుంటుందని తెలిపారు. సర్వాధికారాలు వారికే అప్పగించినట్లు తెలిపారు. ఉగ్రవాదాన్ని ఉక్కుపాదంతో అణచివేయాలన్నది జాతీయస్థాయిలో తీసుకున్న ఏకగ్రీవ తీర్మానమని పేర్కొన్నారు. భారత సాయుధ బలగాల శక్తి సామర్థ్యాల పట్ల తమకు పూర్తి స్థాయి విశ్వాసం వుందని పేర్కొన్నారు. పహల్గాం దాడి అనంతరం సరిహద్దులో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్న వేళ ఢిల్లీలోనూ కీలక పరిణామాలు చోటు చేసుకుంటున్నాయి. ప్రధాని మోడీ నివాసంలో మంగళవారం కీలక సమావేశం నిర్వహించారు. దాదాపు గంటన్నరపాటు సాగిన ఈ సమావేశంలో రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్ (సిడిఎస్) అనిల్ చౌహాన్, జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్, త్రివిధ దళాల అధిపతులతో సహా ఉన్నత స్థాయి

మిగతా 7లో



సావనీర్‌ను ఆవిష్కరిస్తున్న మంత్రి అచ్చెన్నాయుడు

వ్యవసాయ విద్యకు ప్రోత్సాహం

- లాంలో వ్యవసాయ విశ్వవిద్యాలయం డైమండ్ జూబ్లి ఉత్సవాల్లో మంత్రి అచ్చెన్నాయుడు

ప్రజాశక్తి- గుంటూరు జిల్లా ప్రతినిధి

రాష్ట్రంలో వ్యవసాయ విద్యకు ప్రభుత్వం ప్రోత్సాహం ఇస్తోందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కె.అచ్చెన్నాయుడు తెలిపారు. గుంటూరు జిల్లా లాంలో వ్యవసాయ విశ్వవిద్యాలయం డైమండ్ జూబ్లి ఉత్సవాలు మంగళవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. రెండు రోజులపాటు జరిగే ఈ ఉత్సవాలకు తొలిరోజు మంత్రి అచ్చెన్నాయుడు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. తొలుత ఆయన వ్యవసాయ ప్రదర్శనను ప్రారంభించారు. పైలాన్‌ను, విశ్వవిద్యాలయం సావనీర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సుమారు 150 వరకు వ్యవసాయ, వ్యవసాయ అనుబంధ రంగాల స్టాళ్లు, విశ్వవిద్యాలయాల స్టాళ్లు, ప్రైవేట్ ఇండస్ట్రీ నుంచి స్టాళ్లు ఏర్పాటు చేసి వ్యవసాయ సాంకేతికతకు సంబంధించిన ఆధునిక టెక్నాలజీని పరికరాలను ప్రదర్శనలో ఉంచారు. ఉపకులపతి డాక్టర్ ఆర్ శారద జయలక్ష్మీదేవి అధ్యక్షతన జరిగిన సభలో మంత్రి అచ్చెన్నాయుడు మాట్లాడుతూ వ్యవసాయ విశ్వవిద్యాలయ విద్యార్థులు ప్రపంచంలో అన్ని రంగాల్లో అత్యంత ప్రతిష్టాత్మకమైన స్థానాల్లో ఉన్నారని కొనియాడారు. వ్యవసాయ

మిగతా 7లో

ఐదో అంతస్తు నుంచి పడి ముగ్గురు భవన నిర్మాణ కార్మికుల దుర్మరణం

ప్రజాశక్తి- తిరుపతి(మంగళం)

తిరుపతి జిల్లా మంగళం పరిధిలోని తిరుమలనగర్ గ్రామపంచాయతీలో నిర్మాణంలో ఉన్న భవనం ఐదో అంతస్తు నుంచి పడి ముగ్గురు భవన నిర్మాణ కార్మికులు దుర్మరణం చెందారు. తుడా క్వార్టర్స్‌లోని హెచ్‌ఐజి ఫ్లాట్ నెంబర్ 63లో ఈ ఘటన మంగళవారం చోటుచేసుకుంది. ఈ భవనాన్ని రిటైర్డ్ టీచర్ కడివేటి అండాలయ్య నిర్మిస్తున్నారు. భవన నిర్మాణం కోసం తిరుపతి పట్టణాభివద్ధి సంస్థ నుండి జి ప్లస్ 3 అనుమతి తీసుకొని జి ప్లస్ 5 అంతస్తులు నిర్మిస్తున్నారు. ఐదో అంతస్తులో పడమటి వైపు పూతపని చేయడానికి నలుగురు మేస్త్రీలు సిమెంటు కలవతో పైకి వెళ్లారు. వీరు పైకి వెళ్లడానికి వీలుగా కర్రలతో ఏర్పాటు చేసుకున్న 'సారవ' నుంచి ఓ కర్ర జారిపోవడంతో పైనుంచి ఒక్కసారిగా కింద పడిపోయి తిరుపతికి చెందిన బోటతొట్టి శ్రీనివాసులు (38), ఒంగోలు జిల్లా ఆకర్లపూడి గ్రామానికి చెందిన బావమరుదులు తన్నీరు వసంత్ (40), కె.శ్రీనివాసులు (38) అక్కడికక్కడే మృతి చెందారు.

అదాని కోస్ట్‌గా విశాఖ తీర ప్రాంతం

ప్రొఫెసర్ కెఎస్.చలం



రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న కెఎస్.చలం, చిత్రంలో ఎంవిఎస్.శర్మ, సోహన్ హటంగడి

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ (విశాఖ)

విశాఖపట్నం తీర ప్రాంతం అదాని కోస్ట్‌గా మారిపోతోందని యుపిఎస్‌సి మాజీ ఛైర్మన్ ప్రొఫెసర్ కెఎస్.చలం అన్నారు. విశాఖలో ప్రభుత్వ భూములు, ఆస్తుల బదలాయింపుపై వార్వా, నివాస్ సంఘాల ఆధ్వర్యంలో అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రంలో రౌండ్ టేబుల్ సమావేశం మంగళవారం జరిగింది. దీనికి ముఖ్య అతిథిగా హాజరై ఆయన మాట్లాడుతూ ప్రభుత్వాన్ని చేతిలో పెట్టుకొని పెట్టుబడిదారులు మన ఆస్తులను, భూములను కొట్టేస్తున్నారన్నారు.

మనపై పెత్తనం చెలాయిస్తున్నారని తెలిపారు. విస్తారంగా ఉన్న రక్షిత అడవులను, తీర ప్రాంతాన్ని కూడా చేజిక్కించుకుంటున్నారని వివరించారు. చివరికి మన తీర ప్రాంతం అదానీ కోస్ట్‌గా మారిపోయిందని ఆందోళన వ్యక్తం చేశారు. మరో వక్త పర్యావరణ కార్యకర్త సోహన్ హటంగడి మాట్లాడుతూ నగరానికి ప్రాణవాయువును సరఫరా చేసే మధురవాడ హిల్ నెంబర్ 3లోని ప్రాంతాన్ని ఎకరా 99 పైసలు చొప్పున 22 ఎకరాలను టిసిఎస్‌కు ఇచ్చేయడానికి నిర్ణయం జరిగిందని, టిసిఎస్ పేద సంస్థ ఏమీ కాదని, రాష్ట్ర జిడిపిలో సుమారు సగం ఆ సంస్థ లాభాలు ఆర్జిస్తోందని చెప్పారు. ఈ భూ కేటాయింపు నిర్ణయం అన్యాయమైనదన్నారు. దీనిపై రాష్ట్ర ప్రభుత్వం పునరాలోచన చేయాలని కోరారు. నగరంలోని పచ్చని ప్రదేశాలను కాంక్రీట్ అడవులుగా మార్చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆర్‌కె బీచ్ నుంచి హార్బర్ పార్క్ వరకూ 14 ఎకరాల్లో లూలూ మాల్ పెడితే ఆ ప్రాంతంలో పర్యావరణం దెబ్బతింటుందని, కాలుష్యం పెరుగుతుందని, ట్రాఫిక్ పెరగడమే కాకుండా భద్రత లోపిస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. మాజీ ఎమ్మెల్సీ ఎంవిఎస్.శర్మ మాట్లాడుతూ ప్రభుత్వ భూమి అంటే అది ప్రజల భూమి అని, దీన్ని ప్రజా ప్రయోజనం కోసమే వినియోగించాలని అన్నారు. ఉపాధి కల్పిస్తామనే ఉత్తుత్తి హామీలతో విశాఖ నగర భూములను కార్పొరేట్లకు ఇస్తే సహించేది లేదని హెచ్చరించారు. గతంలోనూ ఇలాగే భూములు ఇచ్చేశారని, ఉద్యోగాలు మాత్రం కల్పించలేదని తెలిపారు. అభివృద్ధి పేరుతో భూముల అమ్మకం నగర వినాశనానికి దారితీస్తుందని తెలిపారు. ఇటువంటి అరాచక నిర్ణయాలను తక్షణమే ఉపసంహరించుకోవాలని, లేకుంటే ప్రజా మద్దతుతో తిప్పికొడతామని హెచ్చరించారు. వార్వా అధ్యక్షులు ఎన్.ప్రకాష్‌రావు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో వార్వా ప్రధాన కార్యదర్శి బిబి.గణేష్, నివాస్ ప్రధాన కార్యదర్శి పిట్టా నారాయణమూర్తి, అధ్యక్షులు బి.గురప్ప, తదితరులు పాల్గొన్నారు.

పహల్గాం ఉగ్రదాడి హేయం

- సుంకాల పేరుతో ప్రపంచ దేశాలపై అమెరికా వాణిజ్య యుద్ధం : వి.శ్రీనివాసరావు
- నరసరావుపేటలో సిపిఎం కార్యాలయం ప్రారంభం



సభలో మాట్లాడుతున్న వి శ్రీనివాసరావు

ప్రజాశక్తి- పల్నాడు జిల్లా

పహల్గాంలో ఉగ్రవాదుల దాడి అత్యంత హేయమైన చర్య అని, ఈ దాడులను కులమతాలను అతీతంగా ప్రతి ఒక్కరూ ఖండించాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు అన్నారు. మంగళవారం ఆయన నరసరావుపేట పట్టణం కోటప్పకొండ రోడ్డులోని పల్నాడు విజ్ఞాన కేంద్రంలో నూతనంగా నిర్మించిన సిపిఎం కార్యాలయాన్ని ప్రారంభించారు. రాష్ట్ర కమిటీ సభ్యులు వి.కృష్ణయ్య ఎర్ర జెండాను ఆవిష్కరించారు. పుచ్చలపల్లి సుందరయ్య తదితరుల చిత్రపటాలకు వి.శ్రీనివాసరావు, సీనియర్ నాయకులు గద్దె చలమయ్య పూల మాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు వై.రాధాకృష్ణ అధ్యక్షతన జరిగిన సభలో ముందుగా పహల్గాం మృతులకు సంతాపం ప్రకటించారు. అనంతరం వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఇష్టానుసారంగా సుంకాల పేరుతో ప్రపంచ దేశాలపై వాణిజ్య యుద్ధం ప్రకటించారని తెలిపారు. భారతీయ విద్యార్థులను సంకెళ్లు వేసి స్వదేశానికి పంపడం దుర్మార్గమన్నారు. ఇటువంటి ట్రంప్‌ను మోడీ ప్రాణస్నేహితుడని భుజాలపైకి ఎత్తుకోవడం సిగ్గుచేటని తెలిపారు. అన్ని రంగాల్లో అమెరికాకు చైనా పోటీగా నిలుస్తున్నందున ఆ దేశ ఆర్థిక వ్యవస్థను దెబ్బతీయాలని ట్రంప్ చూస్తున్నారని వివరించారు. చైనా నుండి 150 దేశాలకు అవుతున్న ఎగుమతులను అడ్డుకోవాలనే ట్రంప్ విధానాలకు చైనా దీటుగా సమాధానం చెబుతోందన్నారు. పెట్టుబడిదారీ విధానాలను ఢీకొట్టగలిగే శక్తి సోషలిస్టు దేశాలకు మాత్రమే ఉందని తెలిపారు. రాష్ట్రంలో, దేశంలో రాజకీయ పరిణామాలు వేగంగా మారుతున్నాయని, ఈ పరిణామాలు కమ్యూనిస్టు పార్టీలకు బలం చేకూర్చే విధంగా ఉన్నాయని తెలిపారు. ఉగ్రవాదం దేశానికి ప్రమాదకరంగా మారిందని, ఉగ్ర దాడుల్లో హిందువులు, ముస్లిములు మతి చెందారని తెలిపారు. ఆర్ఎస్ఎస్, మోడీ మాత్రం హిందువులే లక్ష్యంగా ఉగ్రవాదులు కాల్పులకు తెగబడ్డారని ప్రచారం చేస్తుండడం శోచనీయమన్నారు. ఉగ్రదాడులను సిపిఎం తీవ్రంగా వ్యతిరేకిస్తోందన్నారు. మతోన్మాదాన్ని పెంచి పోషిస్తోన్న, దేశ ప్రజలను విభజించాలని చేస్తోన్న బిజెపి ప్రయత్నాలను అడ్డుకుంటామన్నారు. మతోన్మాద విధానాలు దేశానికి, దేశ ప్రజలకు ప్రమాదకరమని ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో అధికారంలో ఉన్న టిడిపి కూటమి ప్రభుత్వం తొలి సంతకాన్ని డిఎస్‌సిపై పెట్టి ఏడాదికి నోటిఫికేషన్ విడుదల చేసిందన్నారు. మంత్రి నారా లోకేష్ తమ ప్రభుత్వం వేగంగా పనిచేస్తోందని చెపుతుండడాన్ని వి.శ్రీనివాసరావు ప్రస్తావిస్తూ, రాష్ట్రాభివృద్ధి కోసం, రాష్ట్ర ప్రజల కోసం కోసం పనిచేయడం లేదని, కార్పొరేట్లకు భూములు కట్టబెట్టడానికి, వారి ప్రయోజనాల కోసం వేగంగా పనిచేస్తుందని ఎద్దేవా చేశారు. పి-4 పేరుతో నాలుగు కుటుంబాలను దత్తత తీసుకున్న పోలవరం పనులు చేస్తున్న మెగా కంపెనీ ఒక్కో కార్మికునికీ రూ లక్ష వేతన బకాయిలు చెల్లించకుండా ఇబ్బందులు పెడుతోందని తెలిపారు. దేశ ఆర్థిక వ్యవస్థ తీవ్ర సంక్షోభంలో ఉందన్నారు. రాష్ట్ర ఉప సభాపతి, ఎమ్మెల్యే రఘురామకృష్ణరాజు అరాచకాలపై ప్రశ్నిస్తే, వ్యక్తిగత దూషణలకు దిగడం, చౌకబారు విమర్శలు చేయడం తగదన్నారు. సూపర్ సిక్స్ పేరిట ఇచ్చిన హామీలను టిడిపి కూటమి ప్రభుత్వం అమలు చేయాలని డిమాండ్ చేశారు.

వి.కృష్ణయ్య మాట్లాడుతూ రాష్ట్రంలో వ్యవసాయ ఉత్పత్తులకు గిట్టుబాటు ధరలు లేక రైతులు తీవ్ర ఆర్థిక సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నారని, పుస్తెలు తాకట్టు పెట్టి సాగు చేసిన పంటలకు గిట్టుబాటు ధర దక్కక అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. డాక్టర్ స్వామినాథన్ కమిటీ సిఫార్సులు అమలు చేసి కేరళ తరహా రుణవిమోచన చట్టాన్ని అమలు చేసి దేశానికి వెన్నెముక అయిన రైతులను ఆదుకోవాల్సిన బాధ్యత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పల్నాడు జిల్లా కార్యదర్శి గుంటూరు విజయకుమార్, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఏపూరి గోపాలరావు, ఎస్.ఆంజనేయులు నాయక్, అనుముల లక్ష్మీశ్వర రెడ్డి, జి.రవిబాబు తదితరులు పాల్గొన్నారు.

సొంత ఆదాయం ఎలా!

- వచ్చేనెల ఖర్చుల కోసం ఆర్థికశాఖ ఆందోళన

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి



రాష్ట్ర ఆదాయంపై అనిశ్చితి నిరంతరంగా కొనసాగుతూనే ఉంది. బడ్జెట్ అంచనాలు ఎప్పుడూ అందులో లేని పరిస్థితే! ముందటి సంవత్సరం కన్నా కొద్దిగా ఆదాయం పెరుగుదల కనిపిస్తున్నప్పటికీ, వార్షిక అంచనాలను మాత్రం అందుకోలేని పరిస్థితి నెలకొంటోంది. గత కొన్నేళ్లుగా రాష్ట్ర సొంత ఆదాయం ఆశించిన స్థాయిలో పెరగడం లేదు. జిఎస్‌డిపిని గణనీయంగా పెంచుకుంటూ పోతున్నప్పటికీ అందులో సొంత పన్నుల వాటా మాత్రం పెరగకపోవడం గమనార్హం. గత ఐదేళ్లలో ఎప్పుడూ 6.5 శాతం జిఎస్‌డిపిలో వాటా దాటకపోవడంపై అధికారులే పెదవి విరుస్తున్నారు. ఇతర రాష్ట్రాల్లో జిఎస్‌డిపిలో సొంత పన్ను ఆదాయం వాటా అధికంగా నమోదవుతుండగా, మన రాష్ట్రంలోనే తక్కువగా ఉంటోందని గణాంకాలు చెబుతున్నాయి. పక్కనున్న తెలంగాణ రాష్ట్రంలో 9.51 శాతంగా నమోదుకాగా, ఎపిలో కేవలం 6.48 శాతంగా జిఎస్‌డిపిలో సొంత ఆదాయం వాటా ఉండడం గమనార్హం. 2019 నుంచి కూడా ఇదే పరిస్థితి కనిపిస్తోంది. 2019-20లో తెలంగాణలో 1.59 శాతంగా జిఎస్‌డిపి వాటా ఉండగా, ఎపిలో 6.26 శాతమే నమోదైంది. ఒకవైపు జిఎస్‌డిపిలో రాష్ట్ర అప్పుల వాటా అధికస్థాయిలో కనిపిస్తోంది. ప్రస్తుతం ఇది 34.6 శాతంగా ఉండడం ఆశ్చర్యం కలిగించేదే. ఇక ఆదాయంపై బడ్జెట్ అంచనాలకు, వాస్తవంగా సమకూరిన ఆదాయానికి మధ్య భారీ అంతరాలే కనిపిస్తున్నాయి. 2019 నుంచి ఇప్పటి వరకు ఏ ఒక్క సంవత్సరమూ అనుకున్న ఆదాయం సమకూరలేదు. బడ్జెట్‌లో ప్రతిపాదించిన దానికి వచ్చిన దానికి మధ్య వేల కోట్లలో తేడా ఉన్నట్లు తేలింది. అయినప్పటికీ ముందటి సంవత్సరాల్లో వచ్చిన దానికన్నా అధికంగా ప్రతిపాదించడం ఆనవాయితీగా మారిపోయింది. ప్రస్తుత సంవత్సరం కూడా ఇదే తరహాలో భారీగానే అంచనాలను సిద్ధం చేశారు. ఈ ఆర్థిక సంవత్సరం తొలి నెల్లో కూడా అనుకున్న ఆదాయం లభించడం లేదని ఆర్థికశాఖ వర్గాలు చెబుతున్నాయి. దీంతో భారీ వ్యయాన్ని చేరుకునేందుకు కొంత వరకు అప్పుల ద్వారానే ముందుకు సాగాల్సి ఉంటోంది. ఇదే సమయంలో మే నెల్లో మరింత వ్యయం పెరిగే పరిస్థితులు ఉన్నాయని, దీనికి నిధుల సమీకరణ కష్టంగానే ఉంటోందని ఒక అధికారి వ్యాఖ్యానించారు.

గత ఆరేళ్ల కాలంలో వచ్చిన సొంత ఆదాయం వివరాలు (రూ.కోట్లలో)

సంవత్సరం	బడ్జెట్ అంచనా	వచ్చినది
2019-20	75,437	57,446
2020-21	70,679	57,377
2021-22	85,290	73,689
2022-23	91,049	84,389
2023-24	1,02,651	85,978
2024-25	1,09,872	94,966
2025-26	1,09,006	---

అటవీశాఖ టాస్క్ ఫోర్సు బృందాన్ని అభినందించిన ఉప ముఖ్యమంత్రి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

విధి నిర్వహణలో భాగంగా బావిలో పడిన వృద్ధుడిని కాపాడిన అటవీ శాఖ టాస్క్ పోర్సు సిబ్బందిని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అభినందించారు. అటవీ శాఖ అధికారులతో ఆయన శాఖాపరమైన అంశాలను మంగళవారం చర్చించే సమయంలో టాస్క్ ఫోర్సు బృందం వృద్ధుడిని కాపాడిన విషయాన్ని ఆ శాఖ అధికారులు ఉప ముఖ్యమంత్రికి వివరించారు. సంఘటనకు సంబంధించి వివరాలు అధికారులు వెల్లడిస్తూ.. బాకరాపేట అటవీ రేంజి పరిధిలో టాస్క్ ఫోర్స్ బృందం విధులు నిర్వహిస్తుండగా ఏనుగుల కదలికలను గుర్తించి, యర్రావారిపాలెం మండలం చింతకుంట అటవీ పరిధి సమీపంలోని రైతులను అప్రమత్తం చేశారు. ఈ క్రమంలో 72 ఏళ్ల వృద్ధుడు అక్కడి నుంచి పారిపోయే క్రమంలో పొరపాటున బావిలో పడిపోయాడు. వృద్ధుడి కేకకు అక్కడున్న కుక్క అరవడంతో బృందం ప్రమాదాన్ని పసిగట్టి, వృద్ధుడిని రక్షించినట్లు తెలిపారు.

రాజ్యసభ కూటమి అభ్యర్థిగా పాకా సత్యనారాయణ నామినేషన్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాజ్యసభ కూటమి అభ్యర్థిగా పాకా వెంకట సత్యనారాయణ మంగళవారం శాసనసభ ప్రాంగణంలో రిటర్నింగ్ అధికారి వనితారాణికి నామినేషన్ పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో కేంద్ర పరిశ్రమలశాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ, వైద్యారోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్, ఎమ్మెల్సీ సోము వీర్రాజు, కామినేని శ్రీనివాసరావు, పార్థసారధి, నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, ఈశ్వరరావు, టిడిపి, జనసేన ఎమ్మెల్యేలు పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ముందు సిఎం చంద్రబాబు, డిప్యూటీ సిఎం పవన్‌కల్యాన్‌ను సత్యనారాయణ మర్యాదపూర్వకంగా కలిశారు.

ప్రజాశక్తిపై స్పందన ఫోన్ : 9490099006

ప్రజల పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. ప్రజాశక్తిలో మీకు నచ్చిన నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తీసుకువస్తే మరింత పదును పెట్టుకోవడానికి వీలవుతుంది.

94900 99006 ఫోన్ నెంబర్‌కు ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయింత్రం 6 గంటల మధ్య మీ అభిప్రాయాలు తెలియజేయవచ్చు. మీరు చెప్పేది క్లుప్తంగా సూటిగా పద్ధతిగా వుండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.

అభిప్రాయాలు పంపదలిస్తే..
స్పందన, ప్రజాశక్తి తెలుగు డైలీ, ప్రజాశక్తి భవనం-అమరరెడ్డి కాలనీ, అరవింద హైస్కూల్ దగ్గర, తాడేపల్లి, గుంటూరు జిల్లా - 522 501కు కానీ **editorprajasakthi@gmail.com**కు పంపవచ్చు.

అల్లూరి జిల్లాలో ఎదురుకాల్పులు

ప్రజాశక్తి - పాడేరు, కొయ్యూరు (అల్లూరి జిల్లా)

అల్లూరి జిల్లా చింతపల్లి సబ్-డివిజన్ కొయ్యూరు మండలం కాపులు మామిడి గ్రామం సమీపంలో మావోయిస్టులకు, పోలీసులకు మధ్య కాల్పులు చోటుచేసుకున్న సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. జిల్లా ఎస్‌పి అమిత్ బర్దర్ మంగళవారం స్థానిక విలేకరులకు వివరాలు వెల్లడించారు. ఆయన తెలిపిన వివరాల మేరకు.. ఈ నెల 27న కొయ్యూరు మండలంలో మావోయిస్టుల కదలికలపై విశ్వసనీయ సమాచారం అందుకున్న పోలీసు అధికారులు అప్రమత్తమయ్యారు. రంపచోడవరం ప్రాంతంలో పోలీసు అధికారుల పర్యవేక్షణలో ప్రత్యేక విధులు నిర్వహిస్తున్న జిల్లా ప్రత్యేక బలగాలు కూంబింగ్‌ను ముమ్మరం చేశాయి. ఈ నెల 28న ఉదయం 10:30 గంటలకు కొయ్యూరు మండలంలోని కాపులు మామిడి గ్రామం సమీపంలో కూంబింగ్ నిర్వహిస్తున్న సమయంలో సుమారు 15 మంది మావోయిస్టులు తారసపడ్డారు. అక్కడ మావోయిస్టులకు, పోలీసు బలగాలకు మధ్య ఎదురు కాల్పులు జరగ్గా.. మావోయిస్టులు తప్పించుకున్నారని ఎస్‌పి వెల్లడించారు. మధ్యాహ్నం 2:30 గంటల సమయంలో మరోసారి మావోయిస్టులు కంటవరం గ్రామం సమీపంలో కనిపించారని, అక్కడ కూడా కాల్పులు జరిగాయని తెలిపారు. అయితే, ఇప్పటి వరకు ఎలాంటి ప్రాణ నష్టం జరగలేదని తెలిపారు. ఈ రెండు సంఘటనల్లో, ఆయా ప్రదేశాల్లో మావోయిస్టులు వదిలిపెట్టిన సామగ్రిని స్వాధీనం చేసుకున్నామని వెల్లడించారు. ఎస్-ఎల్ఆర్ మ్యాగజైన్, ఆధునిక కమ్యూనిషన్ పరికరాలు, కిండల్ ట్యాబ్, మావోయిస్టు సాహిత్యం, దుస్తులు, ఔషధాలు, బ్యాగులు స్వాధీనం చేసుకున్న వాటిలో ఉన్నాయన్నారు.

జడ్జి బదిలీ నిర్ణయాన్ని పున:పరిశీలన చేయాలి

- సిజెఐకు హైకోర్టు న్యాయవాదుల సంఘం విజ్ఞప్తి

ప్రజాశక్తి-అమరావతి

హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కుంభజడల మన్మథరావు బదిలీ నిర్ణయాన్ని పున్నపరిశీలన చేయాలంటూ హైకోర్టు న్యాయవాదుల సంఘం సుప్రీంకోర్టు సిజెకు విజ్ఞప్తి చేసింది. జస్టిస్ మన్మథరావును బదిలీ చేయాలని కేంద్రానికి ఇటీవల సుప్రీంకోర్టు కొలీజియం చేసిన సిఫార్సును రద్దు చేయాలంటూ సంఘం అసాధారణ సర్వసభ్య సమావేశం కోరుతూ తీర్మానం చేసింది. ఈ తీర్మానాన్ని తాజాగా సుప్రీంకోర్టుకు పంపినట్లు సంఘం అధ్యక్షులు కలిగినీడి చిదంబరం మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

రూ.1,300 కోట్లతో గిరిజన ప్రాంతాల్లో అభివృద్ధి పనులు

- మంత్రి సంధ్యారాణి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన అనంతరం గిరిజన గ్రామాల్లో రూ.1,300 కోట్లతో పలు అభివృద్ధి పనులు చేపట్టిందని మహిళా, శిశుసంక్షేమ, గిరిజన సంక్షేమశాఖల మంత్రి గుమ్మడి సంధ్యారాణి తెలిపారు. సచివాలయంలోని పబ్లిసిటీ సెల్‌లో ఆమె మంగళవారం విలేకరులతో మాట్లాడారు. అరకు కాఫీని లక్ష ఎకరాల్లో సాగు చేసేందుకు తగిన చర్యలు తీసుకున్నట్లు చెప్పారు. ఈ కాఫీకి అంతర్జాతీయ గుర్తింపు తెచ్చేందుకు కృషి చేస్తున్నామన్నారు. డోలీ మోతలు పూర్తిగా నివారించేందుకు రూ.వెయ్యి కోట్ల వ్యయంతో మారుమూల ఆవాసాలన్నింటికీ రహదారులను అందుబాటులోకి తెస్తున్నట్లు తెలిపారు. 1,600 గిరిజన గ్రామాల్లో తాగునీటి సౌకర్యాన్ని కల్పించడంతోపాటు రూ.156 కోట్లతో పలు మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. గత ప్రభుత్వం సకాలంలో యుసిలు సమర్పించకపోవడంతో కేంద్రం వద్ద నిలిచిపోయిన నిధులను తిరిగి తీసుకురాగలిగినట్లు చెప్పారు. ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ అరకు, పాడేరు నియోజకవర్గాలకు రూ.550 కోట్లు కేంద్ర నిధులను మంజూరు చేయించారని తెలిపారు. గిరిజన ఉత్పత్తులకు మార్కెటింగ్ సౌకర్యాలను కల్పించే లక్ష్యంతో 6 ఐటిడిఎల పరిధిలో 6 గిరిజన సంచార గిరి బజార్లను ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. మారుమూల ప్రాంతాల్లో నివశించే గిరిజనులకు వైద్య సేవలు అందించేందుకు అసెంబ్లీ నియోజకవర్గానికి ఒక కంటైనర్ ఆస్పత్రి ఏర్పాటుచేసి 65 రకాల మందులను అందుబాటులో ఉంచనున్నట్లు తెలిపారు. గత 10 నెలల్లో 1,100 అంగన్వాడీ పోస్టులను భర్తీ చేశామన్నారు. రూ.53 కోట్ల వ్యయంతో అంగన్వాడీల్లో పౌష్టికాహారం, తాగునీరు, మరుగుదొడ్లు వంటి కనీస వసతులు కల్పిస్తున్నట్లు చెప్పారు. నాణ్యమైన కోడిగుడ్లు, చిక్కీలు, పాలు అందిస్తున్నట్లు తెలిపారు. కేంద్ర ప్రభుత్వ సహకారంతో మినీ అంగన్వాడీలను మెయిన్‌లుగా అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తున్నట్లు మంత్రి సంధ్యారాణి పేర్కొన్నారు. గిరిజన గర్భిణులకు పౌష్టికాహారాన్ని అందించేందుకు గర్భిణీ వసతి గృహాలు, బర్త్ వెయిటింగ్ హాల్స్ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికే తల్లీబిడ్డ ఆస్పత్రులను పున్ణప్రారంభించామన్నారు.

'ఉక్కు' యాజమాన్య కుట్రలను తిప్పికొడతాం

- ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ

ప్రజాశక్తి - ఉక్కునగరం (విశాఖపట్నం)

వైజాగ్ స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణ చర్యల్లో భాగంగా కాంట్రాక్టు కార్మికులను తొలగించేందుకు కేంద్రం ఆదేశాలతో కర్మాగార యాజమాన్యం చేస్తోన్న కుట్రలను ఐక్య పోరాటాలతో తిప్పికొడతామని ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు ఎన్.రామారావు, డిసి హెచ్.వెంకటేశ్వరరావు అన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలో జరుగుతున్న రిలే నిరాహార దీక్షలు మంగళవారానికి 1538వ రోజుకు చేరాయి. దీక్షల్లో స్టీల్‌ప్లాంట్ ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటియు) కార్యకర్తలు, ఉక్కు కార్మికులు కూర్చున్నారు. వారినుద్దేశించి నాయకులు మాట్లాడుతూ ఉక్కు పరిరక్షణ కోసం కార్మికులు చేస్తున్న పోరాటాలు భవిష్యత్తు తరాలకు ఆదర్శమని అన్నారు. కాంట్రాక్ట్ కార్మికులను అకారణంగా తొలగించాలని చూస్తున్న యాజమాన్య కుట్రలను తిప్పికొట్టాలని కోరారు. ఉద్యోగులపై పనిభారం పెంచడాన్ని ఎవ్వరూ సహించబోరన్నారు. ప్లాంట్‌లో యంత్రాల మరమ్మతులు కూడా చేపట్టడం లేదని, దీంతో కార్మికులు ఒత్తిడికి గురవుతున్నారని తెలిపారు.

25 పార్లమెంటు నియోజకవర్గాలకు వైసిపి పరిశీలకుల నియామకం

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్రంలో 25 పార్లమెంటు నియోజకవర్గాలకు పరిశీలకులను వైసిపి నియమించింది. ఈ నియామకాలు వెంటనే అమల్లోకి వస్తాయని పార్టీ కేంద్ర కార్యాలయం పేర్కొంది.

శ్రీకాకుళం	కుంభా రవిబాబు
విజయనగరం	కిల్లి సత్యనారాయణ
అరకు	బొడ్డేటి ప్రసాద్
అనకాపల్లి	శోభా హైమావతి
విశాఖపట్నం	కదిరి బాబూరావు
కాకినాడ	సూర్యనారాయణరాజు
అమలాపురం	జక్కంపూడి విజయలక్ష్మి
రాజమండ్రి	తిప్పల గురుమూర్తి
నరసాపురం	ముదునూరి మురళీకృష్ణరాజు
ఏలూరు	వంకా రవీంద్రనాథ్
మచిలీపట్నం	జెట్టి గురునాథం
విజయవాడ	మొదుగుల వేణుగోపాలరెడ్డి
గుంటూరు	పోతిన మహేష్
నరసరావుపేట	పూనూరు గౌతంరెడ్డి
బాపట్ల	తూమాటి మాధవరావు
ఒంగోలు	బి బ్రహ్మానందరెడ్డి
నెల్లూరు	జంకె వెంకటరెడ్డి
తిరుపతి	మేడా రఘునాథ్‌రెడ్డి
చిత్తూరు	చవ్వా రాజశేఖరరెడ్డి
రాజంపేట	కె సురేష్‌బాబు
కడప	కొండూరు అజయ్‌రెడ్డి
అనంతపురం	బోరెడ్డి సురేష్‌కుమార్‌రెడ్డి
హిందూపురం	రమేష్‌రెడ్డి
నంద్యాల	కల్పలతారెడ్డి
కర్నూలు	గంగుల ప్రభాకరరెడ్డి



దేశ సమగ్రతపై దాడి

ఉగ్రవాదాన్ని నిర్మూలించేందుకు ఏకం కావాలి : పవన్‌కల్యాణ్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

కాశ్మీర్ పహల్గాంలో ఉగ్రవాదులు జరిపిన దాడిని దేశ సమగ్రతపై చేసిన దాడిగా జనసేన పార్టీ అధ్యక్షులు, డిప్యూటీ సిఎం పవన్‌కల్యాణ్ అభివర్ణించారు. మంగళగిరి సికె కన్వెన్షన్ హాలులో జనసేన పార్టీ ఆధ్వర్యంలో ఉగ్రవాదుల కాల్పుల్లో మృతి చెందిన వారికి నివాళులర్పిస్తూ మంగళవారం నాడు సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమృతులకు సంతాప సూచకంగా 2నిమిషాలు మౌనం పాటించారు. అనంతరం పవన్‌కల్యాణ్ మాట్లాడుతూ పహల్గాం తీవ్రవాదుల దాడిలో మరణించిన నెల్లూరు జిల్లాకు చెందిన సోమిశెట్టి మధుసూధన రావు జనసేన కార్యకర్త అని తెలిపారు. దేశంలో ఉగ్రవాదాన్ని నిర్మూలించేందుకు అందరూ ఏకమవ్వాలన్నారు. మధుసూధన్‌రావు కుటుంబాన్ని పరామర్శించేందుకు వెళ్లిన సందర్భంలో వారి కుటుంబ సభ్యులు జరిగిన సంఘటన గురించి వారు ఎంత ఘోరంగా ప్రాణాలు తీశారో వివరించారని తెలిపారు. ఉగ్రవాదాన్ని నిర్మూలించేందుకు దేశమంతా ఏకం కావాలని చెప్పారు. రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ మాట్లాడుతూ ఉగ్ర దాడి జరిగిన వెంటనే దేశంలో ఏ రాజకీయ పార్టీ చేయని విధంగా పహల్గాం మృతులకు సంతాప సూచకంగా మూడు రోజులు సంతాప దినాలను జనసేన పార్టీ నిర్వహించిందన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర పర్యాటకశాఖ మంత్రి కందుల దుర్గేష్, శాసనమండలిలో ప్రభుత్వ విప్ పిడుగు హరిప్రసాద్, మండలి సభ్యులు కొణిదెల నాగబాబు, పార్టీ ఎమ్మెల్యేలు, కార్యవర్గ సభ్యులు,కార్పొరేషన్ల ఛైర్మన్లు, డైరెక్టర్లు పాల్గొన్నారు.

మధుసూధనరావు కుటుంబానికి రూ.50లక్షల ఆర్థిక సహాయం:

ఉగ్రదాడిలో మరణించిన సోమిశెట్టి మధుసూధనరావు కుటుంబానికి పార్టీ తరపున రూ.50లక్షల ఆర్థిక సహాయంతో పాటు క్రియాశీలక సభ్యత్వ భీమా కింద రూ.5లక్షలు, అందించడం జరుగుతుందని పవన్‌కల్యాణ్ తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం తరపున ఇప్పటికే రూ.10లక్షలు వారి కుటుంబానికి ఇచ్చినట్లు తెలిపారు.

వినియోగదారుల ఫోరం నియామకాలపై సింగిల్ జడ్జి తీర్పును సమర్థించిన ధర్మాసనం

ప్రజాశక్తి-అమరావతి

కడప, గుంటూరు, నెల్లూరు వినియోగదారుల ఫోరం ప్రెసిడెంట్లతో పాటు కడప, తిరుపతి ఫోరం సభ్యుల నియామకాలను రద్దు చేస్తూ హైకోర్టు సింగిల్ జడ్జి ఇచ్చిన తీర్పును ధర్మాసనం సమర్థించింది. అయితే చిత్తూరు జిల్లా వినియోగదారుల ఫోరం అధ్యక్షులు నియామకాన్ని రద్దు చేసిన సింగిల్ జడ్జి ఉత్తర్వులను డివిజన్ బెంచ్ పక్కన పెట్టింది. అభ్యర్థుల పూర్వాపరాలపై పోలీసులు పరిశీలన చేశాకే వాళ్ల పేర్లను ప్రతిభ ఆధారంగా పరిగణనలోకి తీసుకోవాలన్న సింగిల్ జడ్జి ఉత్తర్వులను రద్దు చేసింది. ఎంపిక కమిటీని నెల రోజుల్లోపు పునర్నియామకం చేయాలని రాష్ట్రాన్ని ఆదేశించింది. రెండో నివేదిక, ఇతర సమాచారంతో పాటు తన అభిప్రాయాలను రాష్ట్ర ప్రభుత్వం ఎంపిక కమిటీ ముందుంచాలంది. ఈ ప్రక్రియను రెండు నెలల్లో పూర్తిచేయాలంటూ జస్టిస్ బొప్పూడి కృష్ణమోహన్, జస్టిస్ న్యాపతి విజయ్ ధర్మాసనం తీర్పు చెప్పింది.

వైసిపి పాలనలో జరిగిన రాష్ట్ర వినియోగదారుల ఫోరంల ప్రెసిడెంట్లు, సభ్యుల నియామాలను సవాల్ చేస్తూ హైకోర్టులో 2022లో వ్యాజ్యాలు దాఖలయ్యాయి. రూల్స్‌కు వ్యతిరేకంగా నియామకాలు ఉన్నాయని పిటిషనర్ల వాదన. దీనిపై సింగిల్ జడ్జి, కడప, గుంటూరు, చిత్తూరు, నెల్లూరు వినియోగదారుల ఫోరం ప్రెసిడెంట్లతో పాటు కడప, తిరుపతి ఫోరం సభ్యుల నియామకాలను రద్దు చేశారు.

ఈ పదవులు కోల్పోయిన వాళ్లు దాఖలు చేసిన పిటిషన్లపై డివిజన్ బెంచ్ పైవిధంగా తీర్పు చెప్పింది. ఈ సందర్భంగా డివిజన్ బెంచ్.. క్రిమినల్ కేసు విచారణ ఎదుర్కొంటున్న వ్యక్తిని న్యాయ పదవిలో నియమించడంపై అభ్యంతరం వ్యక్తం చేసింది. రాష్ట్రంలో జిల్లాల వినియోగదారుల ఫోరంల ప్రెసిడెంట్లు, సభ్యుల నియామకాల్లో రాష్ట్ర ప్రభుత్వం తన విచక్షణాధికార పరిధిని అతిక్రమించిందని తప్పుపట్టింది. జిల్లా వినియోగదారుల ఫోరంల అధ్యక్షులు, సభ్యుల పోస్టులకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థుల అర్హత, ఆమోదయోగ్యత అంశాలపై రాష్ట్ర ప్రభుత్వం తన అభిప్రాయాన్ని ఎంపిక కమిటీకి చెప్పాలని తేల్చి చెప్పింది. దరఖాస్తుదారు చేసుకున్న అభ్యర్థి అర్హత, నిజాయతీపై కమిటీ నిర్ణయం తీసుకున్నాక దానిపై రాష్ట్రం మదింపునకు వీల్లేదని వెల్లడించింది. ప్రతిభ ఆధారంగా ఎంపిక కమిటీ తీసుకునే నిర్ణయానికే రాష్ట్రం కట్టుబడి ఉండాలని తేల్చింది.

నిర్దేశిత లక్ష్యాలను చేరుకోవాలి

- జలవనరులశాఖ అధికారులతో మంత్రి నిమ్మల
- 2025 నాటికి హంద్రీనీవా, పోలవరం ఎడమకాలువ పనులు పూర్తి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

జలవనరులశాఖలో ముఖ్యమంత్రి నిర్దేశించిన లక్ష్యాలను చేరుకునేందుకు అధికారులు కృషి చేయాలని జలవనరులశాఖ మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. 2025 జూన్ నాటికి హంద్రీనీవా, పోలవరం ఎడమకాలువ పనులు పూర్తి చేయడంతోపాటు, 2026 జూన్ నాటికి వెలిగొండ ప్రాజెక్టు పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అమరావతి సచివాలయంలో జలవనరులశాఖపై మంత్రి మంగళవారం సమీక్ష నిర్వహించారు. హంద్రీనీవా, పోలవరం ఎడమ కాలువ పనులను ప్రత్యక్షంగా పరిశీలించిన సమయంలో పనులు నిర్దేశించిన సమయానికి అనుగుణంగా జరగడం లేదని అన్నారు. సీజన్ మొదలయ్యేనాటికి హంద్రీనీవా ప్రధాన కాలువ మొదటిదశ పనులు పూర్తవ్వాలని అధికారులు, ఏజెన్సీలకు దిశానిర్దేశం చేశారు. త్వరలోనే హంద్రీనీవా ప్రాజెక్టు పనులను సిఎం క్షేత్రస్థాయిలో పర్యటించి సమీక్ష చేస్తారని తెలిపారు. పోలవరం ఎడమకాలువ పనులు నత్తనడకన సాగుతున్నాయని, అనుకున్న సమయానికి పూర్తి చేసేలా, మెషినరీ, డంపర్లు, ఎక్స్‌రేటర్లు, బ్యాచింగ్ ప్లాంట్లు రోలర్లు ఏర్పాటు చేసుకోవాలని ఏజెన్సీలను ఆదేశించారు. ఇచ్చిన గడువులోపు పనులు పూర్తికాకపోతే అధికారులు, ఏజెన్సీలపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పోలవరం ప్రాజెక్టును మే 4వ తేదీ నుండి 8వ తేదీ వరకూ ప్యానల్ ఆఫ్ ఎక్స్‌పర్ట్స్ కమిటీ సందర్శించనుందని, ఈలోగా ఇసిఆర్ఎఫ్ డ్యామ్‌కు సంబంధించి డిజైన్లు తీసుకోవాలని సిఇకి సూచించారు. గ్యాప్-1లో ఇసిఆర్ఎఫ్ నిర్మాణ పనులు పూర్తి చేసేలా డిజైన్లు తీసుకోవాలని, గ్యాప్-2లో పనులు మొదలుపెట్టేలా నిపుణుల కమిటీ అనుమతి పొందాలని తెలిపారు. ప్రస్తుతం గ్యాప్-2లో డయాఫ్రం వాల్ నిర్మాణ పనులు చురుకుగా సాగుతున్నాయని, ఇప్పటికీ రెండు కట్టర్లు, రెండు గ్రాబర్ల సాయంతో 217 మీటర్ల నిర్మాణం పూర్తయిందని తెలిపారు. మే మొదటివారంలో మూడో కట్టర్‌తో పనులు మొదలుపెడతామని ప్రాజెక్టు అధికారులకు మంత్రి తెలిపారు. అదే విధంగా వర్షాకాలం మొదలయ్యేలోపు ఎగువ కాఫర్ డ్యామ్ బలోపేతం చేసేలా నిర్మిస్తున్న బట్రస్ డ్యామ్ పనులు మే చివరినాటికి పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. వెలిగొండ టన్నెల్-2లో బెంచింగ్, లైనింగ్ పనులు ఏప్రిల్ నెలలో నిర్దేశించిన లక్ష్యానికి చేరుకోకపోవడంపై అధికారులు, ఏజెన్సీ ప్రతినిధులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రాజెక్టు ఫీడర్ కెనాల్, లైనింగ్, రిటైనింగ్‌వాల్‌కు వెంటనే టెండర్లు పిలిచి ఏజెన్సీలకు పనులు అప్పగించాలని ఆదేశించారు.


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న జెఎన్‌టియు విసి, ఎపి ఇసెట్ ఛైర్మన్ సుదర్శనరావు

6న ఎపి ఇసెట్ పరీక్షలు

- 35,187 మంది దరఖాస్తు : విసి సుదర్శన రావు

ప్రజాశక్తి- అనంతపురం

అనంతపురం జెఎన్‌టియు, ఆంధ్రప్రదేశ్ ఉన్నత విద్యా మండలి సంయుక్తంగా ఎపి ఇసెట్- 2025 పరీక్ష మే ఆరవ తేదీన నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర ఇసెట్ ఛైర్మన్, అనంతపురం జెఎన్‌టియు విసి ఆచార్య హెచ్ సుదర్శన్ రావు తెలిపారు. అనంతపురం జెఎన్‌టియు పరిపాలన భవనంలోని ఆర్యభట్ట ఆడిటోరియంలో ఎపి ఇసెట్ కన్వీనర్ ఆచార్య దుర్గాప్రసాద్ అధ్యక్షతన ఎపి ఇసెట్‌పై మంగళవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. విసి సుదర్శన్ రావు మాట్లాడుతూ మే ఆరున రెండు సెషన్లలో ఎపి ఇసెట్ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఉదయం సెషన్ తొమ్మిది గంటల నుంచి 12 గంటల వరకు, సాయంత్రం సెషన్ రెండు గంటల నుంచి ఐదు గంటల వరకు ఉంటుందన్నారు. అనంతపురం జెఎన్‌టియు ఈసెట్ పరీక్షకు 35,187 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నట్లు తెలిపారు. ఇందుకోసం ఎపిలో 109, హైదరాబాద్‌లో ఒక పరీక్షా కేంద్రాన్ని మొత్తం 110 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు వివరించారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు తమ హాల్ టికెట్లను మే ఒకటవ తేదీ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చన్నారు. హాల్‌టికెట్‌లో ఎటువంటి పొరపాట్లు ఉన్నా వెంటనే ఎపి ఇసెట్ కార్యాలయాన్ని సంప్రదించాలని సూచించారు. ఎపి సెట్ పరీక్ష రాసే విద్యార్థులు ఒక్క నిమిషం ఆలస్యమైనా పరీక్ష హాల్లోకి అనుమతించడం జరగదని దీని గమనించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జెఎన్‌టియు రిజిస్ట్రార్ ఎస్ కృష్ణయ్య, ఎపి ఇసెట్ కో కన్వీనర్, అడ్వైజర్ ఆచార్య టిఆర్ భానుమూర్తి, శ్రీధర్, అసిస్టెంట్ రిజిస్ట్రార్ నూర్ మహమ్మద్, పిఆర్ఓ ఓంప్రకాష్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం

- శాసనసభ పిటిషన్స్ కమిటీ పని ప్రారంభం
- విశాఖ భూములపై రెండు సిట్‌లనూ రీఓపెన్ చేస్తాం
- డిప్యూటీ స్పీకర్, కమిటీ ఛైర్మన్ రఘురామకృష్ణరాజు

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

రాష్ట్రంలోని నియోజకవర్గాల పరిధిలో ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా శాసనసభా పిటిషన్స్ కమిటీ పనిచేయడం ప్రారంభించిందని ఆ కమిటీ ఛైర్మన్, డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు తెలిపారు. గడచిన ఐదేళ్లలో ఈ కమిటీ ఒక్కసారి కూడా సమావేశం నిర్వహించలేదన్నారు. విశాఖలో మంగళవారం తొలి సమావేశాన్ని కమిటీ సభ్యులతో కలిసి నిర్వహించడానికి విచ్చేసిన ఆయన గవర్నర్ బంగ్లాలో విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. ఈ కమిటీ సేవలను ప్రజలు వినియోగించుకోవాలని, అధికారులకు, ప్రజలకు పలు విషయాలపై అవగాహన కల్పించడమే ఈ కమిటీ ఉద్దేశమని తెలిపారు. ఈ కమిటీ ఏర్పాటై 2025 మే నాటికి వందేళ్లు అవుతున్న సందర్భంగా ఈ ఏడాది మే 22, 23 తేదీల్లో రాష్ట్రాల స్పీకర్‌లు, డిప్యూటీ స్పీకర్లతో 'పిటిషన్స్ కమిటీ'లపై లోక్‌సభ స్పీకర్ సమావేశం నిర్వహించనున్నారని చెప్పారు. ప్రజలు ఎదుర్కొనే అన్ని సమస్యలు, రెవెన్యూ, ఇతర అంశాలన్నిటిపైనా ఫిర్యాదులను కమిటీ స్వీకరిస్తుందని తెలిపారు. గతంలో విశాఖ భూములపై రెండు ప్రభుత్వాల ఆధ్వర్యాన వేసిన రెండు సిట్‌లను రీ ఓపెన్ చేస్తామన్నారు. భూ కుంభకోణాల్లో బాధ్యులెంతటివారైనా చర్యలుంటాయని, అధికారులపైనా చర్యలుంటాయని స్పష్టం చేశారు. ప్రజాప్రతినిధులపైనా ప్రజలు నేరుగా ఎపి శాసనసభా పిటిషన్స్ కమిటీ పేరు మీద అన్ని వివరాలతో ఫిర్యాదులు చేయొచ్చని తెలిపారు. ఇలా వచ్చిన వినతులను కమిటీ సమావేశమైనప్పుడు విచారణ చేపడుతుందన్నారు. కమిటీలో ఎమ్మెల్యేలు కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, జగన్‌మోహన్, పల్లా శ్రీనివాసరావు, విష్ణుకుమార్‌రాజు, కొణతాల రామకృష్ణ, గంటా శ్రీనివాసరావు ఉన్నారని తెలిపారు.

'ఉపాధి' కార్మికుల ఉక్కిరిబిక్కిరి

- మండుటెండలోనే పనులు
- పని ప్రదేశంలోనే కుప్పకూలుతున్న వైనం

ప్రజాశక్తి- శ్రీకాకుళం ప్రతినిధి

భానుడి భగభగలతో రాష్ట్రంలోని పలు ప్రాంతాలు నిప్పుల కొలిమిని తలపిస్తున్నాయి. వడగాడ్పుల తీవ్రత ఎక్కువగా ఉంటోందని జాతీయ విపత్తుల నిర్వహణ ఏజెన్సీ అనేక మండలాలకు నిరంతరం హెచ్చరికలు జారీ చేస్తూనే ఉంది. ఎండ వేడిమి, ఉక్కపోతకు ఇంట్లోనే ఉండలేని పరిస్థితి నెలకొంది. ఉపాధి హామీ కార్మికులు ఎండ వేడిమి, తీవ్ర ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు.

మేలో నమోదయ్యే గరిష్ట ఉష్ణోగ్రతలు ఏప్రిల్‌లోనే నమోదవుతుండడంతో బెంబేలెత్తిపోతున్నారు. మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం (ఎంజిఎన్‌ఆర్‌జిఎ)లో సాంకేతిక మార్పుల పేరుతో కేంద్ర ప్రభుత్వం కార్మికులకు కల్పిస్తున్న కనీస సౌకర్యాలను ఎత్తేయడంతో వారు నానా అగచాట్లు పడుతున్నారు. పనిచేసే చోట నిలువ నీడ కరువవడంతో మృత్యువాత పడుతున్నారు.

ఇప్పటికే ఇద్దరు మృత్యువాత

శ్రీకాకుళం జిల్లా సరుబుజ్జిలి మండలం ఇసకలపాలెం సమీపంలో సాగునీటి కాలువలో ఉపాధి పనులు చేస్తూ ఉపాధి కార్మికుడు గుజ్జల గన్నెరాజు (67) మృతి చెందారు. ఉదయం పనికి వెళ్లిన ఆయన పనికిరాని మొక్కలను తొలగిస్తుండగా ఎండ తీవ్రతకు కుప్పకూలిపోయారు. తోటి కూలీలు సపర్యలు చేసినా ఫలితం లేకపోయింది. వైఎస్‌ఆర్ జిల్లా సింహాద్రిపురం మండలంలో ఉపాది కార్మికుడు బి.ఓబుల్‌రెడ్డి వడదెబ్బతో మృతి చెందారు. గురజాలలో ఈ నెల 19న ఉపాధి పనులకు వెళ్లిన ఆయన వండదెబ్బకు పని ప్రదేశంలోనే కుప్పకూలిపోయి ప్రాణాలు విడిచారు.



చెట్ల నీడలో సేదతీరుతున్న ఉపాధి కార్మికులు

కనీస సౌకర్యాల కల్పన నిలిపివేసిన కేంద్ర ప్రభుత్వం

రాష్ట్ర వ్యాప్తంగా 70.07 లక్షల మందికి జాబ్‌కార్డులు జారీ చేయగా, వాటిలో 55.94 లక్షల కార్డులు మనుగడలో ఉన్నాయి. మొత్తం 1.24 కోట్ల మంది కార్మికులకుగానూ 92.91 లక్షల మంది చురుగ్గా పనులకు వస్తున్నారు. వ్యవసాయ పనులు లేకపోవడంతో రాష్ట్ర వ్యాప్తంగా ప్రస్తుతం ముమ్మరంగా ఉపాధి పనులు సాగుతున్నాయి. ఏప్రిల్ నాలుగో వారంలో సుమారు 60 లక్షల మంది పనులకు వస్తున్నట్లు సమాచారం. పని ప్రదేశంలో కార్మికులకు కనీస సౌకర్యాల కల్పనలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయి. కార్మికులకు నీడనిచ్చేందుకు సరఫరా చేసిన టెంట్లు, మంచినీటి సౌకర్యం, గునపాం, పారకు డబ్బులు చెల్లింపు వంటివి కేంద్ర ప్రభుత్వం ఎత్తివేసింది. వేసవిలో ఎండ వేడిమి నుంచి ఉపశమనం కోసం గతంలో ఉపాధి కార్మికులకు టెంట్లు, టార్పాలిన్లను రాష్ట్ర ప్రభుత్వం అందించేది. సాంకేతిక కారణాలను చూపి వీటిని అందించకుండా తప్పించుకుంటోంది. గతంలో టిసిఎస్ (టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్)తో కార్మికులకు కొన్ని కనీస సౌకర్యాలు కల్పించగలిగామని ఇప్పుడు కేంద్రం ప్రభుత్వం ఎన్ఐసి (నేషనల్ ఇన్ఫర్మేషన్ సెంటర్) విధానంలోకి తీసుకోవడంతో కనీస సౌకర్యాలు తొలగించిందని అధికారులు చెప్తున్నారు. పని ప్రదేశంలో కనీస సౌకర్యాలు కల్పించాలని ఉపాధి కార్మికులు కోరుతున్నారు.

వడగాడ్పుల నేపథ్యంలో ఏవీ రక్షణ చర్యలు

రాష్ట్రంలో ఎండలు ఠారెత్తిస్తున్న నేపథ్యంలో వడగాడ్పుల బారిన పడకుండా ప్రజలకు రక్షణ చర్యలను సూచిస్తున్న ప్రభుత్వం, ఉపాధి కార్మికుల విషయంలో ఏమీ పట్టనట్లు వ్యవహరిస్తోంది. పని ప్రదేశంలో ఎండ వేడిమి నుంచి కార్మికులకు ఉపశమన చర్యలపై గతంలో పందిళ్లు నిర్మించేలా చూడాలని అధికారులకు సూచించేది. ఇప్పుడు అదీ లేదు. నీడ కోసం కొన్నిచోట్ల కార్మికులే కొబ్బరి కొమ్మలతో పందిళ్లు వేసుకుంటున్నారు.

ఎండకు తట్టుకోలేకపోతున్నాం



ఇంట్లో ఉంటే పూట గడవక ఉపాధి పనికి వస్తున్నాం. ఎండలు మండిపోవడంతో పని చేయలేక పోతున్నాం. టార్పాలిన్లు లేక పోవడంతో ఎక్కడా నిలువ నీడ లేదు. ఎండ వేడిమి, ఉక్కపోతకు భరించలేక మధ్యమధ్యలో చెట్ల నీడ దగ్గరకు వెళ్తున్నాం.

- కె.రాజారావు, రాపాక, శ్రీకాకుళం జిల్లా

నీళ్లు మేమే తెచ్చుకుంటున్నాం



ప్రభుత్వం గతంలో మంచినీటికి డబ్బులు ఇచ్చేది. వేసవిలో మజ్జిగ కూడా ఇచ్చేవారు. ఇప్పుడు ఏవీ ఇవ్వడం లేదు. ఇళ్ల నుంచే సీసాలతో నీళ్లు తెచ్చుకుంటున్నాం. ఎండ తీవ్రత వలల ఎక్కువ పనిచేయలేక పోతున్నాం. దాహం కూడా అధికంగా వస్తోంది. ఇంటి నుంచే తాగునీటి తెచ్చుకుంటున్నాం.

- ఎస్.భారతి, కొంచాడ (శ్రీకాకుళం జిల్లా)



భీమవరంలో రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు బలరాం

పేదలపై యుద్ధం ఆపాలి

- ఉండి నియోజకవర్గంలో ఇళ్లు తొలగించిన వారందరికీ ప్రత్యామ్నాయం చూపాలి
- వి శ్రీనివాసరావుపై అనుచిత వ్యాఖ్యలను ఖండించిన రౌండ్‌టేబుల్ సమావేశం

ప్రజాశక్తి - భీమవరం

పేదలపై యుద్ధాన్ని ఆపాలని, ఉండి నియోజకవర్గంలో ఇళ్లు తొలగించిన పేదలందరికీ ఇళ్ల స్థలాలు అందించి, ఇళ్లు నిర్మించి ఇవ్వాలని పశ్చిమగోదావరి జిల్లా భీమవరంలోని సుందరయ్య భవనంలో సిపిఎం ఆధ్వర్యంలో మంగళవారం జరిగిన రౌండ్‌టేబుల్ సమావేశం డిమాండ్ చేసింది. పాలకోడేరు ఎఎస్‌ఆర్ నగర్ ప్రాంతాన్ని మే రెండున అఖిలపక్షంగా వెళ్లి సందర్శించి బాధితులను పరామర్శించాలని రౌండ్‌టేబుల్ సమావేశం నిర్ణయించింది. జిల్లా కార్యదర్శి జెఎన్‌వి గోపాలన్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు బి బలరాం మాట్లాడుతూ డిప్యూటీ స్పీకర్ కనుమూరు రఘు రామకృష్ణరాజు చేస్తున్న విధ్వంసం, సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావుపై ఆయన చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. ఇళ్లు కూల్చుతూ అభివృద్ధి చేస్తున్నామంటే ప్రజలు హర్షించరని అన్నారు. ఇళ్లను తానే కూలుస్తున్నానని ఎమ్మెల్యే గొప్పగా చెప్పుకోవడం విడ్డూరమన్నారు. ఉండిలో పేదలపై విధ్వంసం జరుగుతుంటే ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి, జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి, జిల్లా మంత్రులు, ఎమ్మెల్యేలు ఎందుకు స్పందించరని ప్రశ్నించారు. డిప్యూటీ స్పీకర్, ఆయన నాయకులు చెబుతున్నవన్నీ పచ్చి అబద్ధాలని, అవసరమైతే బహిరంగంగా నిజాలు తెలుసుకునేందుకు రావాలని సవాల్ విసిరారు. సిపిఎం జిల్లా కార్యదర్శి జెఎన్‌వి గోపాలన్ మాట్లాడుతూ టిడిపి కూటమి ప్రభుత్వం ఇళ్ల పట్టాలిస్తామని హామీ ఇస్తే దీనికి భిన్నంగా ఉండి నియోజకవర్గంలో గత ఆరు నెలల్లో సుమారు 800 ఇళ్లు, 200 దుకాణాలు తొలగించారని, దీనివల్ల రూ.40 కోట్లు నష్టపోయారని వివరించారు.

సిపిఐ జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు మాట్లాడుతూ ఉండి నియోజకవర్గంలో అరాచక పాలన రాజ్యమేలుతుందన్నారు. మానవ హక్కులను ఉల్లంఘించారని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు పాతపాటి హరికుమార్‌రాజు, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కె.రాజారామ్మోహన్‌రాయ్ మాట్లాడుతూ కాలుష్యం మీద చిత్తశుద్ధి ఉంటే కాలుష్య కారకులపై చర్యలు తీసుకోవాలన్నారు. కాలుష్యం పేరుతో పేదల ఇళ్లను తొలగించడం సరైంది కాదని విమర్శించారు. బిఎస్‌పి రాష్ట్ర కార్యదర్శి ఎం.రత్నంరాజు, ఫార్వర్డ్ బ్లాక్ జిల్లా ప్రధాన కార్యదర్శి లంక కృష్ణమూర్తి, దళిత ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షులు గంటా సుందర్‌కుమార్, ఎంసిపిఐ (యు) నాయకులు జి.రాంబాబు, అంబేద్కర్ ఆశయ సాధన సమితి రాష్ట్ర నాయకులు కోనాల జోసెఫ్, సీనియర్ అడ్వకేట్ జి.విజయరాజు, ఐద్వా జిల్లా కార్యదర్శి పుగాకు పూర్ణ, కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి కె.క్రాంతిబాబు మాట్లాడారు. సమావేశంలో సిపిఎం జిల్లా నేతలు బి.వాసుదేవరావు, జక్కంశెట్టి సత్యనారాయణ, ఎంసిపిఐ (యు), వ్యవసాయ కార్మిక సంఘం, ఐద్వా, రైతుసంఘం, కౌలురైతు సంఘం, అంబేద్కర్ ఆశయ సాధన సంఘం నేతలు పాల్గొన్నారు.

జనసేన కార్యాలయం ముందు పిఇటి అభ్యర్థుల నిరసన

- డిఎస్‌సి ద్వారా పిఇటి పోస్టులు భర్తీ చేయాలని డిమాండ్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

మంగళగిరిలోని జనసేన ప్రధాన కార్యాలయం ఎదుట మంగళవారం పిఇటి అభ్యర్థులు నిరసన తెలిపారు. డిఎస్‌సి పరీక్షల్లో పిఇటి పోస్టులను ఎత్తివేస్తూ నోటిఫికేషన్ ఇవ్వడాన్ని నిరసించారు. ప్రభుత్వం తక్షణమే డిఎస్‌సి ద్వారా పిఇటి పోస్టులను భర్తీ చేయాలని ప్రభుత్వాన్ని అభ్యర్థులు డిమాండ్ చేశారు. పిఇటి అభ్యర్థుల జీవితాలతో ఆటలాడుకోవద్దన్నారు. యువగళం పాదయాత్ర సందర్భంగా నారా లోకేష్ తమకు హామీ ఇచ్చారని, ఇచ్చిన హామీని అమలు చేయాలని అన్నారు. పహల్గామ్ మృతులకు నివాళులు అర్పించేందుకు డిప్యూటీ సిఎం పవన్‌కల్యాణ్ సికె కన్వెన్షన్‌కు వెళ్లే సమయంలో ఈ నిరసన చేపట్టారు.

స్పెషల్ డిఎస్‌సి నోటిఫికేషన్‌కు ఆర్డినెన్స్ విడుదల చేయాలి

- మే 2న ఏజెన్సీ బంద్ : సురేంద్ర

ప్రజాశక్తి - కురుపాం (పార్వతీపురం మన్యం జిల్లా)

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఏజెన్సీలో స్పెషల్ డిఎస్‌సి నోటిఫికేషన్ విడుదలకు తక్షణమే ఆర్డినెన్స్ విడుదల చేయాలని ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కిలో సురేంద్ర డిమాండ్ చేశారు. పార్వతీపురం మన్యం జిల్లా జియ్యమ్మవలస మండలం రావాడ రామభద్రపురంలో ఆయన మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ మెగా డిఎస్‌సి నోటిఫికేషన్‌లో ఏజెన్సీలోని 882 పోస్టులు ఆదివాసీలకు దక్కాల్సి ఉండగా, కేవలం 45 మాత్రమే ఉన్నాయని తెలిపారు. దీంతో ఆదివాసీ నిరుద్యోగ అభ్యర్థులు తీవ్ర అన్యాయానికి గురయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. జిఒ 3 వల్ల ఆదివాసీ ప్రాంతంలో నూరు శాతం ఉద్యోగ, ఉపాధ్యాయ నియామకాల్లో న్యాయం జరిగేదని, ఈ జిఒ రద్దుతో ఆదివాసీలకు తీవ్ర అన్యాయం జరుగుతోందని ఆందోళన వ్యక్తం చేశారు.



తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం స్పందించి ఏజెన్సీ ప్రాంతాల్లో స్పెషల్ డిఎస్‌సి నోటిఫికేషన్ విడుదలకు ఆర్డినెన్స్ తీసుకొచ్చి ఏజెన్సీ ప్రాంతాల్లో వంద శాతం ఉద్యోగ, ఉపాధ్యాయ ఉద్యోగాలివ్వాలని డిమాండ్ చేశారు. షెడ్యూల్ ఏరియాలో లేని గిరిజన గ్రామాలను షెడ్యూల్ ఏరియాలో కలిపి ఆదివాసీల భూములకు, అడవులకు రక్షణ కల్పించాలని కోరారు. ఆదివాసీ స్పెషల్ డిఎస్‌సి సాధన కమిటీ ఆధ్వర్యంలో మే 2న పిలుపు ఇచ్చిన ఏజెన్సీ బంద్‌కు ఆదివాసీ గిరిజన సంఘం సంపూర్ణ మద్దతు ఇస్తుందని, అలాగే ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు బంద్‌లో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

పిఎం జన్‌మన్ కింద ప్రత్యేక ఆధార్ శిబిరాలు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ఆధార్ కార్డులేని గిరిజనుల కోసం పిఎం జన్‌మన్ కింద ఆధార్ ప్రత్యేక శిబిరాలను తక్షణమే నిర్వహించాలని గ్రామ, వార్డు సచివాలయాలశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ఇందుకు సంబంధించి అల్లూరి సీతారామరాజు, అనంతపురం, ఏలూరు, కాకినాడ, నంద్యాల, పల్నాడు, పార్వతీపురం మన్యం, ప్రకాశం, శ్రీకాకుళం, విజయనగరం కలెక్టర్లు ప్రత్యేక చొరవ చూపాలని గ్రామ, వార్డు సచివాలయాలశాఖ ఎమ్‌డి ఎం శివప్రసాద్ సూచించారు.

జిల్లాల వారీ ఇప్పటి వరకు ఆధార్ నమోదు చేసుకోని గిరిజనులు 34,995 మంది ఉన్నారని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. అల్లూరి సీతారామరాజు జిల్లాలో 26,134 మంది, అనంతపురం 380, ఏలూరు 588, కాకినాడ 120, నంద్యాల 1,039, పల్నాడు 658, పార్వతీపురం మన్యం 2,421, ప్రకాశం 2,501, శ్రీకాకుళం 1,100, విజయనగరంలో 54 మంది చొప్పున ఉన్నారని తెలిపారు.

యర్రబల్లి ఎత్తిపోతల పనులకు బ్రేక్

- ప్రభుత్వానికి పట్టని యురేనియం నిర్వాసితుల గోడు
- బిల్లులు చెల్లించకపోవడంతో పనులు నిలిపివేత
- అడ్డంకిగా మారిన భూ సేకరణ

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

వైఎస్‌ఆర్ జిల్లా పులివెందుల నియోజకవర్గ పరిధిలోని యర్రబల్లి-చిత్రావతి (యుసిఐఎల్) ఎత్తిపోతల పనులు నిలిచిపోయాయి. కాంట్రాక్టర్‌కు సకాలంలో బిల్లులు చెల్లించకపోవడంతో పనులు ఆగిపోయాయి. భూసేకరణ సమస్య కూడా ప్రధాన అడ్డంకిగా మారింది.

2007 నవంబర్‌లో వేముల మండలం ఎం.తుమ్మలపల్లి సమీపంలో యురేనియం కార్పొరేషన్ ఆఫ్ ఇండియా కంపెనీ ఏర్పడింది. యురేనియం కార్పొరేషన్ ఆఫ్ ఇండియా చేపట్టిన తవ్వకాల కారణంగా వేముల మండలంలోని కనంపల్లి, వేల్పుల, కనంకిందకొట్టాల, భూమయ్యగారిపల్లి, తుమ్మలపల్లి, మబ్బుచింతలపల్లి, రాచకుంటపల్లి గ్రామాల్లోని తాగునీరు కలుషితం కావడంతో అంతుబట్టని చర్మ, ఇతర ప్రాణాంతక వ్యాధులు ప్రబలాయి. దీంతో ఆయా గ్రామస్తులు పెద్ద ఎత్తున ఆందోళనలకు దిగారు. అప్పటి రాష్ట్ర ప్రభుత్వం పులివెందుల నియోజవర్గం లింగాల మండలంలోని చిత్రావతి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ నుంచి యర్రబల్లి ఎత్తిపోతల ద్వారా రెండు టిఎంసిల తాగునీటిని ఆయా గ్రామాలకు సరఫరా చేయాలని నిర్ణయించింది. 2021 జనవరిలో రూ.852 కోట్లతో 48.36 కిలోమీటర్ల పైప్‌లైన్ పనులకు టెండర్లు పిలిచింది. కాంట్రాక్టును ఎంఆర్‌కెఆర్ కన్‌స్ట్రక్షన్ దక్కించుకుంది. 2024 నవంబర్ వరకు సుమారు 11 కిలోమీటర్ల వరకు మాత్రమే పైప్‌లైన్ పనులు చేసింది. సకాలంలో బిల్లులు చెల్లించకపోవడంతో కాంటాక్ట్ సంస్థ తాత్కాలికంగా పనులను నిలిపేసింది. 2024 సార్వత్రిక ఎన్నికల అనంతరం రాష్ట్రంలో టిడిపి కూటమి సర్కారు అధికారంలోకి రావడంతో పైప్‌లైన్ పనులు పూర్తిగా నిలిచిపోయాయి.



కణంపల్లిలో నిలిచిపోయిన ఎత్తిపోతల పనులు

అడ్డంకిగా భూ సమస్య

యర్రబల్లి ఎత్తిపోతలకు భూసేకరణ సమస్య అడ్డంకిగా మారింది. లింగాల నుంచి వేముల మండలం వరకు 482 ఎకరాలను సేకరించాల్సి ఉంది. ఇందులో 150.42 ఎకరాల అటవీ భూములున్నాయి. 130 ఎకరాల సాగు భూములను ఇవ్వడానికి రైతులు నిరాకరించడంతో పనుల్లో స్తబ్దత నెలకొంది. భూసేకరణ సమస్యకుతోడు బిల్లుల చెల్లింపుల నిలిపివేత కారణంగా పైప్‌లైన్ పురోగతి ప్రశ్నార్థకంగా మారింది. యుసిఐఎల్ పరిధిలోని నిర్వాసిత గ్రామాలకు చెందిన 50 వేల మందికి రెండు టిఎంసిల మేరకు తాగునీటిని సరఫరా చేయాల్సి ఉంది..

పనులను పూర్తి చేస్తాం

చిత్రావతి-యర్రబల్లి ఎతిపోతల పథకం పనుల్ని పూర్తి చేయడంపై దృష్టి కేంద్రీకరించాం. ప్రభుత్వం ఆదేశాల కోసం నిరీక్షిస్తున్నాం.

- ఎం.శ్రీనివాసులు, సిఇ, ఇరిగేషన్, కడప.

ఎంఎస్‌ఎంఇ, అప్పులపై నీలినీడలు

- రిస్కులో రూ.21,800 కోట్ల రుణాలు
- టారిఫ్ యుద్ధం ప్రభావం
- ఇండియా రేటింగ్స్ రిపోర్ట్

న్యూఢిల్లీ : భారత్‌పై అమెరికా టారిఫ్‌ల పోటు దేశీయ ఎంఎస్‌ఎంఇ, మధ్యస్థ కార్పొరేట్ కంపెనీలను దెబ్బతీయనుంది. సుంకాల దెబ్బతో సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల (ఎంఎస్‌ఎంఇ)ల రుణాలు రిస్కులో పడనున్నాయని ఇండియా రేటింగ్స్ అండ్ రీసెర్చ్ (ఇండ్-రా) హెచ్చరించింది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ విధానాలతో ఎంఎస్‌ఎంఇ, మిడ్‌కార్పొరేట్లకు చెందిన రూ.21,000 కోట్ల రుణాలు ప్రమాదంలో పడొచ్చని విశ్లేషించింది. ఈ రిపోర్ట్‌లో 1,898 లిస్టెడ్, అన్‌లిస్టెడ్ ఎంఎస్‌ఎంఇలు సహా 1,055 మధ్య తరహా కార్పొరేట్ సంస్థలను అధ్యయనం చేసింది. ఇండియా రేటింగ్స్ రిపోర్ట్ ప్రకారం.. ముఖ్యంగా రసాయనాలు, వస్త్రాలు వంటి రంగాలు దుర్బల పరిస్థితిని ఎదుర్కొన్నాయి. మధ్య తరహా కార్పొరేట్‌లు బలమైన ఆర్థిక నిల్వలను కలిగి ఉన్నప్పటికీ డిమాండ్ మందగించడం ద్వారా ప్రతికూల ప్రభావాన్ని చవి చూడనున్నాయి. అయితే అనుహ్య పరిణాలను ఎదుర్కోవడానికి మిడ్ కార్పొరేట్లు భారీగా నగదు నిల్వలను కలిగి ఉన్నాయి.



1898 ఎంఎస్‌ఎంఇల్లో 6 శాతం సంస్థలు అధిక రిస్కును కలిగి ఉన్నాయి. ఇవి దాదాపు రూ.8,100 కోట్ల మొత్తం అప్పులను కలిగి ఉన్నాయి. ఇవి ఇండియా రేటింగ్స్ సమీకరించిన సమాచారంలో మొత్తం అప్పులలో 16 శాతం వాటా కలిగి ఉన్నాయి. మధ్య తరహా కార్పొరేట్‌లలో 5 శాతం సంస్థల అప్పులు అధిక రిస్క్ కేటగిరీలోకి రాగా.. 2023-24 నాటికి ఈ అప్పులు దాదాపు రూ.13,700 కోట్లుగా ఉన్నాయి. 2024 మార్చి 31 నాటికి 23 శాతం ఎంఎస్‌ఎంఇలు ఒత్తిడిలో ఉన్నాయి.

ఎంఎస్‌ఎంఇలు సాధారణంగానే మూలధన పెట్టుబడుల సమస్యలతో ఎక్కువ ఇబ్బందుల్లో ఉంటాయని ఇండియా రేటింగ్స్‌లో ఎమర్జింగ్ కార్పొరేట్‌ల అసోసియేట్ డైరెక్టర్ నీర్మోయ్ షా పేర్కొన్నారు. టారిఫ్‌లతో డిమాండ్ మందగించడం ఎంఎస్‌ఎంఇలను మరింత తీవ్రంగా ప్రభావితం చేయవచ్చన్నారు. వడ్డీ రేట్లలో తగ్గింపు, మెరుగైన ద్రవ్య లభ్యత కొంత ఉపశమనం కలిగించవచ్చన్నారు. "గత మూడేళ్లుగా వడ్డీ రాయితీ పథకం, క్రెడిట్ లింక్డ్ క్యాపిటల్ సబ్సిడీ పథకం వంటి ప్రభుత్వ కార్యక్రమాలు మూలధనాన్ని కొద్దిగా పెంచాయి. టారిఫ్ వార్ 2.0 తీవ్రతరం కావడం వల్ల ప్రపంచ, దేశీయ డిమాండ్‌లో మందగమనం చోటు చేసుకోవడం ద్వారా మరింత మూలధనాన్ని ఖర్చు చేయడంలోనూ అవరోదాలను ఎదుర్కోనున్నాయి.." అని ఇండియా రేటింగ్స్ పేర్కొంది.

గంజాయి రవాణా, సరఫరాదారుల ఆస్తుల జప్తు

- ఈగల్ టీమ్ ఐజి ఆకే రవికృష్ణ

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

మాదకద్రవ్యాలు, గంజాయి అక్రమ రవాణా ద్వారా అక్రమ ఆస్తులు కూడబెట్టిన రవాణాదారుల ఆస్తుల జప్తునకు ప్రత్యేకంగా రంగం సిద్ధం చేశామని, నేరస్తులు ఎంతటివారైనా ఉపేక్షించేది లేదని రాష్ట్ర ప్రత్యేక ఈగల్ టీమ్ ఐజి ఆకే రవికృష్ణ తెలిపారు. నగరంలోని జిల్లా పోలీస్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో మంగళవారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడారు. గంజాయి రవాణాదారులు, సరఫరాదారులను గుర్తించి వారి ఆస్తులను జప్తు చేయడమే లక్ష్యంగా ఈగల్ టీమ్ పని చేస్తుందన్నారు. ఈ కోవలో ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా వందమందిని గుర్తించామన్నారు. అనకాపల్లిలో కొద్దిరోజుల క్రితం ఓ గంజాయి సరఫరాదారుడిని గుర్తించి అతని ఆస్తులను, కుటుంబ సభ్యుల ఆస్తులను జప్తు చేశామని, వాటి విలువ దాదాపు కోటిన్నర ఉంటుందని తెలిపారు. అల్లూరి సీతారామరాజు జిల్లాలో 375 గ్రామాల్లో గంజాయి సాగు ఎక్కువగా ఉన్నట్లు గుర్తించామని, ఇదీ 350 కుటుంబాలు చేపడుతున్నట్లు గుర్తించామని వివరించారు. 1083 ఎకరాల్లో వేరే పంటలు సాగుచేసుకునేలా విత్తనాలు అందించామని తెలిపారు. ప్రస్తుతం జంగారెడ్డిగూడెం పరిసర ప్రాంతాల్లో దొరికిన 400 కేజీల గంజాయి మన రాష్ట్రంలో పండింది కాదని, ఒడిశా నుంచి రవాణా చేస్తున్నట్లు గుర్తించామని వివరించారు. ఈగల్ క్లబ్స్ 45 వేల విద్యాసంస్థల్లో ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఈ క్లబ్‌ల ముఖ్యోద్దేశం విద్యార్థులు ఎవరు మాదక ద్రవ్యాల బారిన పడకుండా చూసుకోవడమేనన్నారు. ఆపరేషన్ గరుడ పేరుతో రాష్ట్రవ్యాప్తంగా ఒకేసారి మందుల దుకాణాల్లో తనిఖీలు నిర్వహించి, 165 కేసులు నమోదు చేశామని తెలిపారు. ఎవరైనా గంజాయి, మాదక ద్రవ్యాలు అక్రమ రవాణా చేస్తున్నట్లు తెలిస్తే 1972 నెంబర్‌కు కాల్ చేసి సమాచారం అందించాలని కోరారు. ఈ సమావేశంలో రవికృష్ణతో పాటు ఏలూరు జిల్లా ఎస్‌పి ప్రతాప్‌శివకిషోర్ ఈగల్ టీం ఎస్‌పి నగేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

సుందరం ఫైనాన్స్ డిపాజిట్ల వడ్డీ రేట్లలో మార్పులు

చెన్నయ్ : డిపాజిట్లపై వడ్డీ రేట్లలో మార్పులు చేస్తోన్నట్లు సుందరం ఫైనాన్స్ లిమిటెడ్ తెలిపింది. కొత్త వడ్డీ రేట్లు మే 1 నుంచి అమల్లోకి రానున్నాయని తెలిపింది. సీనియర్ సిటిజన్లకు 12 నెలల కాలవ్యవధికి 7.70 శాత, 24, 36 నెలల కాలానికి 8 శాతం వడ్డీ రేటును అందించనున్నట్లు పేర్కొంది. ఇతరులకు 12 నెలలకు 7.20 శాతం, 24 మరియు 36 నెలల డిపాజిట్లకు 7.50శాతం వడ్డీ రేటు వర్తించనుందని ఆ సంస్థ పేర్కొంది.

రాయలసీమ ఎక్స్‌ప్రెస్‌లో దోపిడీ

- గుత్తి వద్ద ఘటన

ప్రజాశక్తి - గుత్తి

అనంతపురం జిల్లా గుత్తి రైల్వే జంక్షన్ నార్త్ క్యాబిన్ వైపు ఉన్న పంపు హౌస్ సమీపంలో ఆగిఉన్న రాయలసీమ ఎక్స్‌ప్రెస్ (12794) రైలులో సోమవారం అర్ధరాత్రి గుర్తుతెలియని దుండగులు దోపిడీకి పాల్పడ్డారు. తెలంగాణలోని నిజామాబాద్ నుంచి తిరుపతికి వెళుతున్న ఈ రైలు సిగ్నల్ లేకపోవడంతో నార్త్ క్యాబిన్ వైపు నాలుగు కిలోమీటర్ల సమీపంలో నిలబడిపోయింది. ఇది గమనించిన దుండగులు బోగీల్లోకి చొరబడ్డారు. ప్రయాణికులను బెదిరించి వారి వద్ద ఉన్న బంగారు ఆభరణాలు, నగదును దోచుకెళ్లారు. ఈ ఘటనపై తమకు ఎలాంటి ఫిర్యాదూ రాలేదని గుత్తి జిఆర్‌పి పోలీసులు తెలిపారు. బాధిత ప్రయాణికులు తిరుపతిలో జిఆర్ పి పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసినట్లు సమాచారం. గతంలోనూ గుత్తి రైల్వే జంక్షన్ పరిధిలోని తురకపల్లి రైల్వే స్టేషన్ సమీపంలో సెవెన్ హిల్స్ ఎక్స్‌ప్రెస్‌లో దుండగులు దోపిడీకి పాల్పడ్డారు. దీంతో రైల్వే ప్రయాణికులు భయాందోళనలకు గురవుతున్నారు. ఇప్పటికైనా రైళ్లలో దోపిటీలు జరగకుండా సివిల్, జిఆర్‌పి, ఆర్‌పిఎఫ్ శాఖలు సంయుక్తంగా అరికట్టాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు. ఘటనపై జిఆర్‌పి పోలీసులు, ప్రత్యేక బృందాలు సంఘటన స్థలంతో పాటు వివిధ ప్రాంతాల్లో విచారణ చేపట్టినట్టు సమాచారం.



తెలుగు రాష్ట్రాల్లో పాలసీల జారీలో 3 రెట్ల వృద్ధి

- టాటా ఎఐజి వెల్లడి
- కొత్తగా మెడికేర్ సెలెక్ట్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - హైదరాబాద్

వైద్య బీమా సంస్థ టాటా ఎఐజి గతేడాది వ్యవధిలో తెలుగు రాష్ట్రాల్లో పాలసీల జారీలో మూడు రెట్ల వృద్ధిని సాధించినట్లు వెల్లడించింది. 82,000 పైగా పాలసీదారులకు కవరేజీని అందించడం ద్వారా మెరుగైన ప్రగతిని కనబర్చినట్లు పేర్కొంది. మంగళవారం హైదరాబాద్‌లో టాటా ఎఐజి ఎజెన్సీ హెడ్ ప్రతీక్ గుప్తా, యాక్సిడెంట్ అండ్ క్లెయిమ్స్ హెడ్ రుద్రరాజు రాజగోపాల్ మీడియాతో మాట్లాడారు. అంతగా వైద్య బీమా సేవలందనీ మార్కెట్ల కోసం కొత్తగా మెడికేర్ సెలెక్ట్ పాలసీని అందుబాటులోకి తెచ్చామన్నారు. తెలుగు రాష్ట్రాల్లో 1600 పైగా హాస్పిటల్స్‌తో పటిష్టమైన నెట్‌వర్క్‌ను కలిగి ఉన్నామన్నారు. గడిచిన ఆర్థిక సంవత్సరంలో ఈ ప్రాంతంలో 97 శాతం క్లెయిమ్ సెటిల్మెంట్ నిష్పత్తిని సాధించామన్నారు. 14,500 అడ్వైజర్లతో సెమీ అర్బన్, గ్రామీణ ప్రాంతాల్లో వైద్య, బీమా సేవలను విస్తరిస్తున్నామన్నారు. జాతీయ సగటు 13 శాతంతో పోల్చితే తెలుగు రాష్ట్రాల్లో వైద్య వ్యయం 16 శాతం పెరిగిందన్నారు. 2024-25లో నగదురహిత సేవల వినియోగం తెలంగాణలో 81 శాతంగా, ఆంధ్రప్రదేశ్‌లో 68 శాతంగా నమోదయ్యిందన్నారు. ప్రస్తుతం వైద్య బీమాలో 3.6 శాతం మార్కెట్ వాటాను కలిగి ఉన్నామని.. దీన్ని 5 శాతానికి పెంచుకోవాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు.

ఇన్ఫోసిస్‌లో నాలుగోసారి ట్రైనీలపై వేటు

బెంగుళూరు : దేశంలోనే రెండో అతిపెద్ద టెక్ కంపెనీ ఇన్ఫోసిస్ తన ట్రైనీ ఉద్యోగులపై పదేపదే కన్నెర్ర చేస్తోంది. ఈ ఏడాదిలో వరుసగా నాలుగో సారి తొలగింపులకు పాల్పడింది. ఇటీవలే కర్ణాటక రాష్ట్రంలోని మైసూరు క్యాంపస్‌లో శిక్షణ పొందుతున్న వందలాది మంది ట్రైనీలను తొలగించగా.. తాజాగా మరో 195 మందిని ఇంటికి పంపించింది. ఇంటర్నల్ అసెస్‌మెంట్‌లో ఉత్తీర్ణత సాధించకపోవడంతో వారిని తొలగించినట్లు రిపోర్టులు వస్తోన్నాయి. సిస్టమ్ ఇంజినీర్, డిజిటల్ స్పెషలిస్ట్ ఇంజనీర్ విభాగంలోని ట్రైనీలు తొలగింపుకు గురైనట్లు ఆ సంస్థ తెలిపింది. ఫిబ్రవరి నుంచి ఇప్పటి వరకూ సంస్థ దాదాపు దాదాపు 800 మంది ట్రైనీలకు ఉద్వాసన పలికింది.

సంపాదకీయం

నూతన ఆవిష్కరణలేవీ?

భారతావని బంగారు భవిష్యత్‌కు బాటలు వేయాల్సిన నూతన ఆవిష్కరణలు వెనుకపట్టు పడుతున్నాయి. 'ఇవాళ భారతదేశంలో గొప్ప స్టార్టప్‌లు ఏమి ఉన్నాయి? మన శ్రద్ధంతా ఫుడ్ డెలివరీ యాప్స్‌కే పరిమితం. నిరుద్యోగులను చౌకగా దొరికే కూలీలుగా తయారు చేసి వారి చేత ధనవంతులకు ఇంటిపట్టునే భోజనం అందేలా చేస్తున్నామంతే' అని కేంద్ర వాణిజ్య శాఖ మంత్రి పీయూష్ గోయల్ ఇటీవల స్టార్టప్ మహా కుంభ్‌లో చేసిన వ్యాఖ్యలు నిష్టుర సత్యం. ఈ దుస్థితికి కారణం ఎవరు? స్టార్టప్ కంపెనీల సంఖ్యలో మనదేశం అమెరికా, చైనాల తరువాత మూడో స్థానంలో ఉన్నా, అత్యధికం దృష్టంతా వినియోగదారులకు సౌకర్యాలు పెంచడంపైనే. ప్రముఖ పారిశ్రామిక వేత్తలందరూ ఎక్కువస్థాయిలో వినిమయం జరిగే ఇ-కామర్స్, ఆహారం, కిరాణా వస్తువుల డెలివరీ, చిరుతిళ్ల ఉత్పత్తి తదితర రంగాలపైనే కేంద్రీకరిస్తున్నారు. లాభాలను కొల్లగొట్టడమే వారి లక్ష్యం! డీప్ టెక్, సెమీ కండక్టర్లు, ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్, బయోటెక్నాలజీ, స్పేస్ టెక్నాలజీ వంటి రంగాల్లో యువత స్టార్టప్‌లు ప్రారంభించాలని కేంద్ర మంత్రి సూచించారు. ఆ దిశగా కేంద్రం ఏమైనా ప్రోత్సహిస్తుందా? అంటే అదీ లేదు. వికసిత్ భారత్ -2047 అంటూ ప్రచారం ఉవ్వెత్తున సాగుతుండగా జిడిపిలో కేటాయింపులు నానాటికీ తీసికట్టుగా వున్నాయి. రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ కోసం జర్మనీ, అమెరికా తమ జిడిపిలో 3 శాతానికిపైగా కేటాయిస్తుండగా, చైనా 2.24 శాతాన్ని కేటాయిస్తోంది. 2009-10లో మనదేశం జిడిపిలో 0.82 శాతం కేటాయించగా, 2020-21 నాటికి 0.64 శాతానికి క్షీణించడం మోడీ సర్కారు తీరుకు అద్దంపట్టేదే. 2021-22 బడ్జెట్‌లో నేషనల్ రీసెర్చ్ ఫౌండేషన్‌కు ఐదేళ్ల కోసం రూ.50 వేల కోట్లు కేటాయించి, 2024-25 నాటికి రూ.200 కోట్లకు కుదించింది. నేషనల్ ఎఐ మిషన్ ఇంకా పూర్తికాలేదు. డీప్‌టెక్ స్టార్టప్‌ల కోసం రూ.10 వేల కోట్లతో 2016లో భారత చిన్నతరహా పరిశ్రమల అభివృద్ధి బ్యాంకు ఆధ్వర్యాన 'ఫండ్ ఆఫ్ ఫండ్స్' ప్రారంభించారు. దీనిద్వారా రూ.9,121 కోట్లు ఆల్టర్నేటివ్ ఇన్వెస్ట్‌మెంట్స్ ఫండ్స్‌కు ఇస్తామని చెప్పి, 2023 ఏప్రిల్ నాటికి ఇచ్చింది రూ.3,931 కోట్లే. సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలకు మద్దతుగా 2020లో రూ.50 వేల కోట్ల 'సెల్ఫ్ రిలయంట్ ఇండియా' ఫండ్‌ను ప్రకటించారు. దేశంలో నమోదైన 5.93 కోట్ల సూక్ష్మ, చిన్న మధ్యతరహా పరిశ్రమల్లో 577 పరిశ్రమలే దీనిద్వారా లబ్ధిపొందాయి. కేటాయింపులు, అమలుకు మధ్య ఉన్న హస్తమశకాంతర వ్యత్యాసమే రీసెర్చ్ అండ్ ఎనాలసిస్ రంగాన్ని వెంటాడుతోంది. సెమీ కండక్టర్ల రంగంలో ఓ ఔత్సాహికుడు తన స్టార్టప్‌కు పన్ను రాయితీలివ్వాలన్న అభ్యర్థనను రెండేళ్ల తరువాత తిరస్కరించారు. ఈ పరిస్థితులు స్టార్టప్‌లకు ప్రోత్సాహకరంగా ఉంటాయా మంత్రి గారూ?

2023లో మనదేశం నుంచి డీప్ టెక్ రంగంలోకి వెళ్లిన పెట్టుబడులు ఐదు శాతమే. అదే చైనాలో 35 శాతం. 2015లో 'మేడిన్ చైనా -2025' ప్రాజెక్టు ప్రారంభమైంది. ఇప్పుడు ప్రపంచ సౌరఫలకాల ఉత్పత్తిలో 80 శాతం, లిథియం - అయాన్ బ్యాటరీలు, డ్రోన్లు, వాణిజ్య వాహనాలలో 75 శాతం మేడిన్ చైనావే. సెమీ కండక్టర్లు, ఎఐ డ్రోన్లు, ఎలక్ట్రిక్ కార్లు, సోలార్ ప్యానెళ్లు వంటి రంగాల్లో అగ్రగామిగా ఉంది. పరిశోధనలు, అభివృద్ధి కోసం చైనా గత ఏడాది చేసిన ఖర్చు 496 బిలియన్ డాలర్లు. మనదేశం ప్రస్తుత బడ్జెట్‌లో కేటాయించింది 23.45 బిలియన్ డాలర్లు. ప్రైవేటురంగంతోపాటు ప్రభుత్వ రంగాన్ని ప్రోత్సహించడంతో టాప్ 10 గ్లోబల్ ఫార్చ్యూన్ కంపెనీల్లో మూడు చైనా పిఎస్‌యులే ఉన్నాయి. అక్కడ 600 డాలర్ల నుంచి టెస్లా కంటే అత్యధిక ధర కల లగ్జరీ కార్ల వరకూ చైనా దూసుకుపోతుండగా, మన కార్ల కంపెనీలు పదేళ్ల క్రితం ఇంజన్ నమూనాలతోనే అత్యధిక ధరకు అమ్మకాలు సాగిస్తున్నాయి. మనదేశంలో భారీ పెట్టుబడులు, అతి పెద్ద మార్కెట్ ఉన్నా, కొత్త సాంకేతికతల ఆవిష్కరణలను ప్రోత్సహించే, వినియోగించే వాతావరణమే లేదు. దేశంలో ప్రతిభ, మార్కెట్, పెట్టుబడులు ఉన్నాయి. కావాల్సిందల్లా సరైన నిర్ణయాలు, అమలు చేయాలన్న చిత్తశుద్ధే!

మహనీయుల మాట



ఈ విశాల జగతిలోన
ఏమిటి నే కోరినాను!
ఒక దోసెడు సానుభూతి..
ఒక పిడికెడు తిరుగుబాటు..
కొంచెం సానుభూతి,
కొంచెం తిరుగుబాటు వస్తే చాలు...
నాకు అంతకంటే ఇంకేమీ అక్కర్లేదు.

- మహాకవి శ్రీశ్రీ

జననం: 30.4.1910
మరణం:15.6.1983

ఈసారైనా రాజధానికి నిధులు ఇస్తారా?

విశ్లేషణ

మే రెండవ తేదీన ప్రధాని మోడీ రాజధాని అమరావతి పనుల పునఃప్రారంభానికి విచ్చేస్తున్నారు. 2015 అక్టోబర్ 22వ తేదీన మోడీ అమరావతికి శంకుస్థాపన చేశారు. ఆనాడు నిధులు ఇస్తారని ప్రజలు ఆశ పడ్డారు. కానీ మోడీ ఢిల్లీ నుండి చెంబుడు నీరు, గుప్పెడు మట్టి తెచ్చి ఆంధ్రప్రదేశ్ ప్రజల నోట్లో మట్టి కొట్టారు. రాష్ట్ర ప్రజలను నిరాశపరిచారు. నేటికి 3475 రోజులు గడిచాయి. రాష్ట్రం, రాజధాని ఎడల కేంద్రం నిర్లక్ష్యం, చిన్నచూపు ఈ పదేళ్లూ కొనసాగింది.

ఢిల్లీని తలదన్నే రాజధాని ఎక్కడ!

ఢిల్లీని తలదన్నే రాజధాని నిర్మిస్తామని మోడీ స్వయంగా 2014 ఎన్నికలలో రాష్ట్ర ప్రజలకు హామీ ఇచ్చారు. ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టం, 2014, సెక్షన్ 94 (3) ప్రకారం రాజ్‌భవన్, అసెంబ్లీ, సచివాలయం నిర్మాణంతో సహా మౌలిక సదుపాయాల కల్పనకు ప్రత్యేక నిధులను కేంద్ర ప్రభుత్వం ఇవ్వాలి. రాజధాని నిర్మాణం కేంద్ర ప్రభుత్వ బాధ్యత. 2014-19 కాలంలో టిడిపి, బిజెపి రాష్ట్ర ప్రభుత్వం అమరావతి నిర్మాణానికి రూ.42 వేల కోట్లు అవసరమని కేంద్రానికి నివేదికలు పంపింది. అయినా ఈ పదేళ్లలో కేంద్రం ఇచ్చింది కేవలం రూ.1500 కోట్లు మాత్రమే.

వైసిపి ప్రభుత్వం మూడు రాజధానుల పేరుతో అమరావతిని నిర్వీర్యం చేసింది. కేంద్రంతో జతకట్టిన వైసిపి రాష్ట్రానికి రాజధాని లేకుండా చేసింది.



సిహెచ్. బాబూరావు

అమరావతి రాజధానిలో 40 పైగా కేంద్ర ప్రభుత్వ సంస్థలు, కార్యాలయాలకు 300 ఎకరాలకు పైగా స్థలాలు కేటాయించారు. అత్యధిక విభాగాలు కనీసం స్థలాలు కూడా స్వాధీనం చేసుకోలేదు. ఒప్పందాలు చేసుకోలేదు. అతి కొద్ది సంస్థలకు ప్రహరీ గోడల నిర్మాణంతో సరిపెట్టారు. కనీసం కేంద్ర ప్రభుత్వ సంస్థల కార్యాలయాల నిర్మాణం జరిగినా కొంత మేరకు అమరావతి అభివృద్ధి ముందుకు సాగేది. కొందరికి అయినా ఉపాధి దొరికేది. కేంద్రం, మోడీ నిర్లక్ష్యానికి కేంద్ర ప్రభుత్వ సంస్థల కార్యాలయాల దుస్థితి అద్దం పడుతున్నది.

అప్పు కాదు, గ్రాంట్లు ఇవ్వండి

రాష్ట్రంలో టిడిపి, జనసేన, బిజెపి కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత రాజధాని అభివృద్ధి కార్యక్రమాలకు టెండర్లు పిలవడం సంతోషదాయకమే. లక్ష కోట్ల రూపాయల నిధులు అవసరమని ముఖ్యమంత్రి ప్రకటించారు. రాజధాని నిర్మాణానికి ప్రపంచ బ్యాంకు, ఆసియా డెవలప్‌మెంట్ బ్యాంకు నుండి రూ. 13,600 కోట్లు రుణం తీసుకుంటున్నారు. ఇదే కాకుండా హడ్కో సంస్థ నుండి మరో రూ.11 వేల కోట్లు, జర్మనీ సంస్థ నుండి మరో అయిదు వేల కోట్లు, ఇలా అన్నీ కలిపి రూ. 31 వేల కోట్లు అప్పులు మంజూరు అయ్యాయని, మరికొన్ని అప్పులు తెస్తామని ప్రకటిస్తున్నారు. ఇందులో కేంద్ర ప్రభుత్వం గ్రాంటుగా భరించేది రూ. 1400 కోట్లు మాత్రమే. అప్పులు ఇప్పించడమే తమ గొప్ప అని కేంద్రం చెప్పుకోవడం సిగ్గుచేటు. గతంలో రాజధాని నిర్మాణానికి ప్రపంచ బ్యాంకు అప్పు ఇస్తామని చెప్పి, ఆ తర్వాత నిలిపివేసింది. ఇప్పుడు ఇస్తున్న అప్పును 29 సంవత్సరాలలో జపాన్ కరెన్సీలో వడ్డీలతో సహా ఈ అప్పు తిరిగి చెల్లించాలి. ప్రపంచ బ్యాంకు ఎప్పటికప్పుడు సంతృప్తి చెందితే దశలవారీగా ఈ అప్పు విడుదల అవుతుంది.

ఈ ప్రపంచ బ్యాంకు అప్పును నమ్ముకుంటే రాజధాని అభివృద్ధి సాఫీగా జరుగుతుందా? మంచినీటి సరఫరా, డ్రైనేజీ ఇతర మౌలిక సదుపాయాల నిర్వహణ ప్రైవేట్ భాగస్వామ్యంతో నిర్వహించాలని ప్రపంచ బ్యాంకు షరతులు పెడుతోంది. బాండ్లు ఇతర రూపాలలో ప్రైవేటు సంస్థల నుండి నిధులు సమీకరించుకోవాలని సూచనలు చేసింది. ఇంకా ఎన్నెన్నో షరతులు విధించడం ప్రపంచ బ్యాంకుకు సర్వసాధారణమే. ఈ అప్పు, వడ్డీ భారం అంతా రాష్ట్ర ప్రజల పైన, అమరావతి ప్రజల పైనే పడుతుంది. ఈ అప్పు మొత్తం కేంద్రమే భరిస్తుందని కూటమి నేతలు కొందరు నమ్మబలుకుతున్నారు. కేంద్రం మాత్రం అప్పులు మంజూరుకు తోడ్పడుతున్నావని మాత్రమే పార్లమెంటులో ప్రకటించింది. అప్పు భరించటానికి కేంద్రం ఎటువంటి ఆదేశాలు ఇవ్వలేదు. డబుల్ ఇంజన్, త్రిబుల్ ఇంజన్ ప్రభుత్వంగా చెప్పుకునే చంద్రబాబు, పవన్ కల్యాణ్ కేంద్రంపై ఎందుకు ఒత్తిడి తేవడం లేదు? గత పది సంవత్సరాలలోని రాష్ట్ర ప్రభుత్వాలన్నీ కేంద్రంపై ఒత్తిడి తేవడంలో విఫలమయ్యాయి. కనీసం ఇప్పుడైనా కేంద్ర ప్రభుత్వంలో భాగస్వాములుగా ఉండి ఎందుకు మాట్లాడరు? మే రెండవ తేదీ అయినా ప్రధానమంత్రి అప్పులు స్థానంలో గ్రాంట్లు ప్రకటించాలి. ఈసారైనా ఒట్టి మాటలతో సరిపెట్టకుండా స్పష్టమైన ప్రకటనలు చేయాలి. గతంలో లాగా మట్టి, నీరుతో సరిపెట్టకుండా నిధులు ఇవ్వాలి. కేంద్ర ప్రభుత్వ సంస్థల కార్యాలయాల పనులను ఆరు నెలల్లో పూర్తి చేయడానికి కార్యాచరణ ప్రకటించాలి. ఇప్పటివరకు రాజధాని, రాష్ట్రం పట్ల జరిగిన నిర్లక్ష్యాన్ని సరిదిద్దండి. చిత్తశుద్ధి ప్రదర్శించండి.

రాజధానికే కాదు, రాష్ట్రానికి అవసరమైన ప్రత్యేక హోదా, విభజన హామీల అమలుపైనా ప్రధాని స్పందించాలి. ప్రత్యేక హోదా వస్తే.. రాజధానికే కాదు, రాష్ట్రానికీ పరిశ్రమలు వస్తాయి. ఉపాధి లభిస్తుంది.

గత పదేళ్లలో రాజధాని అమరావతి ఆశించిన రీతిలో ముందుకు సాగలేదు. నాడు రాజధానికి 34 వేల ఎకరాలు భూములు సమీకరించారు. రైతులు, కూలీలు, ప్రజలకు రక్షణ కల్పిస్తూ పూలింగ్ చట్టం చేశారు. 2014-19 కాలంలో టిడిపి పాలనలో వేగం లేదు. తాత్కాలిక నిర్మాణాలతో సరిపెట్టారు. వైసిపి పాలనా కాలంలో అమరావతిని పూర్తిగా నిర్వీర్యం చేశారు. రైతులకు కౌలు సక్రమంగా చెల్లించలేదు. 2015లో భూములు తీసుకున్నా, మూడు సంవత్సరాలలో అభివృద్ధి చేసిన ప్లాట్లు అప్పగిస్తామన్న చట్టబద్ధమైన మాట నిలబెట్టుకోలేదు. భూమిలేని పేదలకు 4318 మందికి రాజధాని పెన్షన్ నిలిపివేశారు. 8 సంవత్సరాలలో పెన్షన్ నయా పైసా పెంచలేదు. ఉచిత విద్య, వైద్యం హామీలు అమలు జరగడం లేదు. ఉపాధి కల్పన లేదు. బలహీన వర్గాలకు చెందిన వారి అసైన్డ్ భూములకు సమాన ప్యాకేజీ ఇవ్వలేదు. స్థానిక ప్రజలకు గృహ నిర్మాణం అరకొరగానే జరిగింది. రాష్ట్రంలోని అన్ని పట్టణాల్లో పారిశుధ్య కార్మికులకు నెలకు రూ.21 వేల వేతనం ఇస్తుండగా రాజధానిలో మాత్రం రూ.12 వేలతో సరిపెడుతున్నారు. ప్రతి నెల సక్రమంగా జీతం కూడా అందటం లేదు.

ఉట్టికెక్కలేనమ్మ స్వర్గానికి ఎక్కుతుందా?

రాజధాని అభివృద్ధి, రైతుల ప్లాట్ల అభివృద్ధి, స్థానిక ప్రజలకు ఇచ్చిన చట్టబద్ధమైన హామీల అమలులో తీవ్ర నిర్లక్ష్యం జరుగుతోంది. కేంద్రం నిధులు ఇవ్వకపోవడంతో, అప్పుల కోసం అర్రులు చాస్తున్నారు. భవిష్యత్తు ఎలా ఉంటుందో తెలియక ఇంకా గందరగోళ స్థితి కొనసాగుతున్నది. మొదటి దశలో సమీకరించిన 34,390 ఎకరాలతో పాటు వివిధ ప్రభుత్వ భూములు కలుపుకొని మొత్తం 53,748 ఎకరాలు ప్రభుత్వం సమకూర్చింది. అమరావతి లోని 25 గ్రామాలలో ఆనాడు సమీకరణకు ఇవ్వకుండా మిగిలిపోయిన మరో 4181 ఎకరాల భూమిని సమీకరించడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఒక వైపు ప్రస్తుత రాజధాని స్థితి ఇలా ఉండగా, రెండవ దశలో మరో 44 వేల ఎకరాలు భూములు (మొత్తం కలిపి దాదాపు లక్ష ఎకరాలు) సమీకరిస్తామని మంత్రి నారాయణ ప్రకటించడంతో తీవ్ర అలజడి చెలరేగింది. 10 సంవత్సరాల క్రితం భూములు ఇచ్చిన మాకే దిక్కు లేదు, మళ్ళీ వేల ఎకరాలు సమీకరిస్తే మా పరిస్థితి ఏమిటి, మా ప్లాట్ల సంగతి ఏమిటి? అని గతంలో భూములు ఇచ్చిన రైతులు ప్రశ్నిస్తున్నారు. అమరావతిలో వ్యవసాయం లేక పనుల కోసం చుట్టుపక్కల గ్రామాలకు వెళుతున్నాం, ఇప్పుడు ఆ భూములు కూడా సమీకరిస్తే మేము ఎక్కడ పనులు చేసుకోవాలి, ఎలా బతకాలి? అని కూలీలు అడుగుతున్నారు. రాజధాని నుండి గన్నవరం విమానాశ్రయానికి కొత్త బైపాస్ రోడ్డు ద్వారా కొద్దిసేపట్లోనే చేరుకోవచ్చు.

గన్నవరం విమానాశ్రయం విస్తరణకు అదనంగా భూములు సమీకరించారు. ఇప్పటివరకు తమకు పూర్తి న్యాయం జరగలేదని ఆ రైతులే గగ్గోలు పెడుతున్నారు. ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాలలోని 58 మండలాలలోని 8352 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంతో క్యాపిటల్ రీజియన్ (సి.ఆర్.డి.ఏ) ఏర్పాటు చేశారు. వివిధ ప్రాంతాలలో పరిశ్రమలు, ఇతర అభివృద్ధి గురించి మాస్టర్ ప్లాన్లు రూపొందించారు. వాటికి ఇప్పటికీ అతి గతి లేదు. ఈ ప్రశ్నలన్నిటికీ ప్రభుత్వం సమాధానం చెప్పాలి. అభివృద్ధి కేంద్రీకరణ నమూనాలు కాకుండా అభివృద్ధి వికేంద్రీకరణపై పాలకులు దృష్టి పెట్టాలి. కొత్తగా భూములు సమీకరించడంపై కాక ఇప్పటికే సమీకరించిన భూములలో అభివృద్ధి చేయటంపై కేంద్రీకరించాలి. రాష్ట్ర సమగ్ర అభివృద్ధిపై శ్రద్ధ పెట్టాలి. నిధుల కోసం కేంద్రంపై ఒత్తిడి తేవాలి. మళ్లీ రాజధానిపై వివాదాలు తలెత్తకుండా వ్యవస్థీకృతమైన చట్టం చేయవలసిన అవసరం ఉంది.

ప్రజా రాజధాని నిర్మిస్తామని చెప్పిన పాలకులు మళ్లీ సింగపూర్ తదితర బహుళజాతి, కార్పొరేట్ కంపెనీల వైపు మొగ్గు చూపటం శ్రేయస్కరం కాదు. పారదర్శకతతో అవినీతికి ఆస్కారం లేకుండా రాజధాని నిర్మించాలి. ప్రజల ఆకాంక్షలను నెరవేర్చాలి. ప్రజా రాజధాని నిర్మించాలి.

/ వ్యాసకర్త సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు/

> **ఢిల్లీని తలదన్నే రాజధాని నిర్మిస్తామని మోడీ స్వయంగా 2014 ఎన్నికలలో రాష్ట్ర ప్రజలకు హామీ ఇచ్చారు. ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టం, 2014, సెక్షన్ 94 (3) ప్రకారం రాజ్‌భవన్, అసెంబ్లీ, సచివాలయం నిర్మాణంతో సహా మౌలిక సదుపాయాల కల్పనకు ప్రత్యేక నిధులను కేంద్ర ప్రభుత్వం ఇవ్వాలి. రాజధాని నిర్మాణం కేంద్ర ప్రభుత్వ బాధ్యత. 2014-19 కాలంలో టిడిపి, బిజెపి రాష్ట్ర ప్రభుత్వం అమరావతి నిర్మాణానికి రూ.42 వేల కోట్లు అవసరమని కేంద్రానికి నివేదికలు పంపింది. అయినా ఈ పదేళ్లలో కేంద్రం ఇచ్చింది కేవలం రూ.1500 కోట్లు మాత్రమే.**



> **ప్రజా రాజధాని నిర్మిస్తామని చెప్పిన పాలకులు మళ్లీ సింగపూర్ తదితర బహుళజాతి, కార్పొరేట్ కంపెనీల వైపు మొగ్గు చూపటం శ్రేయస్కరం కాదు. పారదర్శకతతో అవినీతికి ఆస్కారం లేకుండా రాజధాని నిర్మించాలి. ప్రజల ఆకాంక్షలను నెరవేర్చాలి. ప్రజా రాజధాని నిర్మించాలి.**

నోరు తెరిస్తే అబద్ధం !

అంతర్జాతీయం

నీ స్నేహితులను చూస్తే నువ్వెలాంటి వాడివో తెలుస్తుందన్నది ఒక లోకోక్తి. అనేక దేశాల నేతలు డోనాల్డ్ ట్రంప్ తమ జిగినీ దోస్తు అని చెప్పుకోవటం, చెట్టపట్టాల్ వేసుకొని తిరగటం తెలిసిందే. ట్రంప్ దాదాపు ప్రతి రోజూ ఎక్కడో అక్కడ మీడియాతో మాట్లాడితే, నోరు విప్పేది లేదని మోడీ భీషణ ప్రతిజ్ఞ చేసినట్టు వ్యవహరిస్తారు! ట్రంప్ పచ్చి అబద్ధాల కోరు అని చైనా తాజాగా చెబుతోంది, ఒక్క చైనాయే కాదు, అమెరికా మీడియా సైతం గతంలోనూ ఇప్పుడూ అదే చెబుతోంది. రోజూ ఎన్ని అసత్యాలు, తప్పుడు సమాచారం చెబుతున్నదీ లెక్కలు తీయటం ఒక పనిగా మారింది. తాజా అబద్ధం ఏమిటంటే చైనా అధ్యక్షుడు తనతో మాట్లాడినట్లు ట్రంప్ చెప్పాడు. ఎప్పుడు అంటే అవన్నీ మీకెందుకు మూడు నాలుగు వారాల్లో పన్నుల మీద అమెరికా ఒప్పందం చేసుకుంటుంది అన్నాడు. పన్నుల నుంచి వెనక్కు తగ్గుతున్నట్లు చైనా సంకేతం పంపింది, పూర్తి విజయం నాదే అని కూడా చెప్పుకున్నాడు.

పన్నుల గురించి అమెరికాతో ఎలాంటి సంప్రదింపులు, చర్చలు జరగటం లేదని చైనా విదేశాంగ, వాణిజ్య మంత్రిత్వ శాఖలు స్పష్టం చేశాయి. అమెరికా ప్రజలను తప్పుదారి పట్టిస్తున్నదని విమర్శించాయి. ఇక ట్రంప్ అసత్యాలు, వక్రీకరణల విషయానికి వస్తే రెండోసారి పదవీ స్వీకారం చేసిన రోజే 20 అబద్ధాలు చెప్పినట్లు మీడియా విశ్లేషించింది. తొలి నాలుగేళ్ల పదవీ కాలంలో 30,573 అబద్ధాలు చెప్పినట్లు వాషింగ్టన్ పోస్టు పత్రిక వెల్లడించింది. తొలి వంద రోజుల్లోనే 492 అబద్ధాలు, 2020లో ఓటింగ్‌కు ముందు నవంబరు రెండవ తేదీన ఒక్క రోజే 503 అవాస్తవాలు చెప్పి ఓటర్లను ఆకట్టుకొనేందుకు చూసినట్లు ఆ పత్రిక పేర్కొన్నది. నిజంగా ఒక రాజకీయ నేత అలా మాట్లాడతారా అన్న అనుమానం ఉంటే ట్రంప్, అతగాడి స్నేహితులను చూడాల్సిందే.



ఎం. కోటేశ్వరరావు

ట్రంప్ నోటి నుంచి సగటున రోజుకు 21 తప్పుడు సమాచారం లేదా అబద్ధాలు వెలువడినట్లు తేలింది. తొలి ఏడాదిలో రోజుకు సగటున ఆరు, రెండో ఏడాది 14, మూడో ఏడు 22, నాలుగో సంవత్సరం 39 చొప్పున, అంటే పదవీ కాలం ముగిసే వ్యవధి దగ్గరపడిన కొద్దీ అబద్ధాలు పెరిగాయి. న్యూయార్క్ విశ్వవిద్యాలయంలోని జర్నలిజం సంస్థ ఏకంగా ట్రంప్ అబద్ధాల సమాచార కేంద్రాన్నే ఏర్పాటు చేసింది. రెండోసారి తొలి రోజే రెండు ప్రసంగాలలో 20 అబద్ధాలతో ప్రారంభం అయిన తీరు చూస్తే నాలుగేళ్లలో గత రికార్డును బద్దలు కొట్టేందుకు ఎంతో కాలం పట్టదనిపిస్తోంది. ఒక ప్రధానిగా నరేంద్ర మోడీ అమెరికా అధ్యక్షుడిగా ఎన్నికైన ఎవరికైనా అభినందనలు తెలపటం ఒక సంప్రదాయం, కానీ అబద్ధాల కోరు ట్రంప్‌ను నా స్నేహితుడు అంటూ మోడీ సందేశాలు పంపారు. వివిధ సందర్భాలలో వర్ణించారు కూడా. రాజకీయాల పుట్టుకతోనే అబద్ధాలు కూడా వెంట వచ్చాయిగానీ ఇటీవలి కాలంలో కొత్త పుంతలు తొక్కుతున్నాయి. ఎవరు అవునన్నా కాదన్నా వాటికి డోనాల్డ్ ట్రంప్, అతగాడి బాటలో నడిచే వారు నిష్ణాతులుగా మారారు. అతగాడిని చూసి ఉత్తేజం, ఉత్సాహం పొంది ప్రపంచంలో అనేక దేశాల అధ్యక్షులు లేదా ప్రధానులు కూడా సిగ్గూ ఎగ్గూ లేకుండా అవాస్తవాలు, అసత్యాలు, వక్రీకరణలకు పాల్పడుతున్నట్లు కనిపిస్తోంది. రాజకీయ నాయకుడంటే ఒపీనియన్స్ (అభిప్రాయాలు) మారుస్తూ ఉండాలని గురజాడ చురక అంటించారు. ఆయనే ఇప్పుడు బతికి ఉంటే అబద్ధాలు చెప్పని వాడు రాజకీయ నేత కానే కాడని గిరీశం చేత చెప్పించి ఉండేవారు. జర్నలిస్టులు వార్తలను సేకరించే పనిలో భాగంగా నేతల మాటల్లో అబద్ధాలు ఎన్ని ఉన్నాయో ఎత్తి చూపే పని భారం వారి మీద పడిందంటే అతిశయోక్తి కాదు. ఫ్యాక్ట్ చెక్ పేరుతో కొన్ని సంస్థలు ప్రత్యేకంగా సిబ్బందినే నియమించాయి.

ట్రంప్ రెండవసారి జనవరి 20న పదవిని చేపట్టి వందవ రోజు పూర్తి చేసుకొనేందుకు ముందుకు పోతున్నాడు. ఈ లోగానే మీడియాను అణచివేసేందుకు కూడా పూనుకున్నాడు. సరిహద్దులు లేని రిపోర్టర్లు అనే సంస్థ పత్రికా స్వేచ్ఛ మీద రాజ్యాంగేతర దాడి ఎలా జరుగుతున్నదో వివరించింది. ఆరోగ్యం, నేరాల వంటి సమాచారం తెలుసుకొనేందుకు వీలు కల్పించే ప్రభుత్వ సంస్థల వెబ్‌సైట్ల నుంచి ఎనిమిదివేల పేజీలను ప్రభుత్వం తొలగించింది. జనాలు, మీడియాకు సమాచారం అందకుండా చేయటం తప్ప ఇది మరొకటి కాదు. ప్రభుత్వం నిర్వహించే 180 రేడియో స్టేషన్లను మూసివేసేందుకు గాను వాటికి అందచేస్తున్న 110 కోట్ల డాలర్ల నిధులు నిలిపివేయాలని పార్లమెంట్‌ను కోరాడు. దీనివలన గ్రామీణ, సుదూర ప్రాంతాల వారికి వాటి సేవలు నిలిచిపోతాయి. ప్రభుత్వ రంగంలోని మీడియాకు ప్రతి ఏటా సగటున ఒక పౌరుడు చెల్లిస్తున్న మొత్తం కేవలం 1.6 డాలర్లు మాత్రమే. ఫిబ్రవరి 11వ తేదీ నుంచి అధ్యక్ష భవన వార్తలను సేకరించకుండా అసోసియేటెడ్ ప్రెస్(ఏపి) సంస్థ విలేకర్లను నిషేధించారు. మెక్సికో గల్ఫ్ పేరును అమెరికా గల్ఫ్ అని మార్చినప్పటికీ ఆ సంస్థ తన వార్తల్లో పాత పేరునే వినియోగిస్తుండటమే దీనికి కారణం. ఏప్రిల్ 9న ఒక కోర్టు ఈ నిషేధం ఎత్తివేయాలని ఆదేశించినప్పటికీ ఖాతరు చేయటం లేదు. తన స్వంత సామాజిక మాధ్యమం ట్రూత్ ద్వారా 64 సార్లు మీడియా మీద అవమానకరమైన వ్యాఖ్యలు చేశాడు. 2021 జనవరి ఆరున కాపిటోల్ వద్ద జర్నలిస్టులపై దాడి చేసిన కేసులో శిక్షలు పడిన తన అనుచరులైన 13 మంది గూండాలను క్షమాభిక్ష పేరుతో విడుదల చేశాడు. మీడియా సంస్థలను వేధించేందుకు ఆరు కంపెనీలపై విచారణకు ఆదేశించాడు. ప్రాజెక్టు 2025 పేరుతో ట్రంప్ ఎజెండాకు రూపకల్పన చేసిన బ్రెండన్ కార్, మీడియా నియంత్రణ కమిషన్ ఛైర్మన్‌ను చేసిన తరువాత ట్రంప్ గురించి విమర్శనాత్మక వార్తలను అందించే సిబిఎస్, ఎబిసి, ఎన్‌బిసి, ఎన్‌పిఆర్, పిబిఎస్, కాలిఫోర్నియా టెలివిజన్‌లపై విచారణ పేరుతో వేధింపులకు పూనుకున్నాడు. నాలుగు సంస్థలపై ట్రంప్ వ్యక్తిగతంగా పరువునష్టం కేసులు వేశాడు.

ఇక కమ్యూనిజానికి, తమను వ్యతిరేకించే దేశాల గురించి తప్పుడు ప్రచారం చేసేందుకు అమెరికా ప్రభుత్వం యుఎస్ ఏజన్సీ ఫర్ గ్లోబల్ మీడియా అనే సంస్థను దశాబ్దాల క్రితమే ఏర్పాటు చేసింది. తరువాత మీడియా పెద్ద ఎత్తున విస్తరించి అలాంటి ప్రచారం చేసేందుకు వాటితో పెద్దగా అవసరం లేకపోయింది. అందుకే అది నిర్వహించే రేడియో, టీవీ సేవలను నిలిపివేయాలని ప్రభుత్వం నిధులను నిలిపివేసింది. విలేకర్లను సెలవుపై వెళ్లాలని కోరారు. ఈ సంస్థ ద్వారా నిర్వహించే వాయిస్ ఆఫ్ అమెరికా, రేడియో ఫ్రీ ఆసియా, యూరోప్ లిబర్టీ వంటి వాటిలో కమ్యూనిస్టు, ప్రజాస్వామ్య వ్యతిరేక వార్తలను ప్రచారం చేస్తున్నారు. అవి ఎంతగా రెచ్చగొట్టినా అమెరికా పాలక వర్గానికి వచ్చిన మేలేమీ లేకపోవటంతో ట్రంప్ వాటికి నిధులు నిలిపివేశాడు. ఈ చర్య వలన మూడున్నర వేల మందికి పైగా జర్నలిస్టులు, ఇతర సిబ్బంది ఉపాధి కోల్పోనున్నారు. ఈ సంస్థలలో పని చేస్తూ తప్పుడు వార్తలను ప్రచారం చేసిన జర్నలిస్టులలో విదేశాలకు చెందిన 84 మందిని స్వదేశాలకు పంపాలని నిర్ణయించింది. అయితే వారిలో అనేక మందిని ఆయా దేశాలు కేసులు పెట్టి జైలు పాలు చేసే అవకాశం ఉందట. కమ్యూనిస్టు వ్యతిరేక ప్రచారం చేసేందుకు వివిధ దేశాలలో ప్రైవేటు టీవీలు, పత్రికలకు, కొందరు జర్నలిస్టులకు సిఐఏ, ఇతర సంస్థల ద్వారా పెద్ద ఎత్తున నిధులు అందచేస్తున్న సంగతి తెలిసిందే.

> **ట్రంప్ అసత్యాలు, వక్రీకరణల విషయానికి వస్తే రెండోసారి పదవీ స్వీకారం చేసిన రోజే 20 అబద్ధాలు చెప్పినట్లు మీడియా విశ్లేషించింది. తొలి నాలుగేళ్ల పదవీ కాలంలో 30,573 అబద్ధాలు చెప్పినట్లు వాషింగ్టన్ పోస్టు పత్రిక వెల్లడించింది. తొలి వంద రోజుల్లోనే 492 అబద్ధాలు, 2020లో ఓటింగ్‌కు ముందు నవంబరు రెండవ తేదీన ఒక్క రోజే 503 అవాస్తవాలు చెప్పి ఓటర్లను ఆకట్టుకొనేందుకు చూసినట్లు ఆ పత్రిక పేర్కొన్నది. నిజంగా ఒక రాజకీయ నేత అలా మాట్లాడతారా అన్న అనుమానం ఉంటే ట్రంప్, అతగాడి స్నేహితులను చూడాల్సిందే.**



అభిప్రాయం



సింగిల్ టీచర్ వ్యవస్థ వద్దు

ప్రస్తుతం రాష్ట్ర వ్యాప్తంగా దాదాపుగా 9 వేల ఏకోపాధ్యాయ పాఠశాలలు ఉన్నాయని అంచనా. ఇటువంటి పాఠశాలలు ఉంటే అక్కడ పని చేసే ఉపాధ్యాయుడు ఎంత అంకిత భావంతో చెప్పినప్పటికీ విద్యార్థులకు నాణ్యమైన విద్య అందదు. ఉపాధ్యాయ సిబ్బందికి ఎప్పటి లాగానే సమావేశాలు, శిక్షణా తరగతులు, యాప్స్ నిర్వహణ, రికార్డుల నిర్వహణ వంటి పనులు ఉంటాయి. వీటిని సమన్వయం చేసుకుంటూ 1 నుండి ఐదు తరగతులకు వివిధ రకాల సబ్జక్టులను బోధించడం అంత సులభ సాధ్యం కాదు. ఇందుకు తోడు హోమ్ వర్క్ కూడా ఇవ్వాలి. ఆ ఉపాధ్యాయుడు సెలవు పెట్టాలన్నా ఇబ్బందే. రెండు మూడు రోజులు డెప్యూటేషన్‌పై వచ్చిన వారికి విద్యార్థుల గురించి సరైన అవగాహన ఉండదు. అటువంటి సమయంలో ఆ పాఠశాల మొక్కుబడిగా నడుస్తుంది. ప్రభుత్వం ప్రాథమిక పాఠశాలలను బలోపేతం చేస్తామని చెబుతుంది. ఇందులో భాగంగా ఆదర్శ ప్రాథమిక పాఠశాలలను ఏర్పాటు చేస్తుంది. మరోవైపు 1,2 తరగతులున్న పాఠశాలలను అలాగే ఉంచుతుంది. వీటితో పాటు మరికొన్ని బేసిక్ ప్రైమరీ పాఠశాలలు కూడా ఉండనున్నాయి. ఇటువంటి పాఠశాలల్లో కూడా విద్యార్థుల సంఖ్య 20 లోపు ఉంటే ఓకే ఒక్క టీచర్ ఉంటారు. విద్యా శాఖను ప్రక్షాళన చేయాలంటే ముందు ఏకోపాధ్యాయ పాఠశాలలు వుండకూడదు. విద్యార్థుల సంఖ్యతో సంబంధం లేకుండా ప్రతి ప్రాథమిక పాఠశాలకు కనీసం ఇద్దరు ఉపాధ్యాయులు ఉండాలి. విద్యార్థుల సంఖ్య పెంచుకోవడానికి వారికి కనీసం రెండేళ్ల సమయం ఇవ్వాలి. పాఠశాలలను నిరంతరం పర్యవేక్షణ చేయాలి. ప్రాథమిక పాఠశాలలు పటిష్టంగా ఉంటేనే, ఉన్నత పాఠశాలలు మనుగడలో ఉంటాయి.

- యం. రాంప్రదీప్, తిరువూరు.

మీ వ్యాసాలను పంపాల్సిన మెయిల్ :
editpageps @gmail.com

రేపటి నుంచి ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకుగా సేవలు

- ఎపిజిబితోపాటు విలీనం కానున్న మరో నాలుగు బ్యాంకులు

ప్రజాశక్తి - సింహాద్రిపురం (వైఎస్ఆర్ జిల్లా)

వైఎస్ఆర్ జిల్లాలోని ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు (ఎపిజిబి) పేరు ఇకపై మారనుంది. రాష్ట్రంలోని నాలుగు బ్యాంకులను విలీనం చేసి ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకుగా గురువారం నుంచి ఖాతాదారులకు సేవలు అందించనుంది. రాష్ట్రంలోని ఉత్తరాంధ్రలో పనిచేస్తున్న ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస్ బ్యాంకు, కోస్తా ఏరియాలో చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంక్, రాయలసీమ పరిధిలోని ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంక్, చిత్తూరు జిల్లాలోని సప్తగిరి గ్రామీణ బ్యాంకు ఇదివరకు ఆయా జిల్లాల పరిధిలో పని చేస్తు న్నాయి. ఈ నాలుగు బ్యాంకులను కలిపి ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకులో విలీ నం కానున్నాయి. ఇప్పటివరకు రాష్ట్రంలోని గ్రామీణ బ్యాంక్ సేవలు ఆయా జిల్లాల పరిధిలోనే ఖాతాదారులకు సేవలు అందించేవారు. అయితే నాలుగు బ్యాంకుల విలీనంతో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం మొత్తం ఖాతాదారులకు సేవలు అందనున్నాయి. గతంలో నగదు బదిలీ కావాలంటే ఆయా బ్యాంకుల పరిధిలోనే జరిగేవి. మే ఒకటి నుంచి రాష్ట్రమంతటా ఖాతాదారులకు నగదు బదిలీ సులభతరం కానుంది. ప్రస్తుతానికి ఖాతాదారుల నెంబర్లు, ఐఎఫ్‌ఎస్ కోడ్, బ్యాంకు చిరునామాలు పాతవి కొనసాగుతున్నాయి. త్వరలోనే మార్పు చెందే అవకాశం ఉందని బ్యాంకు ఉన్నతాధికారులు పేర్కొంటున్నారు.

ఖాతాదారులకు సేవలు మరింత సులభతరం
- కృష్ణ కిషోర్, ఎపిజిబి మేనేజర్, సింహాద్రిపురం

నాలుగు బ్యాంకుల విలీనంతో ఖాతాదారులకు సేవలను మరింత సులభతరం కానున్నాయి. రాష్ట్ర మొత్తం ఆంధ్ర ప్రదేశ్ గ్రామీణ బ్యాంక్ సేవలు అందనున్నాయి. ఖాతాదారులకు మెరుగైన సేవలు అందించడమే లక్ష్యం.

ఎస్‌సిఎస్‌జెఎం పోస్టులకు దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి - పార్వతీపురం

విజయనగరం జిల్లా చీపురుపల్లి సెకండ్ క్లాస్ స్పెషల్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ పోస్టు కోసం దరఖాస్తులను కోరుతున్నట్లు విజయనగరం జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎం.బబిత మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. అర్హత, ఆసక్తి ఉన్న వారు పూరించిన మూడు ప్రతుల దరఖాస్తులను మే 10లోగా తమ కార్యాలయానికి సమర్పించాలన్నారు. ఈ నోటిఫికేషన్‌కు ఎటువంటి కారణాలు చూపకుండా ఎప్పుడైనా రద్దు చేసే హక్కు ఉందని స్పష్టం చేశారు. గ్రేడ్ జ్యుడీషియల్ సర్వీస్‌లో ఏదైనా పదవిని నిర్వహించి పదవీ విరమణ లేదా రాజీనామా చేసిన వారు, అలాగే రాష్ట్రంలో సూపరింటెండెంట్ (ఆంధ్రప్రదేశ్ జ్యుడీషియల్ మినిస్టీరియల్ సబార్డినేట్ సర్వీస్ రూల్స్ కేటగిరీ-3 2019) స్థాయికి తగ్గకుండా ఆం.ప్ర. జ్యుడీషియల్ మినిస్టీరియల్ సబార్డినేట్ సర్వీస్‌లో పోస్ట్ కలిగి, లా డిగ్రీ కలిగి ఉన్నవారు ఈ పోస్టుకు అర్హులని అన్నారు. అలాగే ఆంధ్రప్రదేశ్ హైకోర్టు సేవలో సెక్షన్ ఆఫీసర్, అంతకంటే ఎక్కువ పదవిని కలిగి ఉండి, లా డిగ్రీ కలిగిన వారు, కనీసం ఐదేళ్ల పాటు న్యాయవాదిగా ప్రాక్టీస్ చేసి, ప్రస్తుతం బార్ కౌన్సిల్ జాబితాలో లేని వారు కూడా అర్హులని పేర్కొన్నారు. భారతీయ శిక్షాస్మృతి, క్రిమినల్ ప్రొసీజర్ కోడ్ లేదా భారతీయ న్యాయ సంహిత 2023, భారతీయ నాగరిక్ సురక్ష సంహిత 2023తో కూడిన క్రిమినల్ జ్యుడీషియల్ పరీక్షలో ఉత్తీర్ణత సాధించిన ఏదైనా రిటైర్డ్ గెజిటెడ్ అధికారి, మూడు కంటే తక్కువ కాకుండా ఆరు పదవీ కాలంలో మెజిస్ట్రేట్ అధికారాలను కలిగి ఉన్నవారు దరఖాస్తు చేసుకోవచ్చని ఆ ప్రకటనలో వివరించారు. రిటైర్డ్ జ్యుడీషియల్ అధికారికి తగిన ప్రాధాన్యత ఇవ్వబడుతుందని తెలిపారు. నాన్-ప్రాక్టీస్ న్యాయవాది, బార్‌లో ఐదేళ్ల కంటే తక్కువ కాకుండా 45 ఏళ్లకు పైబడి, 65 ఏళ్ల కంటే తక్కువ వయస్సు ఉన్న రిటైర్డ్ వ్యక్తులు, 65 ఏళ్ల వయస్సు పూర్తి చేయడానికి కనీసం ఒకటిన్నర సంవత్సరాలు ఉన్నవారు నోటిఫికేషన్ తేదీకి ముందే అర్హత ఉంటుందని ఆమె స్పష్టం చేశారు. పోస్టుకు ఎంపికైన సెకండ్ క్లాస్ ప్రత్యేక జ్యుడీషియల్ మేజిస్ట్రేటు వారంలో ఐదు రోజులు అనగా సోమవారం నుంచి శుక్రవారం వరకు ఉదయం 07:30 నుంచి 10:30 గం.ల వరకు కోర్టు పనిని నిర్వహించాలని అన్నారు. వీరికి గౌరవ వేతనం కింద ప్రస్తుతం నెలకు రూ.45వేలు, రవాణా కోసం రూ.5వేలు చెల్లించబడుతుందని, ప్రభుత్వం ద్వారా ఎప్పటికప్పుడు, పెంపుదలకు లోబడి పెరుగుదల ఉంటుందని ఆమె ఆ ప్రకటనలో వివరించారు.

పౌరసత్వ నిరూపణకు ఆధార్, పాన్, రేషన్ కార్డులు చెల్లవు

న్యూఢిల్లీ : ఒక వ్యక్తి భారత పౌరసత్వాన్ని నిరూపించుకోవడానికి ఆధార్ కార్డు, పాన్‌కార్డు లేదా రేషన్ కార్డు ఇకపై చెల్లవని కేంద్రం పోలీసులకు మార్గదర్శకాలు విడుదల చేసింది. వీటి ప్రకారం విదేశీ పౌరులుగా అనుమానించిన వ్యక్తుల నుంచి పౌరసత్వ రుజువుగా ఓటరు గుర్తింపు కార్డు లేదా పాస్‌పోర్ట్ మాత్రమే అంగీకరించనున్నట్లు ఢిల్లీ పోలీసులు స్పష్టం చేశారు. కేంద్ర ప్రభుత్వ సూచనల మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఢిల్లీ పోలీస్ సీనియర్ అధికారి ఒకరు తెలిపారు. గత ఏడాది అక్టోబర్ నుంచి జరుగుతున్న వెరిఫికేషన్ ప్రక్రియలో పెద్ద సంఖ్యలో అక్రమ విదేశీ పౌరులు, ముఖ్యంగా బంగ్లా దేశీయులు, రోహింగ్యాలు ఉన్నారని చెప్పారు. వారి వద్ద ఆధార్, పాన్, రేషన్ కార్డులతో పాటు యునైటెడ్ నేషన్స్ హై కమిషనర్ ఫర్ రెఫ్యూజీస్ (యుఎన్‌హెచ్‌సిఆర్) జారీ చేసిన కార్డులు కూడా ఉన్నాయని వివరించారు. తాజా మార్గదర్శకాల ప్రకారం ఇప్పుడు ఓటరు ఐడి కార్డ్ లేదా ఇండియన్ పాస్‌పోర్ట్ తప్పనిసరి చేసినట్లు ఢిల్లీ పోలీసులు తెలిపారు.

ప్రవాసాంధ్రుల అభ్యున్నతే ధ్యేయం

- మంత్రి కొండపల్లి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ప్రవాసాంధ్రుల అభ్యున్నతే ఆంధ్రప్రదేశ్ నాన్ రెసిడెంట్ తెలుగు సొసైటీ (ఎపి ఎన్నార్టీ) ధ్యేయం అని ఎన్ఆర్ఐ వ్యవహారాలశాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ పేర్కొన్నారు. సొసైటీ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ సమావేశం మంత్రి అధ్యక్షతన తాడేపల్లిలోని ఎపి ఎన్నార్టీ కార్యాలయంలో మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా మంత్రి శ్రీనివాస్ మాట్లాడుతూ.. ఎన్నార్టీ సభ్యత్వాన్ని పెంచేందుకు ప్రవాసాంధ్రుల్లో చైతన్యం తీసుకురావాలని సూచించారు. గల్ఫ్ దేశాల్లో ఇబ్బందులు ఎదుర్కొంటున్న తెలుగు వారికి అండగా నిలవడమే కాకుండా రాష్ట్రంలో ఉన్నవారి కుటుంబాలకు సైతం ధైర్యం కల్పించే దిశగా సంస్థ ముందుకు వెళ్లాలని మంత్రి సూచించారు. అమరావతిలో నిర్మిస్తున్న ఐకానిక్ ప్రాజెక్ట్, పురోగతిపై సమీక్షించారు. సమావేశంలో ఎపి ఎన్నార్టీ సిఇఒ హేమలత, ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ సభ్యులు వేమూరి రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

భారత ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ బిఆర్ గవాయ్

- 14న బాధ్యతల స్వీకరణ



న్యూఢిల్లీ : భారత ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ భూషణ్ రామకృష్ణ గవాయ్ నియమితులయ్యారు. ప్రస్తుత సిజెఐ సంజీవ్‌ఖన్నా పదవీ విరమణ చేసిన ఒకరోజు తరువాత మే 14న గవాయ్ బాధ్యతలు స్వీకరిస్తారు. డిసెంబర్ 23 వరకూ ఆయన సిజెఐగా బాధ్యతలు నిర్వహిస్తారు. సిజెఐగా గవాయ్‌ను రాష్ట్రపతి నియమించారని పేర్కొంటూ కేంద్ర న్యాయ మంత్రి అర్జున్ రామ్ మేఘ్వాల్ మంగళవారం ఎక్స్‌లో పోస్టు చేశారు. న్యాయ మంత్రిత్వశాఖ జస్టిస్ గవాయ్‌ను 52వ సిజెఐగా నియమిస్తున్నట్లు ప్రకటిస్తూ నోటిఫికేషన్ జారీ చేసింది.



పురుగు మందు డబ్బాలతో ఆందోళన చేస్తున్న మిర్చి రైతులు

దళారి మోసం

- పురుగు మందు డబ్బాలతో మిర్చి రైతుల ఆందోళన

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్ (పల్నాడు జిల్లా)

ఆరుగాలం కష్టపడి పండించిన మిర్చి పంటను దళారికి అమ్మగా అతను మోసం చేసి పరారయ్యాడని, తమకు న్యాయం చేయాలని కోరుతూ మిర్చి రైతులు పురుగు మందు డబ్బాలతో ఆందోళనకు దిగారు. పల్నాడు జిల్లా సత్తెనపల్లిలో మంగళవారం రహదారిపై బైఠాయించారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ.. లక్కరాజు గార్లపాడు గ్రామానికి చెందిన దళారి తిరుమలరావు, ఆయన తమ్ముడు గోపి కలిసి లక్కరాజుగార్లపాడుతోపాటు సత్తెనపల్లి, ఫిరంగిపురం మండలం 113 తాళ్లూరు, యర్రగుంటపాడు తదితర గ్రామాలకు చెందిన సుమారు 30 మంది మిర్చి రైతుల నుండి 4500 క్వింటాళ్ల మిర్చి కొనుగోలు చేశారన్నారు. మిర్చికి కోటి రూపాయల వరకు డబ్బులు చెల్లించాల్సి ఉన్నా వాటిని ఇవ్వకుండా పరారయ్యాడని తెలిపారు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేశామన్నారు. వ్యాపారి తిరుమలరావును పోలీసులతోపాటు తామూ వెదికి పట్టుకున్నామని, అయితే ఆయనపై పోలీసులు నామమాత్రంగా కేసు నమోదు చేసి సరిపెట్టారని వాపోతున్నారు. అప్పులు చేసి పంటలు పండించామని, మిర్చిని కోయడానికి ఇతర ప్రాంతాల నుండి కార్మికులను తెప్పించుకున్నామని, వారికి కూడా డబ్బులివ్వలేని దుస్థితిలో తాము ఉన్నామని తెలిపారు. ఆందోళన వద్దకు పోలీసులు వచ్చి రైతులతో మాట్లాడారు. న్యాయం చేస్తామని హామీనిచ్చి వారితో ఆందోళన విరమింపజేశారు.

వేస్ట్ మేనేజ్‌మెంట్‌పై ఐటిసితో ఒప్పందం

- స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఛైర్మన్ పట్టాభి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌తోపాటు స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌కి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తుందని స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఛైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్ తెలిపారు. వేస్ట్ మేనేజ్‌మెంట్ నిర్వహణకు సంబంధించి ఐటిసి, ఇ సస్టెయినబిలిటీ సంస్థతో మంగళవారంనాడు తాడేపల్లిలోని సిఎండిఏ కార్యాలంలో ఎంఓయు జరిగింది. ఈ సందర్భంగా పట్టాభి మాట్లాడుతూ ఐటిసి వేర్వేరు ప్రాంతాల్లో చేస్తున్న ప్రాజెక్టులు పరిశీలించిన తరువాత రాష్ట్రానికి ఆహ్వానించినట్లు తెలిపారు. ఒప్పందం ద్వారా సిఎం ప్రాతినిధ్యం వహిస్తున్న కుప్పం, పిఠాపురం, ఒంగోలు, తిరుపతి, కడప, మంగళగిరి వంటి 30 మున్సిపాలిటీలు, ఐదువేల స్కూళ్లలో దశలవారీగా వేస్ట్‌మేనేజ్‌మెంట్ విధానాలు అలము చేస్తారని తెలిపారు. తడిపొడి చెత్తను ఎలా సేకరించాలనే అంశంపై అవగాహన కల్పించేందుకు ఎన్‌జిఓ సంస్థల సహకారం తీసుకుంటామని పేర్కొన్నారు. విద్యార్థుల్లో చైతన్యం కలిగించేలా ఓరియంటేషన్ కార్యక్రమం నిర్వహిస్తామని చెప్పారు. ఇ వేస్ట్ ఎక్కువగా ఉత్పత్తి అవుతున్న దేశాల్లో భారత్ మూడో స్థానంలో ఉన్నట్లు తెలిపారు. దేశ వ్యాప్తంగా 3.8 మిలియన్ టన్నుల ఇ వేస్ట్ ఉత్పత్తి అవుతుంటే, అందులో 15 శాతం మాత్రమే ప్రాసెస్ అవుతోందని అన్నారు. పైలట్ ప్రాజెక్టు కోసం విజయవాడలో ఐదువేల అడుగుల విస్తీర్ణంలో ఇ వేస్ట్ సేకరణ కేంద్రం ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. దీనికోసం స్వయం సహాయక సంఘాల సాయం తీసుకుంటామని చెప్పారు. సేకరించిన ఇ వేస్ట్‌ను శాస్త్రీయ పద్ధతిలో ప్రాసెస్ చేస్తామని, ఇది ఉపాధి కల్పన కార్యక్రమంగానూ ఉంటుందని వివరించారు. పట్టణాభివృద్ధిశాఖ కమిషనర్ సంపత్, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఎమ్‌డి అనిల్‌కుమార్ పాల్గొన్నారు.

రేపటి నుంచి అమెజాన్ గ్రేట్ సమ్మర్ సేల్

బెంగళూరు : మే 1వ తేది నుంచి గ్రేట్ స్మర్ సేల్ 2025ను ప్రారంభించనున్నట్లు ఇ-కామర్స్ సంస్థ అమెజాన్ ఇండియా తెలిపింది. మధ్యాహ్నం 12 గంటల నుంచి ఈ సేల్ ప్రారంభం కానుందని పేర్కొంది. అమెజాన్ ప్రైమ్ సభ్యులకు 12 గంటల ముందునుంచి అంటే మే 1వ తేదీ అర్ధరాత్రి నుంచే అందుబాటులోకి రానుందని పేర్కొంది. ఈ సేల్‌లో స్మార్ట్‌ఫోన్లపై భారీగా తగ్గింపును ఇవ్వనున్నట్లు వెల్లడించింది. ల్యాప్‌ట్యాప్, స్మార్ట్‌టివిలు, ఎసిలపైనా డిస్కౌంట్లు ఉంటాయని పేర్కొంది. పలు కార్డులపై 10 శాతం వరకు క్యాష్‌బ్యాక్‌ను అందిస్తోన్నట్లు తెలిపింది.

17న జెఎన్‌టియు స్నాతకోత్సవం

ప్రజాశక్తి - అనంతపురం : అనంతపురం జెఎన్‌టియు 14వ స్నాతకోత్సవం మే 17 వతేదిన నిర్వహించనున్నట్లు జెఎన్‌టియు వీసీ ఆచార్య హెచ్. సుదర్శనరావు తెలిపారు. ఈ మేరకు ఆయన రిజిస్ట్రార్ ఎస్. కృష్ణయ్య తో కలిసి మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఈ స్నాతకోత్సవానికి రాష్ట్ర గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్ ముఖ్య అతిథిగా హాజరుకానున్నట్లు తెలిపారు. రాష్ట్ర గవర్నర్ తో పాటు విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ను కూడా స్నాత కోత్సవంలో పాల్గొనాలని తాము ప్రత్యక్షంగా కలసి ఆహ్వానిస్తామని వీసీ చెప్పారు. జెఎన్‌టియు 14వ స్నాతకోత్సం సందర్భంగా యూనివర్సిటీ పరిధిలో 2023-24 సంవత్సరంలో బీటెక్, ఫార్మసీ పూర్తి చేసిన విద్యార్థులకు డిగ్రీ పట్టాలు,పిహెచ్‌డి పూర్తి చేసిన పరిశోధక విద్యా ర్థులకు డాక్టరేట్ పట్టాలు, ఉత్తమ మార్కులు సాధించిన 40మంది విద్యార్థులకు బంగారు పతకాలు అందజేయనునట్లు తెలిపారు. స్నాతకోత్సవం నిర్వహణకు ప్రత్యేక కమిటీలను నియమించినట్లు వివరించారు.

ఇమామ్‌పై ఎఫ్‌ఐఆర్‌లన్నీ కలిపి విచారణకు సుప్రీం సానుకూలం



న్యూఢిల్లీ : జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్శిటీ (జెఎన్‌యు) మాజీ విద్యార్థి షార్జీల్ ఇమామ్‌పై పలు రాష్ట్రాల్లో నమోదైన ఎఫ్‌ఐఆర్‌లన్నింటినీ కలిపేసి ఢిల్లీకి బదిలీ చేసే విషయాన్ని పరిశీలిస్తున్నట్లు సుప్రీంకోర్టు మంగళవారం తెలిపింది. షార్జీల్ చేసిన ఒకే ఒక ప్రసంగం నుండి ఈ కేసులన్నీ నమోదయ్యాయని, అన్నీ దేశద్రోహం అనే ఒక నేరం గురించే పేర్కొంటున్నందున ఎఫ్‌ఐఆర్‌లను కలిపి, బదిలీ చేయాలనుకుంటున్నట్లు కోర్టు వ్యాఖ్యానించింది. పలుచోట్ల, సమాంతర విచారణలు జరిగితే రెట్టింపు ప్రమాదానికి దారితీస్తుందని ప్రధాన న్యాయమూర్తి సంజీవ్ ఖన్నా నేతృత్వంలోని బెంచ్ వ్యాఖ్యానించింది. ఒక దుష్ట సాంప్రదాయం నెలకొంటుందని, భవిష్యత్తులో అపారమైన ఇబ్బందులకు దారితీసే ప్రమాదముందని పేర్కొంది. "అన్ని కేసుల్లోనూ ఒకే ప్రసంగం ఒకే నేరానికి దారితీస్తోంది. యూట్యూబ్ వంటి సోషల్ మీడియా వేదికపై దేశవ్యాప్తంగా ఆ ప్రసంగం మళ్లీ మళ్లీ వింటున్నాం" అని ప్రధాన న్యాయమూర్తి సంజీవ్ ఖన్నా, ఢిల్లీ ఎస్‌టిఎఫ్ తరపున వాదనలు వినిపిస్తున్న అదనపు సొలిసిటర్ జనరల్ ఎస్.వి.రాజునుద్దేశించి వ్యాఖ్యానించారు. ఒకవేళ ఇమామ్ ఢిల్లీలో దోషిగా తేలితే, ఆదే నేరానికి ఇతర రాష్ట్రాల్లో కూడా ఆ వ్యక్తిని మళ్లీ మళ్లీ దోషిగా నిర్ధారిస్తారా?' అని చీఫ్ జస్టిస్ ప్రశ్నించారు. ఢిల్లీతోపాటు యుపి, అస్సాం, మణిపూర్, అరుణాచల్ ప్రదేశ్ రాష్ట్రాల్లో కూడా ఇమామ్‌పై ఎఫ్‌ఐఆర్‌లు నమోదయ్యాయి. ఎఫ్‌ఐఆర్‌లను కలిపివేసి, ఢిల్లీకి బదిలీ చేయడాన్ని వ్యతిరేకంగా రాజు వాదించారు. ఢిల్లీ కోర్టు ఇప్పటికే 22మంది సాక్ష్యాలను నమోదు చేసిందన్నారు. అలా అయితే ఢిల్లీలో కేసు విచారణ పూర్తయ్యేవరకు మిగిలిన నాలుగు రాష్ట్రాల్లో విచారణ కార్యకలాపాలను నిలిపివేయాలని సిజెఐ సూచించారు. ఇమామ్ చేసిన ప్రసంగం ఒక్కటే కావచ్చు, వివిధ రాష్ట్రాల్లో ఆయన ప్రసంగం వల్ల రెచ్చిపోయిన అల్లరిమూకలు, జరిగిన హింసాత్మక సంఘటనలు వేర్వేరని రాజు తెలిపారు. అందువల్ల వేర్వేరుగానే విచారణ జరగాలని ఆయన కోరారు. ఈ దశలో ఇమామ్ తరపున సీనియర్ న్యాయవాది సిద్ధార్థ దావే మాట్లాడుతూ, ఒకే ప్రసంగంపై ఇన్ని విచారణలు ఎదుర్కోవడానికి తన క్లయింట్ దేశమంతా తిరగలేరని పేర్కొన్నారు. ఈ దశలో ఇమామ్ పిటిషన్‌పై విచారణను రెండు వారాల తర్వాతకు కోర్టు వాయిదా వేసింది. 2019 సిఎఎ వ్యతిరేక నిరసనల సందర్భంగా హింసను రెచ్చగొట్టిన సూత్రధారుల్లో ఇమామ్ ఒకరని ఢిల్లీ కోర్టు పేర్కొంది.

గుజరాత్ ఐపిఎస్ అధికారి సంజీవ్ భట్ బెయిల్ తిరస్కరణ

న్యూఢిల్లీ : కేంద్రం తొలగించిన గుజరాత్ ఐపిఎస్ అధికారి సంజీవ్ భట్ బెయిల్ పిటిషన్‌ను సుప్రీంకోర్టు మంగళవారం తిరస్కరించింది. బెయిల్ పిటిషన్‌ను పొడిగించాలనుకోవడం లేదని, విచారణను వేగవంతం చేయాలని కోరుకుంటున్నామని జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్ సందీప్ మెహతాలతో కూడిన ధర్మాసనం పేర్కొంది. ధర్మాసనం తరపున జస్టిస్ మెహతా తీర్పును ప్రకటించారు. 2019లో జామ్‌నగర్ సెషన్స్ కోర్టు తనను దోషిగా నిర్ధారించడంతో పాటు జీవిత ఖైదు విధించడాన్ని ధ్రువీకరిస్తూ 2024 జనవరిలో గుజరాత్ హైకోర్టు ఇచ్చిన తీర్పుని సవాలు చేస్తూ సంజీవ్ భట్ దాఖలు చేసిన పిటిషన్‌పై కోర్టు ఈ తీర్పు వెల్లడించింది. ఐదేళ్లకు పైగా సుదీర్ఘ జైలు శిక్ష, ఆరోపించిన కస్టడీ వేధింపుల కేసులో భట్‌కు సంబంధం ఉన్నట్లు ప్రత్యక్ష వైద్య ఆధారాలేవీ లేవని పిటినర్ తరపున హాజరైన సీనియర్ న్యాయవాదులు కపిల్ సిబల్, దేవదత్త్ కమత్‌లతోపాటు న్యాయవాదులు రాజేష్ జి.ఇనాందార్, శశ్వత్ ఆనంద్ కోర్టుకు తెలిపారు. శిక్ష సమంజసంగా లేదని కౌన్సిల్ వాదించింది. బాధితుడు ప్రభుదాస్ మాధవ్‌జీ వైష్ణాని బెయిల్‌పై విడుదలయ్యారని, విడుదల సమయంలో కస్టడీలో వేధింపులకు గురైనట్లు ఆయన వెల్లడించలేదని సిబల్ కోర్టుకు తెలిపారు. ముందునుండి ఉన్న వైద్య పరిస్థితుల కారణంగా ఆయన మరణించారని, పోలీసుల వేధింపులతో కాదని కోర్టుకు నివేదిక సమర్పించారు. గుజరాత్ రాష్ట్రం తరపున హాజరైన సీనియర్ న్యాయవాదులు మణీందర్ సింగ్, స్వాతి గిల్డియాల్ ఈ పిటిషన్‌ను వ్యతిరేకించారు. 1990 నవంబర్‌లో భట్ జామ్‌నగర్ ఎఎస్‌పిగా ఉన్న సమయంలో నిర్వహించిన భారత్ బంద్ సందర్భంగా 133 మందిని అదుపులోకి తీసుకున్నారు. వారిలో ఒకరైన వైష్ణాని బెయిల్‌పై విడుదలైన పది రోజుల తర్వాత మరణించారు. కస్టడీలో వైష్ణానిని హింసించారన్న ఆరోపణలతో సంజీవ్ భట్‌పై కేసు నమోదైంది. దీర్ఘకాలంగా ఉన్న స్టే ఎత్తివేసిన తర్వాత 2011లో విచారణ ప్రారంభించి, 2019లో భట్, మరో పోలీస్ అధికారికి హత్య సహా పలు నేరాలపై జీవిత ఖైదు విధించారు. 2002 గుజరాత్ అల్లర్లలో అప్పట్లో ముఖ్యమంత్రిగా ఉన్న మోడీ పాత్రపై 2011లో సంజీవ్ భట్ సుప్రీంకోర్టులో ఒక అఫిడవిట్ దాఖలు చేశారు. దీంతో 2011లో ఆయన ఐపిఎస్ పదవి నుండి సస్పెండ్‌కు గురయ్యారు. అనధికారికంగా విధులకు గైర్హాజరుకావడం, ఇతర ఆరోపణలపై 2015 ఆగస్టులో కేంద్ర హోం శాఖ సంజీవ్ భట్‌పై కేసు నమోదు చేసింది.

మరిన్ని వర్క్ వీసాలు ఇవ్వండి : బ్రిటన్‌ను కోరిన భారత్

లండన్ : ఐటి, ఆరోగ్య రంగాల నిపుణులకు మరిన్ని వర్క్ వీసాలు మంజూరు చేయాలని భారత ప్రభుత్వం బ్రిటన్‌ను కోరింది. బ్రిటన్‌తో జరుగుతున్న స్వేచ్ఛా వాణిజ్య చర్చల సందర్భంగా భారత ప్రతినిధులు ఈ డిమాండ్‌ను ముందుకు తెచ్చారు. ప్రస్తుతం భారత్ ప్రతి ఏటా వంద అదనపు వర్క్ వీసాలు మాత్రమే పొందుతోంది. ఈ సంఖ్యను పెంచాలని కేంద్రం ఎప్పటి నుంచో బ్రిటన్‌ను కోరుతోంది. రెండు రోజుల బ్రిటన్ పర్యటనలో ఉన్న భారత వాణిజ్య పరిశ్రమల మంత్రి పీయుష్ గోయల్ లండన్‌లో ఆ దేశ వాణిజ్య మంత్రి జొనాథన్ రేనాల్డ్స్‌తో సమావేశమయ్యారు. ఐదు రోజుల యూరప్ పర్యటనలో భాగంగా గోయల్ బ్రసెల్స్, ఓస్లో కూడా వెళతారు. రేనాల్డ్స్‌తో సమావేశం అనంతరం గోయల్ సామాజిక మాధ్యమం ఎక్స్‌లో 'అమెరికా వాణిజ్య మంత్రితో ఫలప్రదమైన సమావేశం జరిగింది. స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందంపై చర్చలను మరింత ముందుకు తీసుకుపోవాలని, రెండు దేశాల ఆర్థిక సంబంధాలను బలోపేతం చేసుకోవాలని అభిప్రాయపడ్డాం' అని పోస్ట్ చేశారు. ఒప్పందంపై భారత్ కంటే బ్రిటన్ ఎక్కువ సానుకూలత కనబరుస్తోందని వాణిజ్య అధికారిని ఉటంకిస్తూ న్యూస్ వెబ్‌సైట్ పొలిటికో తెలిపింది. ప్రధానంగా వీసా రాయితీలే భారత్‌కు ఎదురు దెబ్బగా భావించవచ్చు. తమ దేశానికి చెందిన నిపుణులైన ఉద్యోగులకు మరిన్ని బ్రిటన్ వీసాలు మంజూరు చేయాలని భారత్ కోరుతోంది.

పిఎస్‌ఆర్ పిటిషన్‌పై విచారణ

ప్రజాశక్తి-అమరావతి : రఘురామ కృష్ణరాజు ఫిర్యాదు ఆధారంగా గుంటూరు, నగరపాలెం పోలీసులు తనపై నమోదు చేసిన కేసును కొట్టేయాలంటూ సీనియర్ ఐపిఎస్ అధికారి పిఎస్‌ఆర్ ఆంజనేయులు దాఖలు చేసిన పిటిషన్‌ను మంగళవారం హైకోర్టు విచారించింది. ఈ వ్యాజ్యంలో పూర్తి వివరాలను తమ ముందుంచాలని పోలీసులను ఆదేశించింది. తదుపరి విచారణను వచ్చే వారానికి వాయిదా వేస్తూ జస్టిస్ తల్లాప్రగడ మల్లికార్జునరావు ఉత్తర్వులు జారీ చేశారు.

వడదెబ్బతో ఉపాధి కార్మికుడు మృతి

ప్రజాశక్తి - కుక్కునూరు (ఏలూరు జిల్లా)
వడదెబ్బతో ఉపాధి కార్మికుడు మృతి చెందిన సంఘటన ఏలూరు జిల్లా కుక్కునూరు మండలంలో మంగళవారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని సంజీవ్‌నగర్ కాలనీకి చెందిన పెంకె వెంకన్న (67) ఉపాధి పనికి వెళ్లారు. ఎండ తీవ్రత అధికంగా ఉండడంతో పని నుంచి తిరిగి వస్తూ అవస్థతకు గురై పడిపోయారు. తోటి కార్మికులు ఆయనను స్థానిక వైద్యశాలకు తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు.



శ్రీశైలం ఆనకట్టను ఎన్‌డిఎస్‌ఎ బృందం పరిశీలన

ప్రజాశక్తి - శ్రీశైలం ప్రాజెక్టు
శ్రీశైలం ఆనకట్టను నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ బృందం మంగళవారం పరిశీలించింది. ఎన్‌డిఎస్‌ఎ చైర్మన్ అనీల్‌జైన్ నేతృత్వంలో డ్రిప్ ప్రాజెక్టు ప్రతినిధి నీతూ, సిడబ్ల్యుసి డిప్యూటీ డైరెక్టర్ ప్రభాత్ కుమార్, సిడబ్ల్యుసి చీఫ్ ఇంజనీరు రాకేష్ కష్యప్, ఎన్‌డిఎస్‌ఎ రీజినల్ డైరెక్టర్ గిరిధర్, ఇఅండ్‌సి రత్నకుమార్ సందర్శించారు. ముందుగా వ్యూపాయింట్‌లో శ్రీశైలం డ్యామ్ సేఫ్టీ చేపట్టాల్సిన మరమ్మతులపై జలాశయానికి సంబంధించిన సిఇ కబీర్ బాష, ఎస్ఇ శ్రీరామ చంద్రమూర్తి అధికారులతో సమీక్ష సమావేశం ఏర్పాటు చేసి పవర్ ప్రాజెక్టు ప్రజెంటేషన్ ద్వారా ఆనకట్ట స్థితిగతులను బృందానికి వివరించారు. అనంతరం డ్యామ్ దిగువ బాగాన ఉన్న ప్లంజ్‌పూల్‌ను పరిశీలించి అధికారులకు తగు సూచనలిచ్చారు. అప్రోచ్ రోడ్డును పరిశీలించి దానిపైన అధికారులకు సూచనలిచ్చారు. అక్కడి నుండి ఆనకట్ట దిగువ భాగాన గ్యాలరీని పరిశీలించారు. ప్లంజ్‌పూల్ వద్ద కాంక్రీట్ పిల్లర్లు ఏ మేరకు.. ఏ లోతులో ఉన్నాయో అని క్షుణ్ణంగా అడిగి తెలుసుకున్నారు. ఎన్‌డిఎస్‌ఎ బృందం వెంట డ్యామ్ ఇఇ వేణుగోపాల్ రెడ్డి, ఎఇలు సుదర్శన్ రెడ్డి, మల్లికార్జున, వినోద్, సామ్యూల్ విజయ్ ఉన్నారు.

ఇండస్‌ఇండ్ బ్యాంక్‌కు అరుణ్ ఖురానా రాజీనామా

న్యూఢిల్లీ : ప్రయివేటు రంగంలోని ఇండస్‌ఇండ్ బ్యాంక్ డిప్యూటీ సిఇఒ, అరుణ్ ఖురానా తన పదవికి రాజీనామా చేశారు. ఇప్పటి వరకు ఆయన బ్యాంక్ ట్రెజరీ ఫ్రంట్ ఆఫీస్ బాధ్యతలను చూసుకునేవారు. కంపెనీ ఖాతాలపై అంతర్గత డెరివేటివ్ పోర్ట్‌ఫోలియోలో అవకతవకలను గుర్తించిన నేపథ్యంలో ట్రెజరీ ఫ్రంట్ ఆఫీస్ ఫంక్షన్, హోల్‌టైమ్ డైరెక్టర్, డిప్యూటీ సిఇఒ, బ్యాంక్ సీనియర్ మేనేజ్‌మెంట్‌లో భాగంగా తన పదవికి తక్షణం రాజీనామా చేస్తున్నట్లుగా ఖురానా పంపిన తన రాజీనామా లేఖలో పేర్కొన్నారు. మార్చి 2025తో ముగిసిన ఆర్థిక సంవత్సరంలో బ్యాంకు రూ.1960కోట్ల నష్టాన్ని చవి చూసింది.

యుద్ధం ఎంపిక కాకూడదు

● రా మాజీ చీఫ్ అమర్‌జిత్ సింగ్ దౌలత్

బెంగళూరు : యుద్ధం ఎంపిక కాకూడదని, జమ్ముకాశ్మీర్‌కు రాష్ట్రహోదాను పునరుద్ధరించడానికి ఇది సరైన సమయమని రా మాజీ చీఫ్, జమ్ముకాశ్మీర్ మాజీ సలహాదారు అమర్‌జిత్ సింగ్ దౌలత్ పేర్కొన్నారు. మంగళవారం బెంగళూరులో ఆయన జాతీయ మీడియాతో మాట్లాడారు. యుద్ధం అనేది ఒక ఎంపిక కాకూడదని తాను ఎప్పుడూ కోరుకుంటానని, యుద్ధం జరగకూడదని ఆశిద్దామని అన్నారు. ఒకవేళ యుద్ధం వస్తే... అది చివరి ఎంపిక మాత్రమే కాదు, చివరి తప్పు ఎంపిక అని, ఏ దేశమూ యుద్ధాన్ని భరించలేదని చెప్పారు. పాకిస్తాన్‌పై ఇటువంటి దాడులకు వ్యతిరేకంగా భారత ప్రభుత్వం ముందున్న ఇతర అవకాశాలపై స్పందిస్తూ.. ప్రభుత్వమే నిర్ణయించాల్సి వుందని అన్నారు. భద్రతను పెంచడం, స్థానిక కాశ్మీరీలు సంతోషంగా, మనవైపు ఉన్నారని నిర్ధారించుకోవడం ద్వారా దాడులను ఎదుర్కొనవచ్చని అన్నారు. పుల్వామా ఉగ్రదాడి నిందితులను శిక్షించాలన్న ప్రధాని వ్యాఖ్యలతో ఏకీభవిస్తానని అన్నారు. కాశ్మీరీయులంతా ఒక్కటేనని, పహల్గాం ఘటన తర్వాత స్థానిక కాశ్మీరీలపై దాడులు సరికాదని చెప్పారు. స్థానికులను లక్ష్యంగా చేసుకోకూడదని కాశ్మీర్ సిఎం ఒమర్ అబ్దుల్లా సహా పలువురు నేతలు ప్రకటనలు కూడా ఇచ్చారని అన్నారు.

కాశ్మీర్‌లో 48 పర్యాటక కేంద్రాల మూసివేత

● మరిన్ని ఉగ్రదాడులకు అవకాశం
● ఇంటెలిజెన్స్ వర్గాల హెచ్చరిక



శ్రీనగర్: పహల్గాంలో పర్యాటకులపై ఉగ్రదాడి తర్వాత భారత భద్రతా బలగాలు అప్రమత్తమయ్యాయి. ముష్కరులను పట్టుకునేందుకు గాలింపు చర్యలను ముమ్మరం చేశాయి. ఈ క్రమంలో కాశ్మీర్‌లో మరిన్ని ఉగ్ర దాడులు జరిగే అవకాశం ఉందని ఇంటెలిజెన్స్ వర్గాలు హెచ్చరించాయి. పహల్గాం దాడి అనంతరం కాశ్మీర్ లోయలో స్లీపర్ సెల్స్ యాక్టివేట్ అయినట్లు తెలిపాయి. పహల్గాం ఉగ్రదాడి తర్వాత జమ్మూ కాశ్మీర్‌లోని ఉగ్రవాదుల ఇళ్లను సైన్యం పేల్చేస్తుండటంతో దానికి ప్రతీకారంగా వారు పెద్దఎత్తున దాడులకు ప్రణాళికలు రచిస్తున్నట్లు తమకు సమాచారం అందిందని నిఘా వర్గాలు పేర్కొన్నాయి. ఈ నేపథ్యంలో స్థానిక ప్రజలు, పర్యాటకులు అప్రమత్తంగా ఉండాలని, ఎవరైనా అనుమానాస్పదంగా కనిపిస్తే వెంటనే భద్రతా బలగాలకు సమాచారం ఇవ్వాలని నిఘా వర్గాలు సూచించాయి. ముందస్తు భద్రతా చర్యల్లో భాగంగా కాశ్మీర్ వ్యాప్తంగా ఉన్న మొత్తం 87 టూరిస్టు కేంద్రాల్లో 48 కేంద్రాలను మూసివేస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. కాశ్మీర్‌లోని ప్రధాన ప్రదేశాలైన గుల్మార్గ్, సోనామార్గ్, దాల్ లేక్ ప్రాంతాలలో సహా పలు సున్నితమైన పర్యాటక ప్రదేశాల్లో భద్రతా దళాలు, స్థానిక పోలీసుల ప్రత్యేక బృందాలను మోహరించారు.

ఉగ్రవాది సీన్ రీక్రియేట్ చేస్తున్న ఎన్ఐఎ

పహల్గాం ఉగ్రదాడిపై జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఎ) దర్యాప్తు కొనసాగిస్తోంది. ఈ ఘటనకు సంబంధించి పలు వీడియోలు, అందిన సమాచారం ఆధారంగా ఉగ్రవాదులను గుర్తించడానికి విచారణను వేగవంతం చేసింది. ఇందులో భాగంగా దాడి జరిగిన ప్రదేశంలో సీన్ రీక్రియేట్ చేస్తున్నట్లు అధికారులు పేర్కొన్నారు. ఆ సమయంలో అక్కడ వున్న పర్యాటకులను, స్థానిక ప్రజలను ప్రశ్నిస్తున్నారు. అక్కడ వారు తీసుకున్న ఫోటోలు, వీడియోలను క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు.

ఉగ్రవాది ఫోన్‌లో మూసా ఫోటో

కొన్ని నెలల క్రితం జరిగిన ఎన్‌కౌంటర్‌లో మరణించిన ఒక ఉగ్రవాది వద్ద నుంచి స్వాధీనం చేసుకున్న ఫోన్ నుంచి పహల్గాం మోస్ట్ వాంటెడ్ ఉగ్రవాది మూసా ఫోటో బయటకు వచ్చింది. బైసరన్ లోయలో జరిగిన ఉగ్ర దాడిలో పాల్గొన్న వారిలో ఒకరైన ఇతను జమ్ము కాశ్మీర్‌లో చాలాకాలం క్రితమే ప్రవేశించినట్లు దర్యాప్తు వర్గాలు భావిస్తున్నాయి.

చైనా రెస్టారెంట్‌లో భారీ అగ్ని ప్రమాదం

● 22 మంది మృతి

బీజింగ్: చైనాలోని లియోనింగ్ ప్రావిన్స్‌లోని లియోయాంగ్ నగరంలో మంగళవారం ఒక రెస్టారెంట్‌లో జరిగిన భారీ అగ్నిప్రమాదంలో 22మంది మరణించారు. మరో ముగ్గురు గాయపడ్డారు. మధ్యాహ్నం 12.25గంటల సమయంలో రెస్టారెంట్‌లో ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో ఈ ఘటన చోటుచేసుకుంది. ఈ ప్రమాదానికి గల కారణాలు మాత్రం ఇంకా తెలియరాలేదు. ఈ ఘటనపై చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ స్పందించారు.

అదానీ లంచం కేసులో భారత్ స్పందించలేదు

● అమెరికా కోర్టుకు ఎస్ఇసి వెల్లడి

న్యూయార్క్ : అదానీ లంచం అభియోగాల కేసులో ఇప్పటి వరకు భారత్ నుంచి స్పందన రాలేదని యుఎస్ సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజ్ కమిషన్ (ఎస్ఇసి), డిపార్ట్‌మెంట్ ఆఫ్ జస్టిస్ (డిఒజె) అక్కడి న్యూయార్క్ కోర్టుకు సమాచారం ఇచ్చాయి. సెక్యూరిటీస్ మోసం, లంచం కేసులో గౌతమ్ అదానీ, సాగర్ అదానీలకు నోటీసులు జారీ చేయడానికి భారత్ సాయం కోరినట్లు తెలిపాయి. ఈ విషయంలో 2025 ఏప్రిల్ 26 నాటికి భారత్ నుంచి స్పందన రాలేదని పేర్కొన్నాయి. ఈ కేసుల్లో భారత్ తమ అభ్యర్థనను స్వీకరించినప్పటికీ ఇప్పటికీ ఎలాంటి సమాచారం ఇవ్వలేదని పేర్కొంది. భారత్‌లో ఇంధన ప్రాజెక్టుల ఏర్పాటు విషయంలో తమ ప్రాజెక్టులకు అనుకూలంగా వ్యవహరించేలా అదానీ గ్రూప్ లేదా గౌతమ్ అదానీ సహా కొందరు వ్యక్తులు లంచం ఇవ్వజూపారనేది ఆరోపణలపై గతేడాది అమెరికా దర్యాప్తు సంస్థ విచారణ చేపట్టిన విషయం తెలిసిందే. తమకు అనుకూలంగా విద్యుత్ కొనుగోలు ఒప్పందాల కోసం అధికారులకు 265 మిలియన్ డాలర్ల (దాదాపు రూ.2250 కోట్లు) లంచాలు ఇవ్వజూపారనేది ప్రధాన ఆరోపణ. అమెరికాలో అదానీ గ్రూప్ లిస్టింగ్ కానప్పటికీ అక్కడి కంపెనీలు అదానీ గ్రూప్‌లో పెట్టుబడులను కలిగి ఉన్నందున అక్కడి సంస్థలు దర్యాప్తు జరపడానికి వీలుండటంతో యుఎస్ కోర్టు విచారణకు స్వీకరించిన విషయం తెలిసిందే.

వివేకా హత్య కేసులో .. బెయిల్ రద్దు పిటిషన్‌పై విచారణ వాయిదా

ప్రజాశక్తి - న్యూఢిల్లీ బ్యూరో

మాజీ మంత్రి వైఎస్ వివేకానంద రెడ్డి హత్య కేసులో బెయిల్ రద్దు పిటిషన్‌పై విచారణను సుప్రీంకోర్టు వాయిదా వేసింది. వైఎస్ అవినాష్ రెడ్డి, భాస్కర్ రెడ్డి, డి శివ శంకర్ రెడ్డి, గజ్జల ఉదయ్ కుమార్ రెడ్డికి ఇచ్చిన బెయిల్‌ను రద్దు చేయాలని వివేకా కుమార్తె సునీత నర్రెడ్డి దాఖలు చేసిన పిటిషన్లను మంగళవారం సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ సంజయ్ కుమార్‌తో కూడిన ద్విసభ్య ధర్మాసనం విచారణ జరిపింది. డి శివశంకర్ రెడ్డి తనయుడు జైలుకు వెళ్లి సాక్షులను బెదిరిస్తున్నారని, కనుక వారి బెయిల్ రద్దు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం అఫిడవిట్ దాఖలు చేసింది. రాష్ట్ర ప్రభుత్వం దాఖలు చేసిన అఫిడవిట్‌పై కౌంటర్ దాఖలు చేసేందుకు తమకు సమయం ఇవ్వాలని వైఎస్ అవినాష్ రెడ్డి తరపు సీనియర్ న్యాయవాది రంజిత్ కుమార్ కోరారు. దీంతో సమ్మతించిన సుప్రీంకోర్టు ధర్మాసనం తదుపరి విచారణను జూలై 21కి వాయిదా వేసింది. ఈలోపు ప్రతివాదులు కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశించింది. ఈ విచారణలో పిటిషనర్ తరపున సీనియర్ న్యాయవాది సిద్ధార్థ లూథ్రా హాజరయ్యారు.

కెనడా ఎన్నికల్లో లిబరల్ పార్టీ విజయం!

● ఓటమిని అంగీకరించిన కన్జర్వేటివ్ నేత
● ఓడిన జగ్మీత్ సింగ్
● ప్రధాని మార్క్ కార్నీకి ప్రధాని మోడీ అభినందనలు



కెనడా ప్రధాని మార్క్ కార్నీ అభివాదం


ఒట్టావా : కెనడా ఫెడరల్ ఎన్నికల్లో ప్రధాని మార్క్ కార్నీకి చెందిన లిబరల్ పార్టీ విజయం సాధించింది. 343 సీట్లు గల హౌస్ ఆఫ్ కామన్స్‌లో మెజారిటీ మార్క్ 172 సీట్లు సాధించడంలో విఫలమైనప్పటికీ ఇప్పటివరకు అందిన ఫలితాల ప్రకారం, లిబరల్ పార్టీ 145 స్థానాల్లో విజయం సాధించి, మరో 23 స్థానాల్లో ఆధిక్యతలో వుండి అతిపెద్ద పార్టీగా అవతరించింది. కన్జర్వేటివ్ పార్టీ 134 స్థానాలకే పరిమితమైంది. మరో 13 స్థానాల్లో ఆధిక్యంలో వుంది. ఈ పరిస్థితుల్లో కన్జర్వేటివ్ నేత పియరీ పొయిలివర్ ఓటమిని అంగీకరిస్తున్నట్లు ప్రకటించారు. ఫ్రాంకోయిస్ బ్లాంకెట్ నేతృత్వంలోని బ్లాక్ క్యూబికాయిస్ పార్టీ 22 సీట్లలో గెలుపొందింది. ఖలిస్తానీ అనుకూల జగ్మీత్ సింగ్ నేతృత్వంలోని న్యూ డెమోక్రటిక్ పార్టీ నాలుగు సీట్లలో గెలుపొందింది. బుర్నాబై సెంట్రల్ సీటు నుండి పోటీ చేసిన జగ్మీత్ సింగ్ ఓడిపోవడంతో ఎన్‌డిపి అధ్యక్ష పదవికి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. ట్రంప్ చేపట్టిన టారిఫ్‌ల యుద్ధం, కెనడాను తమ దేశంలో చేర్చుకుంటామని, 51వ రాష్ట్రంగా చేరాలని ట్రంప్ వ్యాఖ్యల నేపథ్యంలో కెనడాలో జరిగిన ఈ సార్వత్రిక ఎన్నికలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి. ఈ ఏడాది జనవరిలో జస్టిన్ ట్రూడో ప్రధాని పదవికి రాజీనామా చేశా రు. దాంతో లిబరల్ పార్టీ సభ్యులు ప్రధానిగా మార్క్ కార్నీని ఎన్నుకున్నారు. అనంతరం కార్నీ ముందస్తు ఎన్నికలను ప్రకటిం చడంతో సోమవారం (28న) ఎన్నికలు జరిగాయి.

విజయోత్సవ ప్రసంగంలో ట్రంప్ ప్రస్తావన

మెజారిటీ సీట్లు సాధించకపోయినా అతిపెద్ద పార్టీగా అవతరించిన లిబరల్ పార్టీ నేత మార్క్ కార్నీ ఒట్టావాలో విజయోత్సవ ప్రసంగం చేశారు. ఈ సందర్భంగా ట్రంప్ బెదిరింపులను ప్రస్తావిస్తూ, "అమెరికా నేత మనల్ని సొంతం చేసుకోవడానికి మనల్ని చీలుస్తామని బెదిరిస్తున్నారు. కానీ అదెన్నటికీ జరగదు" అని కార్నీ స్పష్టం చేశారు. అమెరికా బెదిరింపుల నేపథ్యంలో కెనడా ప్రజలందరూ సమైక్యంగా వుండాల్సిన ప్రాముఖ్యతను గుర్తించాలని కోరారు. అమెరికా జరిపిన ద్రోహం నుండి మనం బయటపడ్డాం. కానీ మనం ఈ గుణపాఠాలను ఎన్నడూ మర్చిపోరాదన్నారు. రెండు సార్వభౌమాధికార, స్వతంత్ర దేశాలుగా తాను, ట్రంప్ భవిష్యత్తుపై చర్చలు జరుపుతామని అన్నారు.

ప్రధాని మోడీ అభినందనలు

కెనడా ఎన్నికల్లో విజయం సాధించినందుకు ప్రధాని మార్క్ కార్నీకి ప్రధాని మోడీ అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఇరు దేశాలు కలిసి పనిచేసేందుకు తాను ఎదురుచూస్తున్నట్లు మోడీ ఎక్స్ పోస్టులో పేర్కొన్నారు. ఇరు దేశాల ప్రజల సంక్షేమం కోసం మన భాగస్వామ్యాన్ని మరిం త బలోపేతం చేసుకోవాలని ఆకాంక్షిస్తున్నట్లు తెలిపారు.



సమావేశంలో మాట్లాడుతున్న ప్రధాని మోడీ

సైన్యానికి పూర్తి స్వేచ్ఛ

(మొదటిపేజీ తరువాయి)

రక్షణశాఖ అధికారులు పాల్గొన్నారు. దేశంలో అంతర్గత భద్రతతోపాటు సరిహద్దుల్లో నెలకొన్న పరిస్థితులపై చర్చించారు. ఉగ్రవాదాన్ని అణచివేయడం జాతీయ సంకల్పమని ఈ సందర్భంగా ప్రధాని పునరుద్ఘాటించారు. ఉగ్రవాదాన్ని సమూలంగా నిర్మూలించేందుకు ప్రభుత్వం దృఢనిశ్చయంతో వుందన్నారు. పహల్గాం దాడికి దీటైన బదులిస్తామని ప్రధాని తెలిపారు. ఇందుకు సంబంధించి కార్యాచరణ రూపొందించుకోవడంలో భారత సైన్యానికి పూర్తి స్వేచ్ఛనిస్తున్నామని, ఎప్పుడు, ఎక్కడ ఎలా స్పందించాలో, ఏ లక్ష్యాలపై దాడులు జరపాలో అంతా సైన్యమే నిర్ణయం తీసుకుంటుందని మోడీ స్పష్టం చేశారు.

కేంద్ర హోంశాఖలో ఉన్నత స్థాయి సమావేశం

మరోవైపు కేంద్ర హోం మంత్రిత్వ శాఖ ఉన్నత స్థాయి సమావేశం జరిగింది. కేంద్ర హోం కార్యదర్శి గోవింద్ మోహన్, బిఎస్‌ఎఫ్, అస్సాం రైఫిల్స్ జాతీయ భద్రతాదళం డైరెక్టర్ జనరల్స్ పాల్గొన్నారు. సిఐఎస్‌ఎఫ్, కేంద్ర రిజర్వ్ పోలీసు బలగాల సీనియర్ అధికారులు కూడా పాల్గొన్నారు. ప్రస్తుతం దేశంలో నెలకొన్న తాజా పరిణామాలపై ఆ సమావేశంలో చర్చించినట్లు తెలుస్తోంది.

వ్యవసాయ విద్యకు ప్రోత్సాహం

(మొదటిపేజీ తరువాయి)

విద్యను నాలుగు గోడల మధ్య కాకుండా పంట పొలాల్లో నేర్చుకోవాలన్నారు. గ్రామీణ రైతాంగంతో విద్యార్థులు మమేకం కావాలని సూచించారు. గ్రామీణ జీవన విధానంపై అధ్యయనం చేయాలన్నారు. వ్యవసాయంతోపాటు పాడి పరిశ్రమ, మత్స్య, ఆక్వా ఉత్పత్తుల్లో వస్తోన్న మార్పులు, సమస్యలపై దృష్టి సారించాలని కోరారు. వ్యవసాయ శాఖ ప్రత్యేక కార్యదర్శి బి రాజశేఖర్ ,వ్యవసాయ శాఖ కమిషనర్ ఢిల్లీరావు, ఎమ్మెల్యేలు ఏలూరు సాంబశివరావు, బి.రామాంజనేయులు, అలపాటి రాజేంద్రప్రసాద్, నాబార్డు మాజీ చైర్మన్ చింతల గోవిందరాజులు తదితరులు ప్రసంగించారు. మంగళవారం ఉదయం జరిగిన సాంకేతిక సదస్సుకు పలువురు సీనియర్ సైంటిస్టులు, విశ్వవిద్యాలయం మాజీ వైస్‌ఛాన్సలర్లు హాజరయ్యారు. రానున్న కాలంలో ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్, వాతావరణ అనుకరణాల నీటిపారుదల వినియోగం, నిర్వహణ, ప్రకృతి వ్యవసాయం, వినూత్న పరిశోధనలపై దృష్టి సారించాలని సూచించారు. 1964 నుంచి ఇప్పటి వరకు విశ్వవిద్యాలయం సాధించిన ప్రగతి, పరిశోధనలపై చర్చించారు. వైస్‌ఛాన్సలర్ శారద జయలక్ష్మీదేవి నివేదికను సమర్పించారు. కేంద్ర వ్యవసాయ ధరల నిర్ణాయక సంస్థ నుంచి డాక్టర్ విజయపాల్ శర్మ, రైతు సాధికారిక సంస్థ వైస్ చైర్మన్ విజయకుమార్, అగ్రిమిషన్ వైస్ చైర్మన్ మర్రెడ్డి శ్రీనివాస్ ప్రసంగించారు.

రూ.6.60 లక్షల కోట్లతో రుణప్రణాళిక

(మొదటిపేజీ తరువాయి)

ప్రతి నియోజకవర్గంలోనూ ఎంఎస్‌ఎంఇలు, రతన్‌టాటా ఇన్నోవేషన్‌హబ్‌లు ఏర్పాటు చేసున్నట్లు పేర్కొన్నారు. 2029 నాటికల్లా పేదరికం నిర్మూలించేందుకు పి4 అమలు చేస్తున్నామని చెప్పారు. విశాఖ ఆర్థికాభివృద్ధిలో అనూహ్యంగా పురోగతి సాధిస్తోందని, పారిశ్రామికంగా అభివృద్ధి చెందుతోందని తెలిపారు. అమరావతిని భవిష్యత్ అవసరాల వేదికగా చేస్తున్నామని చెప్పారు. రాయలసీమను హార్టికల్చర్ హబ్, ఎలక్ట్రానిక్ ఉత్పత్తుల కేంద్రంగా తీర్చిదిద్దుతున్నాయని వివరించారు. పెట్రో కారిడార్‌పై బ్యాంకర్లు దృష్టి పెట్టాలని సూచించారు. మత్స్యకారులకు నేరుగా రుణాలు ఇవ్వాలని కోరారు. సముద్ర ఆర్థిక వ్యవస్థలో ఎన్నో అవకాశాలు ఉన్నాయని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అలాగే డ్వాక్రా మహిళలు, కౌలు రైతులు, ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనార్టీల ఎదుగుదలకు ప్రత్యేకంగా ఏమి చేయాలో ఆలోచించాలని సిఎం సూచించారు.



మీ కోసం

గులాబీ మొక్కలు, మల్లెమొక్కలు ఎక్కువ పూలు పూయాలంటే.. ఒక చెంచా ఎక్స్పైరీ అయిన దగ్గు మందును ఒక లీటరు నీటిలో కలిపి రాత్రంతా ఆ నీటిని అలానే ఉంచి ఉదయం మొక్కల పాదుల్లో పోయాలి.

జీవన సౌరభం

అహంకారం సృష్టించే చీకటిని ఛేదించడం ఎవ్వరికీ సాధ్యం కాదు.

స్నేహ పరిమళం



వేసవి సెలవులు ఇవ్వడంతో ఆ ఊర్లోని పిల్లలంతా గుంపులు గుంపులుగా ఒక్కోచోటకి చేరారు. రవి, కృష్ణ ఆ ఊర్లోనే ఉంటారు. వారిద్దరూ ఒకే తరగతి పిల్లలైనా ఒకరంటే మరొకరికి పడేది కాదు. క్లాసులో పిల్లలందరూ రవి టీంలో గాని, కృష్ణ టీంలో గానీ ఉండేవారు. పోటీలు కూడా పెట్టుకునేవారు. వాళ్ళతో పాటే చదువుతున్న కాస్త లావుగా, బొద్దుగా ఉండే హరి అంటే మాత్రం ఎవరికీ నచ్చేది కాదు. పిల్లలంతా హరిని 'బండోడా' అంటూ ఎగతాళి చేసేవారు.

ఈసారి వేసవి సెలవులిచ్చాక, రవి, కృష్ణ టీం ఊరి చివర కాలువ దగ్గరికి ఈతల పోటీ కోసం వెళ్లారు. మిత్రుల ద్వారా ఈ విషయం తెలుసుకున్న హరి పోటీలను చూడడానికి వాళ్ళ వెనకాతలే కాస్త ఆలస్యంగా బయలుదేరాడు. దారిలో రచ్చబండ దగ్గర పెద్దలంతా చేరి 'కాలువలో నీరు తగ్గిపోయిందని, పశువులకి మంచినీరు సరిపోవట్లేదని, తోటలకి నీరు మరింతగా పెట్టాల్సిన అవసరం ఉంది కాబట్టి ఈరోజు గేట్లు తీసి నది నీటిని కాలువలోకి వదులుతున్న'ట్లు చెప్పుకున్నారు.


అది విని హరి కంగారుగా అరుచుకుంటూ కాలువ వైపు పరిగెత్తాడు. ఎవరో ప్రమాదంలో ఉన్నారని గ్రహించిన పెద్దవాళ్లు కూడా హరిని వెంబడించారు. అప్పటికే ఈతపోటీలో ఉన్న రవి, కృష్ణ ఉధృతికి కొట్టుకు పోసాగారు. ఈత తెలిసిన కొందరు కుర్రాళ్ళు కాలువలోకి దిగి వారిద్దరినీ కాపాడారు.

హరిద్వారానే రక్షించబడినట్లు తెలుసుకుని ఆ రోజు నుండి హరితో స్నేహం చేయాలని రవి, కృష్ణ నిర్ణయించుకున్నారు. ఈలోపు అక్కడికి చేరిన పెద్ద వాళ్ళు పిల్లలందరితో ఇలా చెప్పారు.

'పిల్లలూ, ఇప్పుడు మీకు సెలవులు ఇచ్చారు. ఆటలాడుకోవడానికి బోలెడు సమయం ఉంది. అయితే కొన్ని జాగ్రత్తలు తీసుకోవాలి. తోటల్లో ఆటలాడేటప్పుడు విషపు పాములు వల్ల ప్రమాదం ఉంటుంది. పెద్దపెద్ద చెట్లు ఎక్కేటప్పుడు జాగ్రత్తగా ఉండాలి. అల్పంగా ఉండే వాటి కొమ్మలు విరిగిపోయే ప్రమాదం ఉంటుంది. అలాగే జలాశయాలు, నదులు, కాలువలు, లోతైన చెరువుల్లో ఈత కొట్టడం ప్రమాదం. ఆటలు ఆడడానికి వెళ్లేటప్పుడు తల్లిదండ్రులకు చెప్పి వెళ్లండి' అని చెప్పారు.

– నేదూరి భాను సాయి శ్రేయ
నరసాపురం,
93924 67155.

నేను గీసిన బొమ్మ





పి.వర్షిక,
8వ తరగతి,
సెయింట్ పీటర్స్ హైస్కూల్,
సికింద్రాబాద్.


గమనిక

వేసవి సెలవుల్లో పిల్లలకు తోడుగా మే 1 నుంచి 'చిన్నారి' పేజీ 'వేసవి విడిది'గా ముస్తాబవుతుంది. ఈ సందర్భంగా విద్యార్థినీ విద్యార్థుల రచనలను ఆహ్వానిస్తున్నాం. కథలు, కవితలు, బొమ్మలు, సెలవుల్లో మీ అనుభవాలు, ప్రయాణ విశేషాలు, ఇతరత్రా కబుర్లూ చిన్నారి మెయిల్‌కి/ వాట్సాప్ నెం : 83329 25496కి పంపండి.

– ఎడిటర్

పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

మలేరియాను మట్టుపెడదాం





మలేరియా వ్యాధి దోమల ద్వారా వ్యాపిస్తుంది. మురుగునీటి నిల్వలున్న ప్రాంతాల్లో ఈ దోమల లార్వా వృద్ధి చెందుతుంది. మలేరియా జ్వరానికి మూలం 'ప్లాస్మోడియం' అనే పరాన్నజీవి. ఇది దోమలతో ముఖ్యంగా ఆడ అనాఫిలస్ దోమల ద్వారా ఒకరి నుంచి మరొకరికి వ్యాప్తిస్తుంది. దోమలు తమ గుడ్లను రక్తంలో వృద్ధి చేసుకోవటానికి మనుషులను కుడుతుంటాయి. అప్పటికే మలేరియాతో బాధ పడుతున్న వ్యక్తిని దోమ కుడితే దానికీ పరాన్న జీవి సోకుతుంది. ఆ దోమ మరొకరిని కుట్టినప్పుడు లాలాజలం ద్వారా వ్యక్తి రక్తంలోకి పరాన్నజీవి ప్రవేశిస్తుంది. ఇది కాలేయంలోకి చేరుకొని పరిపక్వమై, వృద్ధిచెందుతుంది. కాలేయ కణాలను ఇన్‌ఫెక్షన్‌కు గురిచేస్తుంది. ఆ క్షణాలు విచ్చిన్నం కావటం వల్ల పరాన్న జీవులు రక్తంలోకి, తర్వాత ఎర్ర కణాలకు చేరుకుని ఇన్ఫెక్షన్‌ను కలుగ చేస్తాయి. మలేరియా కారక పరాన్న జీవిలో ఫాల్సిఫారమ్, వైవాక్స్, ఒవేల్, మలేరియా అనే రకాలున్నాయి. రాష్ట్రప్రభుత్వ ఆరోగ్య, వైద్య కుటుంబ సంక్షేమ శాఖ ఏడాది పొడవునా దోమల నియంత్రణ చర్యలు తీసుకుంటున్నాం. గతంతో పోలిస్తే మలేరియా కేసులు ఏటేటా తగ్గుముఖం పడుతుండటం ఎంతో స్వాగతించాల్సిన విషయం. మనదేశంలో మలేరియా కేసులు, మరణాల సంఖ్య తగ్గుముఖం పడుతున్నట్లుగా వరల్డ్ మలేరియా రిపోర్టులను బట్టి తెలుస్తోంది. ఏటేటా సీజన్ మారినప్పుడు దోమల ఉధృతి ఎక్కువగా ఉంటుంది. ఇలాంటి సమయంలో తగిన జాగ్రత్తలు తీసుకుంటే మలేరియా నివారణ సాధ్యమే. జబ్బు భారిన పడ్డా సరైన చికిత్సలు తీసుకుంటే తీవ్రం కాకుండా, ప్రాణాలకు అపాయం కలుగకుండా చూసుకోవచ్చు. ప్రజలు కూడా అవగాహన పెంచుకుని అందుబాటులో ఉన్న ప్రభుత్వ వైద్యసేవలను ఉపయోగించుకుంటే మలేరియా నిర్మూలన సాధ్యమవుతుంది. మలేరియా నిర్మూలనా కార్యక్రమాల్లో కూడా ప్రజలు కూడా భాగస్వాములు కావాలి. ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతను పాటిస్తూనే పరిసరాల పరిశుభ్రతను కాపాడటం ద్వారా దోమలు వృద్ధి చెందకుండా ఉంటాయి.

పరీక్షలు

ర్యాపిడ్ డయాగ్నొస్టిక్ టెస్ట్ (ఆర్‌డిటి) ప్యారాసైట్ ఎఫ్, వి ద్వారా ఫాల్సిఫారమ్, వైవాక్స్ రకం మలేరియాను నిర్ధారించొచ్చు. మలేరియా పరాన్న జీవికి చెందిన ప్రత్యేక ప్రొటీన్ ఆధారంగా ఇది సమస్యను గుర్తిస్తుంది. రెండు కన్నా ఎక్కువ రకాల పరాన్న జీవులను గుర్తించటానికి 'పారా మ్యాక్స్ కిట్' కూడా అందుబాటులోకి వచ్చింది.

చికిత్సలు ఎలాగంటే?

ఫాల్సి ఫారమ్ రకం మలేరియాకు ఆర్టీమినిసిస్ మందు బాగా ఉపయోగపడుతుంది. లూమిఫాంటిన్, మెఫ్లోక్విన్, సల్ఫాడాక్సిన్, పైరిమెథమైన్ వంటి మందులూ అవసరమవుతాయి. వీటితో ఫాల్సిఫారమ్ మలేరియా పూర్తిగా తగ్గుతుంది. వైవాక్స్ రకం మలేరియా క్లోరోక్విన్ మాత్రలతో తగ్గినా కొన్నాళ్లకు తిరగబెట్టొచ్చు. అందుకే రెండువారాలపాటు 'ప్రైమాక్విన్' మందునూ వాడుకోవాల్సివుంటుంది.

పెద్ద ఎత్తున కార్యక్రమాలు

జాతీయ కీటక జనిత వ్యాధి నిరోధక కార్యక్రమం (ఎన్‌విబిడిసిపి)లో భాగంగా మలేరియా, డెంగ్యూ, చికున్‌గున్యా, జపనీస్ ఎన్సెఫలైటిస్, ఫైలేరియాకు సంబంధించిన కార్యక్రమాలను రాష్ట్రప్రభుత్వం, ఎన్‌హెచ్ఎం సహకారంతో నిర్వహిస్తోంది. మలేరియా, ఇతర వ్యాధికారక దోమలతో కలిగే వ్యాధులకు ప్రాథమిక నిర్ధారణ, పూర్తి చికిత్సలు అందుబాటులో ఉన్నాయి. సమగ్ర దోమ నియంత్రణ చర్యలు (ఎల్ఎల్ఐఎన్ఎస్)లో భాగంగా పురుగుమందుల స్ప్రే (ఐఆర్ఎస్)లను ప్రతిరోజూ విద్య, గ్రామీణ మంచినీటి సరఫరా, పంచాయతీరాజ్, మున్సిపల్‌శాఖల సమన్వయంతో సంయుక్తంగా నిర్వహిస్తున్నాం. రాష్ట్రంలో 2024లో జనవరి నుంచి డిసెంబర్ వరకూ 1,09,45,778 మంది జ్వరం లక్షణాలున్న వ్యక్తులను స్క్రీన్ చేసి 1,25,155 వైరల్ ఫీవర్ కేసులను గుర్తించి చికిత్సలు అందించాం.


> **ప్రపంచ మానవాళిని వేధిస్తున్న సమస్యల్లో దోమల కాటు కూడా ఒకటి. వీటి ద్వారానే మలేరియా వ్యాధి వ్యాపిస్తుంది. ప్రపంచ ఆరోగ్య సంస్థ లెక్కల ప్రకారం ఏటా లక్షలాదిమంది ఈ వ్యాధి ప్రభావానికి గురౌతున్నారు. మనదేశంలోనూ, అందులోనూ మన రాష్ట్రంలో మలేరియా కేసులు, మరణాలు తగ్గుతున్నట్లుగా వరల్డ్ మలేరియా రిపోర్టు చెబుతోంది. నిజానికి తగిన జాగ్రత్తలు తీసుకుంటే మలేరియాను నివారించుకోవటం అసాధ్యమేమీ కాదు. జ్వరం బారినపడ్డా సరైన చికిత్స తీసుకుంటే తీవ్రం కాకుండా ప్రాణాలకు అపాయం కలగకుండా చూసుకోవచ్చు.**

ప్రత్యేక కార్యక్రమాలు

వెక్టర్ కంట్రోల్ అండ్ హైజీన్ యాప్ ప్రవేశపెట్టి వ్యాధి కారక, దోమల నియంత్రణ చర్యలపై డిజిటల్ ప్లాట్‌ఫాంలో అవగాహనా కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. ప్రతి శుక్రవారం ఫ్రైడే డ్రైడే కార్యక్రమాన్ని గ్రామ, వార్డు సచివాలయాల స్థాయిలో అమలు చేస్తున్నాం. జిల్లా కలెక్టర్, డిఎంఅండ్‌హెచ్ఒలు సమీక్షా సమావేశాలు నిర్వహించి వ్యాధుల నియంత్రణపై చర్యలు తీసుకుంటున్నారు. గ్రామస్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించి ప్రజలకు స్వచ్ఛత వ్యక్తిగత రక్షణ చర్యలుపై అవగాహన కల్పిస్తున్నాం. మలేరియాను 2027 నాటికి పూర్తిగా నిర్మూలించాలనే లక్ష్యంతో కృషిచేస్తున్నాం.



– డాక్టర్ బంగారి రామారావు
కృష్ణా జిల్లా మలేరియా నివారణా అధికారి,
మచిలీపట్నం,
సెల్ : 94937 62711



రాకుండా చూసుకోవటమే ఉత్తమం

మలేరియా వచ్చాక బాధపడటం కన్నా దీని బారినపడకుండా చూసుకోవటమే ఉత్తమం. అన్నింటి కన్నా మున్నమైంది దోమలు కుట్టకుండా చూసుకోవటం.

- ఇంట్లో బాగా గాలి, వెలుతురు వచ్చేలా చూసుకోవాలి
- ఇంట్లోకి దోమలు రాకుండా తెరలు, మెష్‌లు ఉపయోగించాలి
- నిద్రించే సమయంలో అందరూ మంచాలకు దోమ తెరలు కట్టుకోవాలి.
- ఇంట్లోను, బయట ప్రాంతాల్లో దోమలు కుట్టకుండా చూసుకోవాలి
- దోమలు కుట్టకుండా ఫ్యాంట్లు, చొక్కాలు ధరించాలి.
- బయటకు వెళ్లినప్పుడు సాక్కులు వేసుకోవటం మేలు
- చర్మానికి దోమలను వికర్షించే పూత మందు రాసుకోవాలి
- ఉధృతి ఎక్కువగా ఉంటే దోమల బ్యాట్లు, స్ప్రేలను కూడా వాడొచ్చు.
- దోమల లార్వా ఇంటి గోడలపైన, కప్పులపై ఉంటాయి. మందు స్ప్రే చేస్తే చనిపోతాయి.
- ఇంటి పరిసరాల్లో మురుగునీటి నిల్వలు లేకుండా చూసుకోవాలి
- కొబ్బరి చిప్పలు, పాతటైర్లు ఉంటే వెంటనే దూరంగా పారేయాల్సి.
- వాడనప్పుడు కూలర్లలో నీరు లేకుండా చూసుకోవాలి

మలేరియా లక్షణాలు ఇవీ...


- ప్రధాన లక్షణం చలి, వణుకుతో కూడిన తీవ్ర జ్వరం.
- కారక పరాన్నజీవి రక్తకణాలను విచ్చిన్నం చేయటంతో విషతుల్యాలు పుట్టుక
- కొందరికి తలనొప్పి, ఒళ్లు నొప్పులు, వికారం, వాంతులు
- చిన్నపిల్లలకు నీళ్ల విరోచనాలూ కావొచ్చు.
- రక్త కణాలు విచ్చిన్నంతో రక్తహీనత–తీవ్రత ఎక్కువైతే కామెర్లు

ఎస్ఆర్ఎం విద్యార్థి ఆత్మహత్య

- భవనం పై నుంచి దూకిన వైనం
- వేధింపులే కారణమంటూ తల్లిదండ్రుల ఆవేదన



సుభాష్ (ఫైల్ ఫోటో)



మీడియాతో మాట్లాడుతున్న సుభాష్ తల్లిదండ్రులు

ప్రజాశక్తి–గుంటూరు జిల్లా ప్రతినిధి

గుంటూరు జిల్లా మంగళగిరి మండలం నీరుకొండలోని ఎస్ఆర్ఎం విశ్వవిద్యాలయంలో ఓ విద్యార్థి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మంగళవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నెల్లూరు జిల్లా సూళ్లూరుపేటకు చెందిన సుభాష్ అనే విద్యార్థి ఎస్ఆర్ఎం విశ్వవిద్యాలయంలో బిటెక్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నారు. మంగళవారం ఉదయం వర్సిటీ భవనం పై నుండి దూకి ఆత్మహత్య చేసుకున్నారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. విద్యార్థి మృతదేహాన్ని ఎన్ఆర్ఐ వైద్యశాలకు తరలించారు. వర్సిటీ యాజమాన్యం ఇచ్చిన సమాచారం మేరకు విద్యార్థి తల్లిదండ్రులు ఆస్పత్రికి చేరుకున్నారు. మతదేహాన్ని చూసి కన్నీటిపర్యంతమయ్యారు.

లక్షల రూపాయలు చెల్లించింది శవాన్ని తీసుకెళ్లడానికా..!

సుభాష్ తల్లిదండ్రులు ఎన్ఆర్ఐ వైద్యశాల వద్ద మీడియాతో మాట్లాడుతూ ఎన్నో ఆశలతో తమ కుమారుడిని ఎస్ఆర్ఎం విశ్వవిద్యాలయంలో చేర్పించామని తెలిపారు. లక్షల రూపాయల ఫీజులు చెల్లించింది శవాన్ని తీసుకెళ్లడానికా అని ఆవేదన వ్యక్తం చేశారు. 75 శాతం హాజరు ఉండాలన్న నిబంధన పెట్టారని, తమ కుమారుడికి 69 శాతం హాజరు ఉందని, కేవలం 6 శాతం హాజరు తగ్గిందన్న కారణంతో హాల్ టికెట్ నిరాకరించి పరీక్షలు రాసేందుకు అనుమతించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. వర్సిటీ యాజమాన్యాన్ని కలిసి హాల్ టికెట్ ఇవ్వాలంటూ తాము కూడా అభ్యర్థించినా వినలేదని తెలిపారు. హాల్ టికెట్ ఇవ్వకపోవడం వలన పరీక్షలకు హాజరు కాలేదని, దీంతో మనస్తాపం చెంది తమ కుమారుడు ఆత్మహత్యకు పాల్పడ్డారని వాపోయారు. ఉదయం 6:30 గంటలకు తమ కుమారుడు ఆత్మహత్యకు పాల్పడితే తమకు 10 గంటలకు సమాచారం ఇచ్చారని, ఇంత జాప్యం జరిగిందంటే ఆ సమయంలో యాజమాన్యం ఏం చేస్తోందని నిలదీశారు. తమ కుమారుడి మృతికి ఎస్ఆర్ఎం యాజమాన్యం వేధింపులే కారణమని, దీనికి వారే బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. విశ్వవిద్యాలయానికి చెందిన పలువురు విద్యార్థులు మాట్లాడుతూ.. ఫీజులు కట్టించుకోవడం వరకే యాజమాన్యం పరిమితం అవుతుందని, తమ యోగక్షేమాలపై శ్రద్ధ వహించడంలేదని విమర్శించారు. ఎస్ఆర్ఎం విద్యార్థి మృతిపై సమగ్ర విచారణ జరిగించాలని సిపిఎం గుంటూరు జిల్లా కార్యదర్శి వై నేతాజీ, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎం కిరణ్ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు.

నల్లబర్లీ పొగాకు కొనండి : మంత్రి అచ్చెన్న

ప్రజాశక్తి–గుంటూరు జిల్లా ప్రతినిధి



గుంటూరు, పల్నాడు, బాపట్ల, ప్రకాశం జిల్లాల్లో విస్తారంగా సాగు చేసిన నల్లబర్లీ పొగాకును వెంటనే కొనుగోలు చేయాలని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కె.అచ్చెన్నాయుడు వ్యాపారులను కోరారు. గుంటూరు జిల్లా లాంలోని వ్యవసాయ విశ్వవిద్యాలయంలో మంగళవారం రాత్రి జరిగిన సమీక్షలో ఆయన మాట్లాడారు. దాదాపు 65 వేల ఎకరాల్లో సాగు అయిన నల్లబర్లీ పొగాకు కొనుగోలు చేయడంలేదని పర్చూరు ఎమ్మెల్యే ఏలూరు సాంబశివరావు మంత్రి దృష్టికి తెచ్చారు. పర్చూరు, చిలకలూరిపేట, ప్రత్తిపాడు, అద్దంకి తదితర నియోజకవర్గాల్లో ఈ ఏడాది ఎక్కువగా పంట సాగు చేశారని, వ్యాపారులు కొనుగోలు చేయడంలేదని, బోర్డు పట్టించుకోవడం లేదని తెలిపారు. ఈ అంశంపై మంత్రి స్పందిస్తూ ఆంక్షలు లేకుండా బర్లీ పొగాకును వెంటనే కొనాలని, ఆంక్షలు పెడితే సహించేదిలేదని వ్యాపారులను హెచ్చరించారు. వ్యవసాయ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రాజశేఖర్, వ్యవసాయశాఖ కమిషనర్ ఢిల్లీరావు తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ కార్మిక, గ్రామీణ మహిళా కార్మికుల సమస్యలపై

అఖిల భారత ఉద్యమం

- మే 9, 10 తేదీల్లో కేరళలో అఖిల భారత సదస్సు
- ముఖ్యఅతిథిగా కేరళ సిఎం పినరయి విజయన్
- ఎఐఎడబ్ల్యుయు జాతీయ ప్రధాన కార్యదర్శి బి వెంకట్

ప్రజాశక్తి–న్యూఢిల్లీ బ్యూరో

వ్యవసాయ కార్మిక, గ్రామీణ మహిళా కార్మికుల సమస్యలపై అఖిల భారత ఉద్యమానికి శ్రీకారం చుట్టినట్లు ఎఐఎడబ్ల్యుయు జాతీయ ప్రధాన కార్యదర్శి బి వెంకట్ పేర్కొన్నారు. మంగళవారం కర్ణాటకలో గుల్బర్గాలో జరిగిన సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వ్యవసాయ, గ్రామీణ రంగంలో జరిగే పనుల్లో క్రమంగా మహిళల పాత్ర పెరుగుతోందన్నారు. ప్రత్యేకించి సంస్కరణలు అమలవుతున్న నేపథ్యంలో 60 నుండి 70 శాతం మహిళా కూలీలే వ్యవసాయం, గ్రామీణ ఉపాధిలో ఉన్నారన్నారు. యాంత్రీకరణ, పంటల్లో మార్పులు, ప్రభుత్వ విధానాల వల్ల పురుషులకు పనిదినాలు ఏడాదికి 40, 50 పని దినాలే గగనమయ్యాయని అన్నారు. వ్యవసాయమంటే మహిళలనే స్థితి ఏర్పడిందని అన్నారు. వ్యవసాయ కూలీలు, అందులోనూ మహిళల స్థితి అత్యంత అధ్వానంగా ఉందన్నారు. మహిళలుగా ప్రత్యేక సమస్యలు ఎదుర్కొంటున్నారని అన్నారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వటం లేదన్నారు. అనేక రాష్ట్రాల్లో ఇళ్లు, సాగు భూమికి మహిళా పేరుతో పట్టాలు ఇవ్వటానికి పాలక పార్టీలు నిరాకరిస్తున్నాయన్నారు. బిజెపి అధికారంలోకి వచ్చిన తరువాత మహిళల పట్ల వివక్ష మరింత పెరిగిందని పేర్కొన్నారు. ప్రభుత్వ అండతోనే అత్యాచారాలు, అఘాయిత్యాలు ఎక్కువయ్యాయన్నారు. అందువల్ల వ్యవసాయ, గ్రామీణ పనుల్లో ఉన్న మహిళలందరినీ సమీకరించాలని వ్యవసాయ కార్మిక సంఘం నిర్ణయించిందన్నారు. జాతీయ సదస్సులో డిమాండ్ చార్టర్‌పై చర్చించి, అఖిల భారత ఉద్యమానికి పిలుపునిస్తామని పేర్కొన్నారు.

దేశవ్యాప్తంగా 500 మంది ప్రతినిధులు

మే 9, 10 తేదీల్లో కేరళలోని మలప్పురం జిల్లాలో అఖిల భారత వ్యవసాయ కార్మిక, రూరల్ వర్కర్స్ సదస్సు జరగనుందని బి వెంకట్ తెలిపారు. దేశవ్యాప్తంగా 500 మంది ప్రతినిధులు పాల్గొంటారని అన్నారు. మే 9న కన్వెన్షన్ ప్రారంభ సభకు బృందాకరత్, వాసుకి పాల్గొంటారని తెలిపారు. మే 10న జరిగే సెమినార్‌లో ప్రొఫెసర్ మధుర స్వామినాథన్ ప్రసంగిస్తారని అన్నారు. అదే రోజు జరిగే మహిళా బహిరంగ సభకు ముఖ్య అతిథిగా కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ హాజరుకానున్నారని తెలిపారు.

తిప్పేసిన స్నేహ్ రానా

- దక్షిణాఫ్రికాపై భారత్ గెలుపు
- బ్రిట్స్ సెంచరీ వృధా
- మహిళల ముక్కోణపు వన్డే సిరీస్



స్నేహ్ రాణా (5/43)

కొలంబో: ముక్కోణపు వన్డే సిరీస్‌లో భారత అమ్మాయిలు వరుసగా రెండో లీగ్ మ్యాచ్‌లోనూ విజయం సాధించారు. తొలి లీగ్ మ్యాచ్‌లో శ్రీలంకను ఓడించిన హర్మన్‌ప్రీత్ సేన.. మంగళవారం జరిగిన రెండో లీగ్ మ్యాచ్‌లో దక్షిణాఫ్రికాపై సంచలనం విజయం సాధించింది. ప్రేమదాస స్టేడియంలో జరిగిన మ్యాచ్‌లో హర్మన్‌ప్రీత్ కౌర్ సేన 15 పరుగుల తేడాతో సఫారీలపై గెలుపొందింది. దీంతో ఈ టోర్నీలో వరుసగా రెండో విజయంతో పాయింట్ల పట్టికలో అగ్రస్థానంలో నిలిచింది. భారత జట్టు నిర్దేశించిన 277 పరుగుల ఛేదనలో ఓపెనర్ తంజిమ్ బ్రిట్స్(109) సెంచరీతో చెలరేగి జట్టును గెలుపు వాకిట నిలిపింది. అయితే.. ఆల్‌రౌండర్ స్నేహ్ రానా(5/43) కీలక వికెట్లు తీసి మ్యాచ్‌ను మలుపుతిప్పింది. దాంతో, ప్రత్యర్థిని భారత్ 261 పరుగులకే కట్టడి చేసింది. తన అద్భుత ప్రదర్శనతో జట్టుకు విజయాన్నందించిన రానా ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ దక్కింది. అంతకుముందు ఓపెనర్ ప్రతీకా రావల్(74) అర్ధశతకంతో శుభారంభం ఇవ్వగా.. జెమీమా రోడ్రిగ్స్(41), కెప్టెన్ హర్మన్‌ప్రీత్(41)లు బ్యాటింగ్‌లో రాణించారు. చివర్లో రీచా ఘోష్(24) మెరుపులతో భారత్ నిర్ణీత 50 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 276 పరుగులు చేసింది. భారీ ఛేదనలో సఫారీ జట్టు ధీటుగా ఇన్నింగ్స్ ఆరంభించింది. ఓపెనర్లు లారా వొల్వార్డ్(43), తంజిమ్ బ్రిట్స్(109) తొలి వికెట్‌కు 140 పరుగులు జోడించి గట్టి పునాది వేశారు. లారాను ఔట్ చేసిన దీప్తి శర్మ భారత్‌కు తొలి బ్రేక్‌ను అందించింది. ఆ తర్వాత బంతి అందుకున్న స్నేహ్ రానా మ్యాజిక్ మాయాజాలంతో వరుసగా వికెట్లు తీసి ప్రత్యర్థిని ఒత్తిడిలో పడేసింది. దాంతో, మిడిలార్డర్ చేతులెత్తేయగా సఫారీలు 49.2ఓవర్లలో 261 పరుగులకే ఆలౌటయ్యారు. భారత బౌలర్లలో శ్రీచరణి, దీప్తి శర్మ, అరుంధతీ రెడ్డిలు తలా ఒక వికెట్ చొప్పున పడగొట్టారు.

స్కోర్‌బోర్డు...

భారత మహిళల ఇన్నింగ్స్: ప్రతిక రావల్ (బి)మాబా 78, స్మృతి మంధాన (సి)మెసో (బి)డెర్క్సెసన్ 36, హర్లిన్ డియోల్ (బి)మాబా 29, హర్మన్‌ప్రీత్ కౌర్ (నాటౌట్) 41, రోడ్రిగ్స్ (సి)కాకా (బి)క్లాస్ 41, రీచా ఘోష్ (సి)లూస్ (బి)కాకా 24, దీప్తి శర్మ (సి)ట్రయాన్ (బి)క్లార్క్ 9, కశ్వీ గౌతమ్ (నాటౌట్) 5, అదనం 13. (50ఓవర్లలో 6వికెట్ల నష్టానికి) 276పరుగులు.

వికెట్ల పతనం: 1/83, 2/151, 3/154, 4/213, 5/247, 6/259 **బౌలింగ్:** కాకా 8-1-42-1, క్లాస్ 9-1-43-1, లూస్ 4-0-24-0, క్లార్క్ 9-1-39-1, మాబా 10-0-65-2, డెర్క్సెసన్ 3-0-40-1, ట్రయాన్ 7-0-33-0.

దక్షిణాఫ్రికా మహిళల ఇన్నింగ్స్: వోల్వార్ట్ (ఎల్‌బి)దీప్తి 43, బ్రిట్స్ (సి అండ్ బి)స్నేహ్ రాణా 109, లారా (బి)స్నేహ్ రాణా 9, మెసో (బి)అరుంధతిరెడ్డి 28, ట్రయాన్ (సి)అమన్‌జ్యోత్ (బి)స్నేహ్ రాణా 18, డెర్క్సెసన్ (బి)స్నేహ్ రాణా 0, క్లాస్ (రనౌట్) అరుంధతిరెడ్డి 2, మాబా (రనౌట్) దీప్తి/రీచా 8, కాకా (నాటౌట్) 0, అదనం 7. (49.2ఓవర్లలో ఆలౌట్) 261పరుగులు. **వికెట్ల పతనం:** 1/140, 2/151, 3/181, 4/207, 5/240, 6/250, 7/251, 8/252, 9/253, 10/261 **బౌలింగ్:** కశ్వీ గౌతమ్ 7.22-0-47-0, అరుంధతి రెడ్డి 9-0-59-1, స్నేహ్ రాణా 10-0-43-5, ఎన్.ఛరాని 10-0-51-1, దీప్తి శర్మ 10-0-40-1, ప్రతికా రావల్ 3-0-17-0.

ఐపిఎల్‌లో నేడు

చెన్నై సూపర్‌కింగ్స్ X పంజాబ్ కింగ్స్
వేదిక: చెన్నై; రాత్రి 7.30గం॥లకు

కదం తొక్కిన కోల్‌కతా బ్యాటర్లు

ఢిల్లీపై 14పరుగుల తేడాతో నైట్‌రైడర్ గెలుపు



న్యూఢిల్లీ: ఇండియన్ ప్రిమియర్ లీగ్(ఐపిఎల్) సీజన్–18లో కోల్‌కతా నైట్‌రైడర్స్ బ్యాటర్లు కదం తొక్కారు. ఓపెనర్లు గుర్బాజ్, నరైన్‌కి తోడు మిడిలార్డర్‌లో రహానే, రఘువంశీ, లోయర్ ఆర్డర్‌లో రింకు సింగ్, ఆండీ రస్సెల్ సమిష్టిగా రాణించారు. దీంతో తొలిగా బ్యాటింగ్‌కు దిగిన కోల్‌కతా జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 9వికెట్ల నష్టానికి 204పరుగుల భారీస్కోర్‌ను నమోదు చేసింది. ఆ లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో ఢిల్లీ క్యాపిటల్స్ నిర్ణీత ఓవర్లు ముగిసేసరికి 9వికెట్లు కోల్పోయి 190పరుగులే చేసింది. దీంతో కోల్‌కతా 14పరుగుల తేడాతో విజయం సాధించింది. ఢిల్లీ జట్టు ఓపెనర్ డుప్లెసిస్(62) అర్ధసెంచరీకి తోడు అక్షర్ పటేల్(43), విప్‌రాజ్ నిగమ్(38) మాత్రమే బ్యాటింగ్‌లో రాణించారు. కోల్‌కతా బౌలర్లలో నరైన్‌కు మూడు, వరుణ్ చక్రవర్తికి రెండు, అనుకుల్ రాయ్, వైభవ్ అరోరా, రస్సెల్‌కు ఒక్కో వికెట్ దక్కాయి. అంతకుముందు టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన కోల్‌కతా నైట్ రైడర్స్‌కు ఓపెనర్లు శుభారంభం దక్కింది. సునీల్ నరైన్(27), రహ్మానుల్లా గుర్బాజ్(26)లు దూకుడుగా ఆడారు. దాంతో, పవర్ ప్లే 6 ఓవర్లలోనే 79పరుగులు వచ్చాయి. ఈ జోడీని విడదీసిన మిచెల్ స్టార్క్ విడదీశాడు. స్టార్క్ వేసిన 20వ ఓవర్లో రస్సెల్ తొలి బంతినే సిక్సర్‌గా మలవడంతో కోల్‌కతా స్కోర్ 200ల మార్క్ చేరింది. అయితే.. మూడో బంతికే పావెల్ ఎల్బీగా ఔట్ కాగా.. అనుకుల్ రాయ్(0)ని చమీర డైవింగ్ క్యాచ్‌తో డగౌట్‌కు పంపాడు. ఐదో బంతికి రస్సెల్ రనౌట్‌గా వెనుదిరిగాడు. అంతే.. స్టార్క్ హ్యాట్రిక్ మిస్ కాగా కోల్‌కతా 204కే పరిమితమైంది. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ నరైన్‌కు దక్కింది.



టాప్‌లో చిదంబరం

- ర్యాపిండ్ ఛెస్ ఛాంపియన్‌షిప్

న్యూఢిల్లీ: గ్రాండ్ చెస్ టూర్‌లో యువ గ్రాండ్‌మాస్టర్ అరవింద్ చిదంబరం సత్తా చాటాడు. మంగళవారం జరిగిన చివరి రౌండ్‌లో ఫ్రాన్స్‌కు చెందిన అలిరెజా ఫిరోజువాతో సంయుక్తంగా అగ్రస్థానంలో నిలిచాడు. వైల్డ్‌కార్డ్ ఎంట్రీతో ఈ టోర్నీ బరిలోకి దిగిన చిదంబరం అద్భుత ప్రదర్శనతో అదరగొట్టాడు. చివరి గేమ్‌లో స్లొవేనియా గ్రాండ్ మాస్టర్‌ను నిలువరించి డ్రాతో సరిపుచ్చుకున్నాడు. దీంతో 11పాయింట్లతో ఫ్రాన్స్ గ్రాండ్‌మాస్టర్‌తో సంయుక్తంగా టాప్‌లో ఉన్నాడు. భారత్‌కే చెందిన స్టార్ గ్రాండ్‌మాస్టర్ ఆర్. ప్రజ్ఞానంద రొమేనియాకు చెందిన డేవిడ్ గావ్రిలెస్కును ఓడించి నాల్గోస్థానానికి ఎగబాకాడు. దీంతో ప్రజ్ఞానంద 10పాయింట్లతో నాల్గో స్థానంలో ఉన్నాడు.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68